# కరువు జిల్లాలో కొత్త పాలెగాళ్ళు

(అనంతపురం జిల్లా ఫాక్షన్లపైన నివేదిక)



ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

(APCLC)

# కరువు జిల్లాలో
# కొత్త పాలెగాళ్లు

అనంతపురం జిల్లా ఫాక్షన్లపైన నివేదిక

---

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)

తేదీ : సెప్టెంబరు, 1998

ప్రతులు : 2000

వెల : 10 రూపాయలు

టైప్‌సెట్టింగ్ : భాగ్య, అజయ్, శ్రీశైల్ రెడ్డి

ప్రింటింగ్ : నవ్య ప్రింటర్స్, హైదరాబాద్

ప్రతులకు : పి.ఎల్. ఈశ్వర్ రెడ్డి
అడ్వకేట్, 8-30/ఎ
ఉమాపతప్ప వీధి, గుల్జార్‌పేట
అనంతపురం - 515 001

# ముందుమాట

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం దాదాపు ఆరు సంవత్సరాలుగా రాయలసీమ జిల్లాలలోని సాయుధ పెత్తందారీ ముఠాల ప్రాబల్యాన్ని ఒక పౌరహక్కుల సమస్యగా గుర్తించి దానికి వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన, చైతన్యం కలిగించడానికి కృషి చేస్తున్నది.

ఈ కృషిలో భాగంగా 'ఫాక్షన్' సంస్కృతికి ప్రధాన కేంద్రాలైన కర్నూలు, కడప జిల్లాలలో ఆ సమస్యను వివరంగా అధ్యయనం చేసి 'కర్నూలు పాలెగాళ్లు' (1993), 'కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యం' (1996) అనే నివేదికలను ప్రచురించాము.

ఆ తర్వాత అనంతపురం జిల్లాలో సాయుధ పెత్తందారీ ముఠాల ఆవిర్భావాన్నీ, స్వభావాన్నీ, ప్రజా జీవితంపైన వాటి ప్రభావాన్నీ అధ్యయనం చేశాము. 'ఫాక్షన్ ప్రాంతాలు' తిరిగి ఫాక్షనిస్టులతో, వారి అనుయాయులతో, బాధితులతో, తటస్థంగా వుండే వ్యక్తులతో వివరంగా మాట్లాడి ఈ నివేదిక రూపొందించాము.

రాయలసీమ జిల్లాలు ఫాక్షన్ సంస్కృతి నుండి, ఫాక్షనిస్టుల పెత్తనం నుండి బయటపడడం ఆ జిల్లాల సామాజిక జీవిత ప్రజాస్వామీకరణకు అవసరం. ఆ కర్తవ్యానికి ఈ నివేదిక కొంతమేరకైనా ఉపయోగ పడుతుందని ఆశిస్తాము.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

9 సెప్టెంబరు, 1998 (APCLC)

# 1. అనంతపురం గురించి, ఫాక్షన్ల గురించి

## ఒక చిత్రం

తాడిపత్రి ఆర్‌టిసి బస్టాండులో ఒక సాయంత్రం. పొద్దుగుంకి చాలాసేపయింది. గ్రామాల నుండి వచ్చే ఆఖరి బస్సులు బస్‌స్టాండుకు వస్తున్నాయి. హైదరాబాదుకూ బెంగుళూరుకూ పోయే నైట్ సర్వీసులు ప్లాట్‌ఫారం మీదికి రావలసి వుంది. బస్‌స్టాండు పగలు ఉన్నంత కిక్కిరిసి లేకున్నా జనం చాలామందే ఉన్నారు.

వారి మధ్య బాగా తాగి ఉన్న ఒక వ్యక్తి గట్టిగా అరుస్తున్నాడు. అతని బట్టలు అస్తవ్యస్తంగా ఉన్నాయి, చినిగి వున్నాయి. తనను తాను 'ఈ బోయోడు ' అని అతను ప్రస్తావించడాన్ని బట్టి అతను బోయ కులస్తుడని అర్థమవుతున్నది. తాగిన ఉద్రేకంలో అతను ఎవరెవరినో బూతులు తిడుతున్నాడు. వాళ్ల భార్యలనూ,తల్లులనూ తిడుతున్నాడు. జనంలో కొందరికిది కాలక్షేపం, కొందరికి న్యూసెన్స్, కొందరికి పట్టని విషయం. 'వాడ్ని తరిమేవాళ్లెవరూ లేరా ' అని ఎవరో అడిగితే 'బోయోనితో ఎవరు గలాట పెట్టుకుంటారు' అని ఒకరంటే, 'పోలీసులిప్పటికే ఒకసారి బాగా కొట్టి పోయినారు, అయినా వాడి మైకం దిగలేదు' అని అంతకుముందు నించి ఉన్నవాళ్ళు జవాబుచెప్పారు. హైదరాబాదు పోయే బస్సు డ్రైవరు 'నా బస్సులో ఏసుకపోయేదా - కాలక్షేపం అవుతుంది' అంటే ఒక ప్రయాణీకుడు 'అంతపని చేసేవు' అని వారించాడు.

అంతా సరదాగానే వుంది. కానీ పిచ్చి పిచ్చిగా కేకలు వేస్తున్న ఆ బోయతలను అకస్మాత్తుగా 'తిమ్మంపల్లి సూరి', 'దివాకర్' అనే ఇద్దరి పేర్లు ప్రస్తావించాడు.అందరినీ తిట్టినట్టు వాళ్ల భార్యలనూ తల్లులనూ కూడా తిట్టసాగాడు. ఒక్కసారిగా బస్‌స్టాండ్‌లో వాతావరణం మారిపోయింది. తమ మాటలలో పనులలో మునిగి ఉన్న జనమంతా బిగుసుకొని పోయారు. అతని వైపు తిరిగారు. పదహైదు లేక ఇరవై మంది గుంపుగా అతనిని చుట్టుముట్టారు. 'వాళ్ల పేర్లెందుకు ...' 'వాళ్లతో ఏం పని వీనికి ...' 'వీణ్ణేమనా అన్నారా చేసినారా ...' అని టెన్షన్

నిండిన గొంతులతో గొణిగారు. గుంపులో నుండి ఒకతను - బట్టలను బట్టి ఆర్‌టిసి ఉద్యోగి అయివుండాలి - దూసుకుపోయి అతనిని పట్టుకొని విపరీతంగా కొట్టాడు. మరి కొందరు కూడ అతనిని అనుసరించారు. అతనిని కిందపడేసి తన్ని బస్‌స్టాండు నుండి తరిమేసారు. తరువాత ఎవరి బస్సులు వాళ్లెక్కి - ప్రయాణీకులు,సిబ్బంది- ' వాళ్ల పేర్లెందుకు వీడికి ...' అనుకుంటూ వెళ్లిపోయారు.

ఈ 'తిమ్మంపల్లి సూరి', 'దివాకర్' ఎవరు? ప్రజలకు వాళ్లంటే అంత ప్రేమా? లేకపోతే వాళ్లను బహిరంగంగా ఎవరయినా తిడితే - తిట్టింది తాగుబోతే అయినా - ఏం కొంపలు మునుగుతాయో అన్న భయమా? 'తిమ్మంపల్లి సూరి' పూర్తిపేరు సూర్యప్రతాపరెడ్డి. చిన్న పేరు సూరి. పత్రికలకు 'సూర్యుడు'. తిమ్మంపల్లి అతని ఊరు. (రాయలసీమలోనూ అందరికీ ఇంటి పేర్లుంటాయి గానీ రెడ్లను ఊరిపేరును బట్టి , కింది కులాల వాళ్లను కులం పేరును బట్టి పిలవడం అలవాటు). అతను తనను తాను ప్రస్తుతం తెలుగుదేశం మద్దతుదారునిగా వర్ణించుకుంటాడు. అయినా కాకపోయినా కాంగ్రెసునాయకుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి అనుయాయుడు. 'దివాకర్' అంటే జె.సి. దివాకర్‌రెడ్డి. 1989 నుండి తాడిపత్రి ఎం.ఎల్.ఎ, కాంగ్రెస్ నాయకుడు.విజయభాస్కర రెడ్డి హయాంలో మంత్రి.

వీళ్లిద్దరూ తాడిపత్రి తాలూకాను ఏలుతున్న పాలెగాళ్ళు.వీళ్లదారికి అడ్డం పోతే ప్రాణాలు పోగొట్టుకోవలసి వుంటుంది. వీళ్ళు తాడిపత్రి తాలూకాలో పెంచి పోషిస్తున్న ముఠా కొట్లాటలలో ఈ ఆరేడు సంవత్సరాలలో ఎంత లేదన్నా 50 ప్రాణాలు పోయి ఉంటాయని అంచనా. వీళ్ల బలప్రయోగ సామర్థ్యాన్ని చూసి వీళ్లను గాఢంగా అభిమానించే వాళ్లు వుంటే వుండవచ్చు. కానీ వీళ్లతో గొడవ పెట్టుకుంటే ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని భయపడే వాళ్లు మాత్రం అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

మొదటి కోవకు చెందినవారికి ఆ తాగుబోతు ప్రేలాపన ఎందుకు కోపం తెప్పిస్తుందో స్పష్టమే. అయితే రెండవ కోవకు చెందిన వారికి కూడ అది కోపం తెప్పిస్తుంది. మనుషుల ప్రాణాలతో ఆటలాడుకునే దుష్టశక్తులను బిగ్గరగా తిడితే ఆ పాపం ఎవరెవరిని చుట్టుకుంటుందో ఎవ్వడెరుగు?

## నైసర్గికం, చారిత్రకం

తాడిపత్రి అనంతపురం జిల్లా ఉత్తర భాగాన ఉన్న తాలూకా. కడప, కర్నూలు జిల్లాల సరిహద్దు దగ్గరున్న ఈ ప్రాంతంలో ముఠాకక్షలు ఉండడం ఒక రకంగా సహజం. ఎందుకంటే ఆ రెండు జిల్లాలు ముఠా కక్షలకు నిలయాలు. పైగా తాడిపత్రికి కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాతో సరిహద్దు ఉంది. కడప జిల్లా జమ్మలమడుగు తాలూకాతోనూ పులివెందుల తాలూకాతోనూ కూడ సరిహద్దు వుంది. కోవెలకుంట్ల, జమ్మలమడుగు తాలూకాలు ఒక

శతాబ్దం పైగా గ్రామీణ పెత్తందార్ల ముఠా కొట్లాటలకు ప్రసిద్ధిగాంచాయి. పులివెందుల 'వై.ఎస్.' తండ్రీ తనయుల ఇలాఖా. ఈ ప్రభావం - సాంస్కృతికంగానే కాదు, భౌతికంగా కూడ - తాడిపత్రి పైన ఉంది. తాడిపత్రి ముఠా కొట్లాటలలో వై.ఎస్ తండ్రీ తనయుల పాత్ర ప్రత్యక్షంగానే ఉంది. అలాగే కర్నూలు జిల్లా ముఠా కొట్లాటల ముఖ్య పోషకులలో ఒకడయిన కోట్ల విజయభాస్కర రెడ్డి పాత్ర చాలానే ఉంది. కోవెలకుంట్లలోని పేర్గాంచిన ఫాక్షన్ గ్రామమయిన గుండ్ల సింగవరం ప్రమేయమూ ఉంది.

అయితే అనంతపురం జిల్లాలో ముఠా కొట్లాటలుండేది ఒక్క తాడిపత్రి లోనే కాదు. ఇతర ప్రాంతాలలోనూ ఉన్నాయి. సాయుధ దౌర్జన్యంతో సమాజాన్నీ దాని ఆర్థిక రాజకీయ వ్యవస్థనూ శాసించిన చరిత్రగల ముఠా నాయకులున్నారు. తమకు అడ్డం తగిలిన ప్రజలను నిర్దాక్షిణ్యంగా తొక్కేసిన వారున్నారు. తమతో సమ ఉజ్జీగా పోటీకి వచ్చిన వారిని దెబ్బకు దెబ్బ తీస్తూ పీనుగుల సోపానం ఎక్కి అధికార అందలాన్ని అందుకున్న వారున్నారు. ఇదంతా కడప ప్రభావం కాదు, కర్నూలు ప్రభావం కాదు. ముఠాకక్షల విషయంలో ఆ రెండు జిల్లాలకున్నంత పెద్ద పేరు అనంతపురానికి లేకపోయినప్పటికీ, అనంతపురానికి సహితం కొంత దుష్ట చరిత్ర ఉంది. ప్రస్తుత తరంలో జె.సి. దివాకర్ రెడ్డి , సూర్యప్రతాప రెడ్డి, పరిటాల రవి ఈ చరిత్రకు ప్రధాన ప్రతినిధులు కాగా, వీరికి ముందు పెనుకొండ తాలూకాలో కనుముక్కల చెన్నారెడ్డి, మద్దులచెరువు నారాయణ రెడ్ల దౌర్జన్యాలున్నాయి. వారిని ఫాక్షన్ పద్ధతిలో ఎదుర్కొన్న కమ్యూనిస్ట్ సానుభూతిపరుడు పరిటాల శ్రీరాములు చరిత్ర వుంది. అంతకంటే పూర్వకాలంలో పాందుర్తి పెదబయ్యపురెడ్డికీ దొరిగల్లు రంగారెడ్డికీ ఉన్న ఫాక్షన్ గురించి కథలిప్పటికీ చెప్పుకుంటారు. ఉరవకొండ తాలూకాలో కౌకుంట్ల భూస్వామి పయ్యావుల కేశన్న (ప్రస్తుత ఉరవకొండ ఎమ్మెల్యే కేశవులు తాత) పెత్తనాన్ని ఎదుర్కొనడానికి కమ్యూనిస్ట్ పార్టీ చేసిన పోరాటం ఫాక్షన్ రూపం తీసుకున్న చరిత్ర కూడ వుంది.

అనంతపురం జిల్లా అనగానే చాలామందికి కరువు జ్ఞాపకం.వస్తుంది. కరువుకు ఈ జిల్లా కేవలం మన రాష్ట్రంలోనే కాదు,దేశంలో కూడ పేరుగాంచింది. రాజస్తాన్ లోని కొన్ని ఎడారి ప్రాంతాల తరువాత అనంతపురాన్నే చెప్పుకోవాలి. ఇక్కడ వర్షపాతం అతి తక్కువ. సంవత్సర సగటు **542** మిమీలు మాత్రమే (రాష్ట్ర సగటు **950**మిమీలు). రాయలసీమ, దక్షిణ తెలంగాణాలలో సహితం ఇది అతి తక్కువ. తుంగభద్ర ఆనకట్ట , ఇతర చిన్న ప్రాజెక్టులు ఈ జిల్లాకిచ్చే సాగునీరు చాలా తక్కువ (తొమ్మిదిన్నర లక్షల హెక్టార్ల సాగుభూమిలో నలభై వేల ఎకరాలకు మాత్రమే). చెరువులు **1200** దాకా ఉన్నాయిగానీ వాటి నిర్వహణపైన ప్రభుత్వం పెడుతున్న శ్రద్ధ శూన్యం కాబట్టి వాటి ఆయకట్టు బాగా పడిపోయింది.

వర్షపాతం, సాగునీటి వనరులు తక్కువ ఉండడమే కాక ఈ జిల్లా నేలలు కూడ ఏమంత సారవంతమైనవి కావు. జిల్లా ఉత్తర దక్షిణ చివర్లలో కొంత సారవంతమైన భూములున్నాయిగానీ

జిల్లా మధ్య భాగం సారవిహీన మైనది. నైసర్గికంగా ఈ జిల్లా దక్షిణం నుండి ఉత్తరానికి ఏటవాలుగా ఉంటుంది. దక్షిణాన సగటున 2200 అడుగుల ఎత్తున్న హిందూపురం, మడకశిర తాలూకాలు (హిందూపురం, మడకశిర, గోరంట్ల నియోజక వర్గాలు) పీఠభూమి స్వభావాన్ని కలిగి ఉన్నాయి. ఇక్కడి నేలలు ఎర్రమట్టి నేలలేగానీ సాపేక్షంగా మధ్యప్రాంతం కంటే కొంత సారవంతమైనవే. ఉత్తరాన ఉన్న తాడిపత్రి, గుంతకల్, ఉరవకొండ, రాయదుర్గం తాలూకాలు (తాడిపత్రి, గుత్తి, గుంతకల్, ఉరవకొండ, రాయదుర్గం నియోజక వర్గాలు) సగటున 1000 అడుగుల ఎత్తున ఉన్నాయి. ఇక్కడ సారవంతమైన నల్లరేగడి నేలలు చెప్పుకోదగ్గ మోతాదులో కనిపిస్తాయి. జిల్లా అంతటి లాగ ఇక్కడ కూడ వర్షపాతం తక్కువ కావడం వల్ల ఈ నేలల ఫలాన్ని రైతులు పూర్తిగా పొందలేకపోయినప్పటికీ ఇక్కడ పంటలలో కొంత వైవిధ్యం కనిపిస్తుంది. జిల్లా మధ్యప్రాంతంలో, దక్షిణ ప్రాంతంలో ఉన్నది అత్యధికంగా ఎర్రనేలలే. అక్కడ శెనక్కాయ (వేరుశెనగ) దాదాపు ఏకైక పంట అయింది. ఈ జిల్లా సాగుభూమిలో 70 నుండి 80 శాతం వేరుశెనగే సాగవుతుందంటే బయటివాళ్లు ఆశ్చర్యపోవచ్చు. జిల్లా మధ్యప్రాంతంలో (కళ్యాణదుర్గం, అనంతపురం, శింగనమల, పెనుకొండ, నల్లమాడ ,కదిరి నియోజక వర్గాలు) ఉన్న నేలలు అధికభాగం సారవిహీనమైనవి. ఈ చివర, ఆ చివర ఉన్న కళ్యాణదుర్గం, కదిరి తాలూకాలయితే మరీ హీన మైనవి. పూర్తిగా దక్షిణ ప్రాంతమైన హిందూపురం, మడకశిర నేలలు కూడ ఎర్రనేలలే అయినా అవి సాపేక్షంగా కొంత సారవంతమైనవి. అయితే జిల్లా అంతటి లాగ ఇక్కడ కూడ వర్షపాతం చాలా తక్కువ.

ఈ నేలలలో, ఈ నీటి వసతితో ఏ పంట పండితే ఆ పంట ఒక కారు పండించుకొని బతకాలి అనంతపురం రైతులు. శెనక్కాయ ఈ నేలలలో పండేపంటే కాక వ్యాపారపంట కూడ కానడంతో అదే ఈ జిల్లాలో అత్యంత ప్రధానమైన పంట అయింది.

ఈ మాత్రం వ్యవసాయం పెద్ద జనాభాను పోషించలేదు. వైశాల్యంలో అనంతపురం మన రాష్ట్రంలోని అతి పెద్ద జిల్లా . కానీ జనాభాలో ఏడవది. జనాభా సాంద్రత రాష్ట్రంలో 1 కి.మీకు 195 మంది కాగా అనంతపురంలో 133 మాత్రమే. అంటే మన రాష్ట్రంలోని వ్యవసాయ భూమి సగటున పోషించగల జనాభాలో 2/3 వ వంతు మాత్రమే అనంతపురంలో పోషించగలదు. జిల్లాలోని మధ్య తాలూకాలలో - ముఖ్యంగా కళ్యాణదుర్గం, పెనుకొండలలో- మైళ్లకొలదీ ఒక్క చెట్టుగానీ గడ్డి పరకగానీ కనిపించని స్థితి ఉంటుంది.

ముఠాకక్షల గురించి మాట్లాడేటప్పుడు వాటి నైసర్గిక మూలాన్ని అన్వేషించే అలవాటు రాయలసీమలో ఉంది. ముఠా కక్షలు నల్లరేగడి నేలలున్న చోటే ఎక్కువ ఉంటాయన్న అభిప్రాయం బ్రిటీష్ కాలం నుండి ప్రచారంలో ఉంది. అందులోనూ పెన్నా నది లోయలోని నల్లరేగడి నేలల ప్రాంతాలకు ఈ లక్షణం మరింత ఎక్కువని అంటుంటారు. కోవెలకుంట్ల, జమ్మలమడుగుల లాగ తాడిపత్రికి కూడ ఈ వివరణ వర్తిస్తుంది. తాడిపత్రి పెన్నానది పరీవాహక

ప్రాంతంలో ఉన్న నల్లరేగడి నేలల ప్రాంతం. తాడిపత్రి తాలూకాలో దాదాపు 70 శాతం భూమి నల్లరేగడి భూమి. అది ముఠాకక్షల కొక ముఖ్య కేంద్రం కూడ. 1989-94 మధ్యకాలంలో తాడిపత్రిలో దివాకరరెడ్డి ముఠా దౌర్జన్యాలు పత్రికల కెక్కని రోజు లేదు. అయితే పెనుకొండ, ఉరవకొండ తాలూకాల ఎర్రనేలలలో సహితం ముఠాకక్షలు బలంగా ఉన్నాయి. పరిటాల తండ్రీతనయులు మద్దులచెరువు, కనుముక్కల రెడ్లతోనడిపిన పోరు జిల్లా మధ్యప్రాంతం పోరే.

నైసర్గిక పరిస్థితుల కంటే సామాజిక చరిత్రలో మూలాన్ని వెతకడం వల్ల ఎక్కువ అవగాహన కలుగుతుంది. విజయనగర సామ్రాజ్య పతనం తరువాత (16వ శతాబ్దం చివరిభాగం నుండి) మొత్తం రాయలసీమ లాగ అనంతపురం జిల్లా కూడ పాలెగాళ్ల ప్రభావంలోకి పోయింది. 18వ శతాబ్దంలో అనంతపురం పాలెగాడికీ రాయదుర్గం పాలెగాడికీ మధ్య నడిచిన పోరు ఈ జిల్లా రాజకీయ చరిత్ర లో ఒక ముఖ్యఘట్టం. (అప్పట్లో రాయదుర్గం బళ్లారి జిల్లాలో ఉండేది.) ఈ పాలెగాళ్ళు చిన్నచిన్న దుర్గాలు నిర్మించుకొని సాయుధ ముఠాలను (గౌరవం ఇయ్యదలచుకుంటే వీటిని 'సైన్యాలు' అనొచ్చు) పోషిస్తూ కొన్ని ఊర్లపైన పెత్తనం చేస్తూ బతికిన యుద్ధ ప్రభువులు. విజయనగర రాజ్యమే వీరిని సృష్టించింది. విజయ నగర రాజ్యంలో సైనిక శక్తి కేంద్రీకృతంగా వుండలేదు. ఎక్కడికక్కడ చిన్న చిన్న సైన్యాల్ని పోషిస్తూ కేంద్ర రాజ్యాధికారానికి లోబడి ప్రజల పైన పెత్తనం చేసిన నాయకులు చాలామంది ఉండేవారు. రాజ్యం యుద్ధానికి పోయినప్పుడు ఈ సైన్యాలన్నీ కలసి పోయేవి. వీరందరిలోకీ చిన్నవాళ్లు పాలెగాళ్ళు. ముఖ్యంగా రాజ్యం సరిహద్దు ప్రాంతాలలోనూ, రాజ్యానికి సులభంగా లోబడని తెగలు బలంగా ఉన్న ప్రాంతాలలోనూ పాలెగాళ్ల నియామకం ఎక్కువ జరిగింది.విజయనగర రాజ్యం బలహీనపడిన తరువాత ఈ పాలెగాళ్లు స్వతంత్రించి ఎక్కడికక్కడ స్వంత ప్రశాసనం నెలకొల్పి ఒకరితో ఒకరు సంఘర్షిస్తూ బతకసాగారు. క్రీ.శ.1800 లో ఈ ప్రాంతం (దత్తమండలం అనే పేరుతో) బ్రిటిష్ ప్రశాసనం లోకి పోయేదాకా ఈ ప్రాంతం మరాఠా, మైసూర్, దక్కన్ (ప్రధానంగా హైదరాబాద్) ప్రభువుల ఘర్షణలకు క్షేత్రంగా ఉండింది. వారి సైన్యాలు వస్తూ పోతూ రాయలసీమలో సంఘర్షించుకునేవి. స్థానిక పాలెగాళ్ళు వాళ్ల ఘర్షణలో ఒక్కొక్కసారి ఆ పక్షమో, ఈ పక్షమో తీసుకొని తమ బలం పెంచుకునే వారు. ఒక్కొక్కసారి దాడి చేస్తున్న సైన్యాల చేతిలో అణిచివేతకు కూడ గురయ్యారు. ఒక్కొక్కసారి ఆ సైన్యాల దాడి నుండి ప్రజలను పాలెగాళ్లే కాపాడారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఈ ప్రాంతం రాజకీయ చరిత్ర చాలా బీభత్సంగా ఉండి ఉండాలి. చివరికి ఇది హైదరాబాదు నిజాం చేతుల మీదుగా క్రీ.శ 1800 లో బ్రిటిష్ వారికి 'దత్తం' అయి దత్తమండలమయింది. రాయలసీమలో నెలకొని ఉన్న ముఠాఘర్షణల సంస్కృతికి ఈ రెండు శతాబ్దాల (ముఖ్యంగా 18వ శతాబ్దపు ) చరిత్రనే ఎక్కువమంది కారణంగా చూపిస్తారు. ఎవరికి వారు గుంపులను చేరదీసి ఆయుధాలు పట్టుకొని తమ ప్రశాసనం తమ చుట్టూ ఉన్న సమాజం పైన నెలకొల్పి పెత్తనం చేస్తూ బతకడం ఆ నాటి 'అరాచక ' వాతావరణంలో సహజం అయింది.

ఆ పని సమర్థంగా చేయగలవాళ్ళే నిలదొక్కుకొని బయటి వారి దాడుల నుండి ఆత్మరక్షణ చేసుకోగలిగేవారు. తమచుట్టూ వున్న ప్రజలకు కూడ రక్షణ కల్పించగలిగే వారు. ఈ కారణంగా పాలెగాళ్ల సంస్కృతి పెరిగిబలపడిందని చాలామంది భావిస్తారు. రాయలసీమ ఫాక్షన్ సంస్కృతికి చూపించే అన్ని కారణాలలోకీ ఇది కొంత సహేతుకంగా కనిపిస్తుంది.

ఈ సంస్కృతి ఎంత లోతుగా ఉందనే దానికి పాలెగాళ్ల సంఖ్యను గాని ప్రమాణంగా తీసుకునేటట్లయితే అనంతపురంలో దీని ప్రభావం సాపేక్షంగా తక్కువేననిపిస్తుంది. క్రీ.శ 1800 లో బ్రిటిష్ వాళ్లు దత్తమండలాన్ని (ప్రస్తుత కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు, ప్రకాశం జిల్లా పడమటి భాగం, చిత్తూరు జిల్లా పడమటి భాగం , బళ్లారి జిల్లా) బ్రిటిష్ ఇండియాలో కలుపుకునే నాటికి ఆ ప్రాంతంలో ఉన్న 80 మంది పాలెగాళ్లలో నలుగురు మాత్రమే అనంతపురంకు చెందినవారు. వారు అనంతపురం, తరిమెల, నడిమిదొడ్డి, కమ్మల పాడు పాలెగాళ్లు. పైగా ఈ నలుగురు కడప జిల్లా పాలెగాళ్ళలాగ బ్రిటిష్ ప్రశాసనాన్ని గట్టిగా ప్రతిఘటించకుండ సులభంగానే లొంగిపోయారని అప్పటి బ్రిటిష్ గెజెటీర్లు అంటాయి. ఒక్క కమ్మలపాడు పాలెగాడు మాత్రమే కొంచెం ప్రతిఘటించినట్టున్నాడు.

ఈ అనంతపురం ఇప్పటి అనంతపురం కాదు. అప్పట్లో కదిరి తాలూకా కడప జిల్లాలోనూ రాయదుర్గం బళ్లారి జిల్లాలోనూ ఉండేవి. ఆ రెండు తాలూకాలలోనూ పాలెగాళ్ల ప్రభావం కొంత ఎక్కువగానే ఉండింది. కదిరి, దాని పరిసర తాలూకాలయిన రాయచోటి (కడప జిల్లా), మదనపల్లి, వాయల్పాడు (ఇప్పుడు చిత్తూరుజిల్లాలో వున్నాయి) లను కలిపి (బ్రిటిష్ వాళ్లు 'గుర్రం కొండ ప్రాంతం' అని పిలిచేవారు. కొండలు, బండరాళ్ళు, పల్చటి ఎర్రమట్టి, గులకరాళ్ళు కలిసిన సారవిహీనమైన నేలలున్న పీఠభూములు, చిన్న చిన్న గ్రామాలు, బలమైన పాలెగాళ్ల పెత్తనం ఈ ప్రాంతపు లక్షణాలు. గుర్రం కొండ దీనికి కేంద్ర బిందువయిన గ్రామం. (ఇప్పుడా ఊరు చిత్తూరు జిల్లాలో మదనపల్లి - రాయచోటి రహదారి మీద ఉంది. అటు రాయచోటి ఫాక్షనిస్టుల దెబ్బకు, ఇటు తంబళ్ల పల్లి ఫాక్షనిస్టుల దెబ్బకు తల్లడిల్లే చిన్న మండల కేంద్రం).

కాగా బళ్లారి జిల్లాలోనూ (అందులో భాగమైన రాయదుర్గం తాలుకా లోనూ) కూడ తక్కిన అనంతపురం కంటే ఎక్కువగానే పాలెగాళ్ల ప్రభానం ఉండింది. బళ్లారి పాలెగాడు, రాయదుర్గం పాలెగాడు అనంతపురం పైన పలుమార్లు దాడి చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేసారు.

ఏమైనప్పటికీ ముఠాకక్షల వాతావరణం అనంతపురంలో మొత్తం మీద కొంచెం తక్కువే. గ్రామాలలో ముందునుండి ఫాక్షన్‌లు, ముఠాకొట్లాటలు లేకపోలేదు గానీ రాజకీయ ఫాక్షన్ల హింసాత్మక ఆధిపత్యం గత దశాబ్దకాలంలోనే బాగా పెరిగింది. కడప, కర్నూలు జిల్లాలలో ఉన్నంత బలంగా ముఠాదౌర్జన్యాల వాతావరణం ఇక్కడ లేకపోవడం వల్లనేనేమో,

బలప్రయోగంతో వేగంగా పైకి రావాలని చూసిన ముఠానాయకులకు ఇక్కడ ఎక్కువ ప్రతిఘటన ఎదురుకాలేదు. అందువల్ల వారు మరింత సులభంగా సమాజంపైన తమ దౌర్జన్యపూరితమైన ఆధిపత్యం నెలకొల్పగలిగారు. సానె ఓబులరెడ్డి నుండి పరిటాల రవి దాకా అందరికీ ఇది ఉపకరించింది. ధర్మవరంలో **1992-94** కాలంలో ఓబుల రెడ్డి చలాయించిన దుర్మార్గపు పెత్తనం రాయలసీమకు కొత్త కాదు. కానీ అతను ఎదురు లేకుండ - ఒక పోటీ ఫాక్షనిస్టు పుట్టి ముందుకు రాకుండా - చలాయించగలగడం ఆశ్చర్యం కలిగించే విషయమే. బహుశా అది అనంతపురం జిల్లాలో మాత్రమే సాధ్యమయ్యిందేమో. **1994** తరువాత అదేవిధంగా పరిటాల రవి పేరు చెప్తేనే జిల్లా మొత్తం గడగడలాడే పరిస్థితి ఏర్పడింది. ప్రత్యర్థులందరూ అతనికి జిల్లాను అప్పగించి పక్కకు తప్పుకున్నారని చెప్పవచ్చు.

గ్రామీణ ముఠాకక్షలు రాయలసీమలో ఎప్పటినుండో ఉన్నప్పటికీ, అవి గ్రామం ఎల్లలు దాటి సమితి, తాలూకా, జిల్లాస్థాయి రాజకీయ ఫాక్షన్లుగా మారిన తరువాతే పెద్దెత్తున ప్రజాజీవితంపైన దుష్ప్రభావం వేయడం మొదలయింది. ఎన్నికలు, సారాయి వ్యాపారం,సివిల్ కాంట్రాక్టులు, పాలనా వ్యవస్థ అన్నిటి మీద రాజకీయ ఫాక్షన్ల ప్రభావం పడి ప్రజల అవసరాలు, హక్కులు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, ఆర్థిక అభివృద్ధి అన్నీ దెబ్బతినడం మొదలయింది. ఈ నష్టాన్ని అర్థం చేసుకున్న తరువాతనే సమాజంలో ఫాక్షన్ల పట్ల విమర్శ, వ్యతిరేకత తలెత్తాయి. ఇప్పుడు రాయలసీమలో ఫాక్షన్లనూ ఫాక్షనిస్టులనూ తిట్టని వారెవ్వరూ లేరు (ఫాక్షనిస్టులతో సహా) . పూర్వ కాలపు గ్రామీణ ముఠాదారుల లాగ కాక ఈనాటి రాజకీయ ఫాక్షనిస్టులు చాలా వేగంగా రాజకీయాలలో పైకి పోవడమే కాక ఆర్థికంగా విపరీతంగా లాభపడడం చూసిన ప్రజలలో వారి పట్ల నిరసన బాగా పెరిగింది. ఒకప్పుడు ఎక్కువగా కడప కర్నూలు ఫాక్షన్ల గురించి బయట వినపడేది గానీ ఈ మధ్య కాలంలో పరిటాల రవి పుణ్యాన అనంతపురమే ఎక్కువగా వార్తలలో వుంటున్నది. అనంతపురం చూసిన ఫాక్షనిస్టులందరిలోకీ అతనే క్రూరుడా అంటే చెప్పలేము గానీ అతనే ఎక్కువగా దృష్టిని ఆకర్షించడానికి కొన్ని కారణాలున్నాయి. రవి ప్రత్యర్థులయిన కనుముక్కల (సానె) ఓబులరెడ్డి, అతని అన్న రమణారెడ్డి రాష్ట్ర రాజధానిలోనే హతమవ్వడం, రవి పైన కారుబాంబు ప్రయోగం కూడ రాజధానిలోనే జరగడం దీనికొక కారణం. అయితే వేరే ఏ ఫాక్షనిస్టుకూ లేని కొన్ని ప్రత్యేక లక్షణాలు రవికి ఉన్నాయి. అతనికి నక్సలైట్ అన్న ముద్ర ఒకటి ఉంది. కడప జిల్లాలో ప్రొద్దుటూరు పాలెగాడు ఎం.వి.రమణారెడ్డి కూడా ఒకప్పుడు నక్సలైట్ రాజకీయాలలో ఉన్నవాడే. (నిజానికి పరిటాల రవి కంటే నిజమైన అర్థంలో అతనిని మాజీ నక్సలైట్ అనవచ్చును). కానీ ఫాక్షనిస్టయిన తరువాత ఆ సంబంధాలు కొనసాగలేదు. రవికి అట్లా కాకుండ తెలుగుదేశం పార్టీలో చేరిన తరువాత కూడ పీపుల్స్ వార్ నుండి బయటికొచ్చేసిన రీ ఆర్గనైజింగ్ కమిటీ (ఆర్ ఓసి)నక్సలైట్ల మద్దతు ఉండింది. ఇప్పటికీ ఉంది. (ఈ నక్సలైట్లను రామగిరి ప్రాంతం రైతొకరు నవ్వుతూ 'అడవి తెలుగుదేశం వాళ్ళు' అని వర్ణించాడు). పీపుల్స్‌వార్

ఆయుధ సంపత్తిలో భాగమని అందరూ భావించే మందుపాతరలు, చేతిబాంబుల కంటే ఆధునిక మైన పేలుడు ప్రక్రియలు పరిటాల రవి వచ్చిన తరువాతనే రాయలసీమ ఫాక్షన్‌ల చరిత్రలోకి ప్రవేశించాయి. అంతకుముందు తాడిపత్రిలో చాలా దౌర్జన్యం చేసిన దివాకర్‌రెడ్డి సంప్రదాయక ఆయుధాలను దాటిపోలేదు. **1994** ఎన్నిక తరవాత చిక్కేపల్లిలో పేలిన మందుపాతర తాడిపత్రి తాలూకాలో అటువంటి తొలిఘటన. దానితో తనకేమీ సంబంధం లేదని రవి అంటున్నప్పటికీ, అందులో చనిపోయింది తెలుగుదేశం నాయకుడు పేరం నాగిరెడ్డి శత్రువులయిన దివాకరరెడ్డి అనుచరులు కావడం వల్ల రవి కర్తృత్వం దానిలో ఎక్కడో ఉందన్న సందేహం అనంతపురం ప్రజలను వీడడం లేదు. అంతకుముందు (**1993** లో) పెనుకొండ నియోజక వర్గంలోని మద్దులచెరువులో మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి కుటుంబం పైన ప్రయోగించిన టివి బాంబుతోనయితే రవికీ అతని మద్దతు దార్లయిన నక్సలైట్ వర్గానికీ ప్రత్యక్ష ప్రమేయమే ఉంది. **1992** లో ఓబులనాయన పల్లి (ధర్మవరం మండలం) ఫాక్షనిస్టు అయిన గడ్డం పుల్లన్న జీపును పేల్చి అతనిని చంపిన మందుపాతరతోనూ **1997** లో యాడికి మండలం వేములపాడు దగ్గర దివాకరరెడ్డి మనుషులపైన ప్రయోగించిన మందుపాతరతోనూ కూడ తనకేమీ సంబంధం లేదని రవి అంటున్నప్పటికీ, అన్ని మందుపాతరలూ రవి ప్రత్యర్థి వర్గీయులపైననే ప్రయోగించబడడం కాకతాళీయమని అనుకోవడం కష్టమే. రవికి, కాకపోతే అతని మద్దతుదార్ల నక్సలైట్ల వర్గమైన ఆర్‌ఓసికి వీటితో సంబంధం వుందన్న అభిప్రాయం బలీయంగానే వుంది.

## గ్రామీణ ఫాక్షన్లు – రాజకీయ ఫాక్షన్లు

అయితే అనంతపురం ఫాక్షన్ల చరిత్ర అంటే రవి చరిత్ర మాత్రమే కాదు. ఆ చరిత్రను వివరంగా చూసే ముందు ఫాక్షన్ల స్వభావాన్ని గురించి కొన్ని విషయాలు చెప్పాలి. గ్రామీణ ముఠా కక్షలు రాయలసీమలో ఎప్పటినుంచో ఉన్నాయి. ఇది ఒకే ఊరిలో గానీ రెండు పొరుగు గ్రామాలలో గానీ నివసించే ఇద్దరు పెత్తందార్ల మధ్య పెత్తనం కోసం, ప్రతిష్ట కోసం జరిగే ఘర్షణ. వీరిలో ఒకరు సాధారణంగా గ్రామ 'రెడ్డి' (అంటే పటేల్ లేక మునసబు) అయి ఉంటారు. రెండవ వ్యక్తి ఆ హోదా నుండి వచ్చే పెద్దరికాన్నీ పెత్తనాన్నీ సవాలు చేసే పోటీ దారు అయి ఉంటాడు. అయితే 'రెడ్డి' కాని వారి మధ్య కూడ రకరకాల కారణాల వల్ల (ఆస్తి తగాదాలు, పాలివాళ్ల పంతాలు, లైంగిక సంబంధమైన 'పరువు ప్రతిష్టలు' వగైరా) పెద్దరికం లేక పెత్తనం కోసం ఘర్షణలు జరుగుతుంటాయి.

స్థూలంగా చెప్పాలంటే ఒకరి పెత్తనాన్ని మరొకరు సహించలేక పోయినా, లేక ఒకరి వల్ల మరొకరి పెద్దరికం, ప్రతిష్ట దెబ్బ తిన్నా లేక ఒకరి ప్రయోజనాలకూ ప్రాముఖ్యతకూ మరొకరు అడ్డం వచ్చినా ఆ ఘర్షణ ముఠా కక్షల రూపం తీసుకుంటుంది. గుంపు కట్టి దౌర్జన్యం చేసి మన

ప్రయోజనాలు కాపాడు కోవడం సబబే ననుకునే పాలెగాళ్ల సంస్కృతి ఈ ఘర్షణ కొక రూపం ఇస్తుంది. ఇద్దరూ చెరి ఒక గుంపును చేరదీస్తారు. ఇది కులం ప్రాతిపదిక మీద జరగవచ్చు. లేక శాఖ (ఉదాహరణకు రెడ్లలో) ప్రాతిపదిక మీద జరగవచ్చు. గ్రామం లేక గేరి (వాడ) ప్రాతిపదిక మీద జరగవచ్చు. ఇదేదీ కాకుండ వ్యక్తిగత అభిప్రాయం లేక విధేయత ప్రాతిపదిక మీద జరగవచ్చు. గుంపు మొదట ఏదో ఒక ప్రాతిపదిక మీద మొదలయినా అది అక్కడే ఆగిపోదు. ఎందుకంటే ఆ తరువాత గ్రామంలో వచ్చే ప్రతీ గొడవలోనూ ఇరువర్గాలూ చెరి ఒక పక్షం తీసుకొని ఆ పక్షాన్ని తమ వర్గంలో చేర్చుకుంటారు. లేదా ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలుంటే వారిలో ఒకరు ఒక ముఠా నాయకుని దగ్గరికి పోయి 'న్యాయం' చేయమని అడిగితే రెండవ వారు వైరి ఫాక్షన్ దగ్గరకు పోతారు. ప్రధాన ఫాక్షన్ నాయకుల మధ్యనున్న ఘర్షణలే కాక వారి గుంపులో ఉన్న మనుషుల మధ్య ఘర్షణలు కూడ గొడవలను పెంచుతాయి. కానీ ఈ గుంపుల ప్రధాన లక్ష్యం వాటి నాయకుడి పెత్తనాన్ని పెద్దరికాన్నీ ప్రాముఖ్యతనూ అజేయంగా నిలబెట్టడం. ఈ క్రమంలో కొట్టుకోవడం, బాంబు లేసుకోవడం, ఇండ్లు కాలబెట్టుకోవడం, తోటలు నరుక్కోవడం, చంపుకోవడం, ఊరు విడిపించి పొలాలు బీడు పెట్టించడం జరుగుతుంది.

రెండు గుంపుల గురించి మాట్లాడుతున్నామంటే గ్రామస్థులందరూ ఈ గుంపులోనో ఆ గుంపులోనో చురుగ్గా పాల్గొంటారని అర్థం కాదు. చురుకుగా పాల్గొనేవారు కొద్దిమందే ఉంటారు. తాడిపత్రి తాలుకాలోని వెన్నపూసపల్లిని ఉదాహరణగా తీసుకోవచ్చు. ఒక దశాబ్దంపైగా ఫాక్షన్ కొట్లాటలకు మారుపేరుగా – తాడిపత్రి తాలూకా ఫాక్షన్ రాజకీయాలకు కేంద్రంగా – ఉన్న ఈ ఊరిలో ముఠాలలోచురుగ్గా పాల్గొనేవారు 25 శాతం కంటే ఎక్కువ ఉండరని అంచనా. అయినప్పటికీ, బలమైన ఫాక్షన్‌లున్న గ్రామాలు రెండుగా చీలిన అభిప్రాయం కలిగిస్తాయి. ముఠాలలో చురుగ్గా పాల్గొనని వారు పహితం ముఠాలకు తలొగ్గి, వాళ్లతో గొడవలు పెట్టుకోకుండా బ్రతుకుతుంటారు. గ్రామానికి సంబంధించిన ఏ విషయమైనా ఈ ముఠాగానీ ఆ ముఠాగానీ నిర్ణయిస్తుంది. వారు రాజీపడి నిర్ణయించవచ్చు. లేదా ఘర్షణ పడి ఒకరిది పైచేయి అయిన తరువాత వారిదే నిర్ణయం కావచ్చు. గ్రామమంతా దానినే ఆచరిస్తుంది. ముఠాలలో భాగం కానివారెవ్వరూ విభేదించే సాహసం చేయరు. రెండు ముఠాలకూ ఆసక్తి లేని విషయాలలో మాత్రమే గ్రామ ప్రజలకు స్వేచ్ఛ ఉంటుంది. అది కూడ వారి ప్రయోజనాలు, పెత్తనం దెబ్బ తినకుండ ఉన్న మేరకే.

ఇది – స్థూలంగా – గ్రామీణ ఫాక్షన్ల నైజం. ఫాక్షన్ల మధ్య ఎల్లప్పుడూ సమతుల్యం ఉండదు. సమతుల్యాన్ని భగ్నం చేసి తమ ఆధిపత్యం నెలకొల్పాలనే ఇరువురూ ప్రయత్నిస్తుంటారు. అప్పుడప్పుడు మాత్రమే స్థిరమైన 'బ్యాలెన్స్ ఆఫ్ పవర్' అమలులో ఉంటుంది. కొట్లాటలో ఒకరిది పై చేయి అయినప్పుడు రెండవ వర్గాన్ని వారు ఊరి నుండి తరిమివేయడమో, లేక వాళ్ళు రాజీపడి పెత్తనాన్ని వీరికి అప్పగించి మౌనంగా ఉండడమో జరుగుతుంది. తరిమేసినప్పుడు వాళ్ల

ఆస్తులు వీళ్లు లూటీ చేయడం, భూములు ఆక్రమించుకోవడం లేక బీడు పెట్టడం జరుగుతుంది. ఈ విజయాలెప్పుడూ శాశ్వతం కావు. కొంతకాలానికి ఘర్షణ తిరిగి రాజుకోవడం ఊరు విడిచిపోయినవారు తిరిగి వచ్చి నిలదొక్కుకోవడం, ఆధిపత్య సంబంధం తలకిందులయి వారిదే పై చేయి కావడం జరగవచ్చు. ఇదంతా రాసుకున్నంత ప్రశాంతంగా జరగదు. విపరీతమైన హింసాకాండ, విధ్వంసం జరుగుతాయి. ఒకప్పుడు గుంపులుగా మిద్దెలెక్కి రాళ్ళు వేసుకునేవారు, ముఖాముఖి తలపడినప్పుడు కొడవళ్లతో నరుక్కునేవారు, ఈటెలతో పొడుచుకునేవారు. తుపాకుల ప్రయోగం అప్పుడప్పుడు జరిగేది. అయితే **1975-80** ప్రాంతంలో నాటుబాంబులు రంగప్రవేశం చేసిన తరువాత గలాటాల స్వరూపమే మారిపోయింది. రాళ్లబదులు బాంబులు బక్కెట్లలో తీసుకుపోయి విసురుకోవడం, చంపినా బాంబు వేసి చంపడం ఆనవాయితీ అయింది. ఘర్షణ జరిగితే ఊరంతా బాంబుల మోతతో దద్దరిల్లుతుంది. ఫాక్షన్ గ్రామాలలో బాంబుల తయారీ కుటీర పరిశ్రమ అయింది బాంబుల ప్రయోగం చిన్న పిల్లల ఆట అయింది.

ఈ ఫాక్షన్ కొట్లాటల వల్ల వచ్చే ప్రయోజనం ఏముంటుంది? ఆర్థిక ప్రయోజనం పెద్దగా ఉండకపోవచ్చు. ప్రత్యర్థుల ఆస్తులు దోచుకోవడం వల్ల, పంటలు కోసుకోవడం వల్ల కొంత లాభం రావచ్చు. లేదా ఫాక్షనిస్టన్న బెదిరింపుతో ప్రజలనుండి డబ్బు, ఇతర సేనలు వసూలు చేసుకోవచ్చు. తీసుకున్న అప్పు ఎగ్గొట్టవచ్చు. కొనుక్కున్న వస్తువుకు ధర చెల్లించక పోవచ్చు. భూములు ఆక్రమించుకోవచ్చు. ఊరందరి కంటే తక్కువ కూలీకి పని చేయించుకోవచ్చు. అయితే ముఠా కొట్లాటలలో ఎప్పుడయినా పై చేయి కింది చేయి కావచ్చును కాబట్టి ఇంతకంటే ఎక్కువ కోల్పోవచ్చును కూడ. కింది చేయి కాకున్నా మామూలుగానే కొట్లాటల వల్ల అయ్యే ఖర్చు ఉంటుంది. రక్షణ కోసం అయ్యే ఖర్చు , కోర్టు ఖర్చులు, గుంపును పోషించడం కోసం అయ్యే ఖర్చు, స్వేచ్ఛగా నిర్భయంగా వ్యాపారాలూ వ్యవహారాలూ చేసుకోలేకపోవడం వల్ల కోల్పోయే ప్రయోజనాలు – ఇవన్నీ ఉంటాయి. మొత్తం మీద గ్రామీణ ఫాక్షనిస్టులు ఆర్థికంగా దాని వల్ల ప్రయోజనం పొందారని చెప్పలేము. గ్రామంలో వారి పలుకుబడి, పెత్తనం పెరుగుతాయి. వారంటే ' భయ భక్తులు ' పెరుగుతాయి. గ్రామ వ్యవహారాలలో వారి మాటకు తిరుగులేని బలం వుంటుంది. ఫాక్షన్లు పుట్టేది ఈ ప్రతిష్ట , పెత్తనం, పెద్దరికాల కోసమే కాబట్టి ముఠా నాయకుల కిది ఒక ప్రయోజనమే. ఒక రకంగా చెప్పాలంటే ఫాక్షన్ అనేది ఆర్థికంగా నష్టపోయి పెత్తనం, ప్రాముఖ్యం, ప్రతిష్ట పెంచుకునే సాధనం. అందుకే ఫాక్షనిస్టులు మూర్ఖులు అనే అభిప్రాయం బలంగా వుండేది.

ఇది ఒకప్పటి మాట. స్వాతంత్ర్యం తరువాత – ముఖ్యంగా **1980** తరువాత – పరిస్థితి వేగంగా మారింది. గ్రామంలో గుంపు కట్టి ప్రత్యర్థులను అదరగొట్టి తన పెత్తనం నిలుపుకునేవాడు అదే బల ప్రయోగ సామర్థ్యంతో రాజకీయ వ్యవస్థనూ పాలనా వ్యవస్థనూ కూడ తనకు

లోబరచుకుంటే ఆర్థికంగా చాలా ప్రయోజనం పొందగలడని అర్థమయింది. బెదిరించి పోటీలేకుండా చేసుకొని సివిల్ కాంట్రాక్టులూ సారాయి కాంట్రాక్టులూ లాభదాయకంగా కొట్టేయవచ్చు. ఒకవేళ కాంట్రాక్టు వేరే ఎవ్వరైనా తీసుకుంటే సాగనివ్వనని బెదిరించి రౌడీ మామూలు వసూలు చేసుకోవచ్చు. ఎన్నికలలో పోటీ లేకుండ చేసుకొని సునాయాసంగా గెలవవచ్చు. అన్ని సామాజిక వ్యవహారాలలోను తలదూర్చి పంచాయతులు నిర్వహించి న్యాయమో అన్యాయమో చేసి జేబులు నింపుకోవచ్చు.

ఇదెప్పుడయితే గ్రహించారో అప్పుడు ఫాక్షనిజం మార్ధత్వం అనే అభిప్రాయానికి కాలం చెల్లిపోయింది. ఫాక్షనిజం ఆర్థిక రాజకీయ పురోగమనానికి హింసాత్మక సాధనం అయింది. పాత కాలం ఫాక్షనిస్టులలో, చివరికి ఆస్తులన్నీ పోగొట్టుకొని చితికిపోయిన వారున్నారు. ఈనాటి ఫాక్షనిస్టులు శవాల మెట్లెక్కి ఎమ్మెల్యేలూ మంత్రులూ కోటీశ్వరులూ అవుతున్నారు. ఒకప్పటి గ్రామీణ ఫాక్షన్లలో హింసాదౌర్జన్యాలు ఎంత ఉన్నా కొంత అమాయకత్వం కూడ ఉండేది. ఇప్పుడు అవినీతి, ఫాక్షనిజం నుండి విడదీయరాని లక్షణం అయింది. గ్రామపెత్తనం కోసం పోటీ అనేది ఫాక్షన్ల ప్రధాన లక్ష్యంగా ఉన్నన్నాళ్ళు, సామాన్య ప్రజలు ముఠానాయకుల మాట జవదాట డానికీ వాళ్ల దారికి అడ్డం రావడానికీ జంకుతూ బతికినా ప్రత్యక్షంగా ప్రజలపైన జరిగిన దౌర్జన్యాలు తక్కువే. వాళ్లూ వాళ్ళూ కొట్లాడుకుంటారు. మిగిలిన జనం వాళ్ల దారికి అడ్డం రాకుండ జాగ్రత్తగా బతుకుతుంటారు. కానీ ముఠాలు కట్టి దౌర్జన్యంచేసి సమాజం పైన, రాజకీయ ఆర్థిక వ్యవస్థ పైన పెత్తనం చలాయించడం అధికారానికీ ఆస్తికీ సులభమార్గం అనే గుర్తింపు ఎప్పుడయితే వచ్చిందో అప్పుడు ప్రజలపైన దౌర్జన్యాలు, బలవంతపు ఆర్థిక వసూళ్ళు ఆస్తుల దురాక్రమణ పెరిగాయి. గ్రామాలలో ఒక ఫాక్షనిస్టు మరొక ఫాక్షనిస్టుతో పెత్తనం కోసమో పంతం కోసమో తలపడిన రోజులలో ఇరువైపులా ముఠాలలో ఉన్నవాళ్లు సామాన్య రైతులు,కూలీలు. వాళ్లలో మామూలు గ్రామీణ జీవిత విలువ లుండేవి. ఈ నాటి ఫాక్షన్లలో కాయకష్టం చేసుకొని బతికే వాళ్ళ సంఖ్య తగ్గి రౌడీలు, దొంగసారాయి అమ్ముకుని బతికే వాళ్ళు , మట్కా నంబర్లు రాయించే వాళ్ల సంఖ్య పెరగడంతో ఆ విలువలు నశించాయి. పండ్ల బండి దగ్గర అరటి పండ్లు కొనుక్కొని డబ్బడిగితే 'నేనెవరినో తెలియదా ' అని దబాయించే వీధి రౌడీల నుండి , కిరాయికి గొంతులు కోసే వృత్తి హంతకుల దాకా నానా రకాల క్రిమినల్స్ ఇప్పుడు ఫాక్షన్ ముఠాలలో కనిపిస్తారు. ఫాక్షన్లు గ్రామాలనుండి పట్టణాలకు వచ్చేసరికి విలువల పతనం మరింత పెరిగింది. ఒకప్పుడు గ్రామీణ ముఠా కొట్లాటలలో మగవాళ్ళు ఒకరినొకరు ఎంత క్రూరంగా నరుక్కున్నా స్త్రీలతో ఎప్పుడూ మర్యాదగా ప్రవర్తిస్తారన్న పేరుండేది. ఇప్పటి పరిస్థితి వేరు. ధర్మవరంలో సానె ఓబులరెడ్డి దౌర్జన్యాలలో స్త్రీల బలవంతపు అపహరణ, అత్యాచారాలు ముఖ్యమైనవి.

ఒక్క మాటలో చెప్పాలంటే తొలినాటి ఫాక్షన్‌లు పంతం నుండి పుట్టినవి. 'నువ్వు నాకంటే

ఎక్కువా' అన్న పోటీ నుండి పుట్టినవి. అది చాలా సందర్భాలలో పరోక్షంగా సమాజం పైన ఆధిపత్యం కోసం, సమాజంలో పెద్దరికం కోసం జరిగిన పోటీయే అయినా, దాని ప్రత్యక్ష లక్షణాలు పంతం, ప్రతిష్ఠ, ప్రెస్టేజ్‌ల నుండి పుట్టినవి. నేటి ఫాక్షన్లు ప్రత్యక్షంగానే ఆధిపత్య సాధనాలు. దాదాగిరీకీ ఆస్తుల సంపాదనకూ సాధనాలు.

ముఠా కక్షలు, గుంపు కట్టి దౌర్జన్యం చేసి పెత్తనం నిలబెట్టుకునే అలవాటు బలంగా ఉన్న రాయలసీమ ప్రాంత -సాంస్కృతిక వాతావరణంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ, ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా పని చేసే అభివృద్ధి వ్యవస్థ ఆధునిక ఫాక్షన్లకు దారి తీసాయి. గ్రామ పంచాయితీ ఎన్నికలలో గెలుపు ఓటములు ప్రజల అభీష్టానికి సంబంధించిన విషయంగా గాక పెత్తనానికీ ప్రెస్టేజ్‌కూ సంబంధించిన విషయాలుగా మారాయి. గెలిచినవాడు తన గుంపును కూడగట్టి గ్రామంపైన నియంతృత్వం నెలకొల్పాలని ప్రయత్నిస్తే ఓడిపోయినవాడు ముఠాకట్టి గెలిచిన వాడి పైన యుద్ధం ప్రకటించడం మొదలుపెడతాడు. అతని సర్పంచ్‌గిరీని సాగనీయకుండ అడ్డం పడడం మొదలుపెడతాడు. అసలు అదే దౌర్జన్యంతో ప్రజల అభీష్టాన్నే లొంగదీసుకుంటే ఓడిపోవలసిన కర్మే ఉండదు కదా అన్న జ్ఞానోదయం కూడ తర్వలోనే అయింది. గుంపుకట్టి గలాట చేసి సర్పంచ్‌గా ఎన్నిక కావచ్చు. సమితికీ ఎన్నిక కావచ్చు. అటువంటి గ్రామీణ ముఠాదారులు పదిమందిని చేరదీస్తే ఎం ఎల్ ఏ కావచ్చు. ఆ పైన పదవి ఉన్నన్నాళ్ళూ ప్రభుత్వ రంగంలో నడిచే అభివృద్ధి పనుల కాంట్రాక్టులూ కమిషన్లూ తామూ తనవాళ్ళూ దౌర్జన్యంగా తీసుకొని లేదా మామూళ్ళు ఇచ్చేవాళ్లకు ఇప్పించి ఆస్తులు పెంచుకోవచ్చు. అసలు పాలనా వ్యవస్థలో పదవులున్నా లేకపోయినా ముఠాకట్టి దౌర్జన్యం చేసే సత్తా వుంటే స్వాతంత్రానంతరం బాగా పెరిగిన ప్రభుత్వ సివిల్ కాంట్రాక్టులన్నీ పోటీ లేకుండా (అంటే ఎక్కువ లాభానికి) కొట్టేయొచ్చు. ప్రభుత్వం అంతకంతకూ తన రెవెన్యూ అవసరాల కోసం పెంచుకుంటూ పోయిన సారాయి, కల్లు కాంట్రాక్టులూ అదే విధంగా కొట్టేయవచ్చు. వేరే ఎవరయినా తీసుకుంటే బాంబు లేసి బెదిరించి మామూళ్ళు వసూలు చేసుకోవచ్చు.

ఈవిధంగా ఒక మూర్ఖ సంస్కృతిగా కన్పించిన ఫాక్షనిజం స్వాతంత్రానంతరం నెలకొన్న రాజకీయార్థిక వ్యవస్థలో అత్యంత లాభదాయకమైన సంపదనామార్గం అయింది. ఈ మార్పుతో బాటు ముఠాలలో చేరే వాళ్ళ నైజం కూడ శ్రమ చేసే రైతుల నుండి వృత్తి రౌడీలకు మారేసరికి సామాన్య ప్రజలపైన దౌర్జన్యాలు, దాదాగిరీ, స్త్రీల పైన అత్యాచారాలు ఫాక్షన్లలో భాగం అయ్యాయి. **1950**ల నుండి కొద్దికొద్దిగా మొదలయిన ఈ పరిణామం **1980**ల తరువాత పూర్తి రూపం తీసుకుంది. తాడిపత్రిలో దివాకర్ రెడ్డి మనుషులు, ధర్మవరంలో ఓబుల రెడ్డి మనుషులే కాక స్వయంగా ఓబుల రెడ్డి కూడ, ఈ నరకం ఎట్లా వుంటుందో ప్రజలకు రుచి చూపించారు. పరిటాల రవి అటువంటి దౌర్జన్యాలు ప్రోత్సహించడు అని అనేవాళ్ళు అంటుంటారు గానీ అతని అనుయాయులు ఎవ్వరికీ తీసిపోరు. అతనికి ఈ సంగతి బాగానే తెలుసును.

## ఒక పాత ఫాక్షనిస్టు కథ

పాతకాలపు ఫాక్షన్లలో దౌర్జన్యంతో పాటు కొంత అమాయకత్వం, సాధారణ గ్రామీణ జీవితంలో ఉండే విలువలు కూడ కనిపిస్తాయని చెప్పాము. నిజానికి ఏ విషయంలో నయినా మన అభీష్టం సాధించుకోవడానికి గుంపును చేరదీసి దౌర్జన్యం చేయడం ఒక సబబైన మార్గమేనన్న సంస్కృతి ఉన్న ప్రాంతంలో, అన్యాయానికి వ్యతిరేకంగా జరిగే తిరుగుబాటు లేక ప్రతీకారం కూడ ఒక్కొక్కసారి ముఠాల రూపం తీసుకోవడం జరుగుతుంది. అందుకే ఫాక్షనిజాన్ని కేవలం ఒక దుర్మార్గంగా కాకుండ ఒక సాంస్కృతిక ప్రవర్తనా సరళిగా అర్థం చేసుకోవడం అవసరం. అప్పుడే అది అన్యాయం కొసమే కాక న్యాయం కోసం కూడా పని చేయగలదని అర్థం అవుతుంది. అయితే న్యాయం కోసం జరిగే కృషి లేక ప్రతిఘటన ముఠా కొట్లాటల రూపం తీససుకోవడంలో చాలా ప్రమాదం వుందని కూడ అర్థమవుతుంది. అభ్యుదయ ఉద్యమాలు ఆ ట్రాప్‌లో పడిపోకుండ ఉండడానికి ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని కూడ అర్థమవుతుంది.

పరిటాల శ్రీరాముల గురించి తరువాత చెప్పుకుందాం. అతని కంటే పూర్వీకుడయిన రాయల గోవిందప్పను ఇక్కడొక ఉదాహరణగా తీసుకోవచ్చు. అతను వజ్ర కరూర్ మండలం (ఉరవకొండ తాలూకా) కొనకండ్ల గ్రామంలోని ఒక భూస్వామ్య కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు తన ఇద్దరు కుమార్తెలనిచ్చి పెండ్లి చేసి వాళ్లతో బాటొచ్చి కొనకండ్లలో స్థిరపడ్డాడు. కమ్మకులస్తుడు. అతని స్వగ్రామం పాలికి. కొనకండ్లలో అతని వియ్యంకుడికి 100 ఎకరాల భూమి ఉండింది. కొనకండ్లతో శివారు కలిసే అన్ని ఊర్లలోనూ (పాలికి, పెంచల పాడు, పాతగుంతకల్) అతను తగవులు తీర్చడానికి పోయేవాడు. తగువులు తీర్చడం, తీర్పునిలబెట్టుకోవడం, గ్రామ పెత్తనానికి సంబంధించిన విషయాలు కాబట్టి అన్ని గ్రామాల లోనూ గోవిందప్ప గ్రామ పెత్తందర్లాతో ఘర్షనకు దిగాడు. అతనుకమ్మకులస్తుడు. వారు ఎక్కువగా రెడ్డి కులస్తులు అయినప్పటికీ ఇది పూర్తిగా కమ్మ-రెడ్డి ఫాక్షన్ కాదు. గోవిందప్ప శత్రువర్గంలో హనుమంతప్ప అను కమ్మ భూస్వామి కూడ ఉన్నాడు. తన స్వగ్రామం పాలికి లోనే తన తమ్ముడు నారాయణ స్వామిని చంపిన దాయాదులకు హనుమంతప్ప అండ ఉందని గోవిందప్ప అనుమానం. అయితే తరువాత గోవిందప్ప హనుమంతప్పతోనూ మరి కొందరు కమ్మ కులస్తులతోనూ కలిసి నూనె మిల్లు, జిన్నింగ్ మిల్లు, శెనక్కాయల వ్యాపారం నడిపాడు. దానిలో కూడ హనుమంతప్ప తో విభేధాలు వచ్చాయి. ఈ క్రమంలో హనుమంతప్ప కొనకండ్లకు చెందిన పెద్ద భూస్వామి (800 ఎకరాలు ఆసామి) అయిన శివరాం రెడ్డి వర్గంలోచేరాడు. అతని వెనక వున్న కమ్మవాళ్ళు కూడ అ వర్గంలోకే పోయారు. శివరాంరెడ్డి గోవిందప్ప ప్రత్యర్థులయిన పెత్తందార్లలో ముఖ్యుడు.

గోవిందప్ప గురించి కమ్మ కులస్తులు సహితం చెప్పేదేమిటంటే అతను 'కులానికి చెడ్డ గానీ వేరే వాళ్లకు మంచి' అని. అతనెట్లాగూ రెడ్డ పెత్తనాన్ని వ్యతిరేకించాడు కాబట్టి దీని భావ

మేమిటంటే అతను రెడ్లకూ కమ్మలకూ (కనీసం ఆ కులాల పెత్తందార్లకు) వ్యతిరేకంగా ఇతర ప్రజానీకాన్ని చేరదీసాడని. ముఖ్యంగా ఈడిగ (గౌడ), బోయ కులస్తులను చేరదీసినట్టున్నాడు. ఇది వర్గ దృక్పథంతోనో కులదృక్పథంతోనో జరిగినది కాదు. 'వాళ్ళేంది పెత్తనం చేసేది' అనే దృక్పథంతో జరిగింది. మామూలుగా దూకుడు స్వభావం ఎక్కువ ఉండే బోయలు గోవిందప్పను ఎక్కువగా అనుసరించినట్టున్నారు. గ్రామ పెత్తందార్ల పెత్తనాన్ని తిరస్కరించమనీ, వాళ్ల పంటలు దోచుకొమ్మనీ, వాళ్లనుండి రావలసిందేమయినా ఉంటే దౌర్జన్యం చేసి రాబట్టుకొమ్మనీ ప్రజలను ప్రోత్సహించేవాడు. దొంగతనాలను కూడ ప్రోత్సహించేవాడని అంటారు. (అయితే అందులో తానెప్పుడూ వాటా తీసుకోలేదనీ దొంగలించినదంతా వాళ్లనే ఉంచుకోనిచ్చేవాడనీ కూడ అంటారు. (అయితే అందులో తానెపుడే వాటాతీసుకోలేదనీ దొంగలించినదంతా వాళ్లనే ఉంచుకోనిచ్చేవాడనీ కూడ అంటారు). ఈడిగల కల్లు సొసైటీ పైన రెడ్లు పెత్తనం చేయకుండ వారికి తాను అండగా నిలబడ్డాడు. (ఈ పని తరువాత కాలంలో పరిటాల శ్రీరాములూ చేసాడు. రాకెట్లలో కమ్యూనిస్టు నాయకుడు నారాయణ రెడ్డీ చేసాడు). గొడవ పెట్టుకోవడానికి సిద్ధపడి ఎవరు తన దగ్గరికి వచ్చినా గోవిందప్ప చేరదీసి గుంపు కట్టేవాడు. అన్ని గ్రామాల పెత్తందార్లూ ఒకటయి గోవిందప్పకు వ్యతిరేకమయ్యారు. పేదలలో గోవిందప్ప అంటే అభిమానం ఉండేదంటారు. అయితే అతనిమాట వినకపోతే వారిని కూడ నిర్దాక్షిణ్యంగా శిక్షించేవాడు. ఫలాన భూస్వామికి కూలికి పోవద్దని చెప్తే పోకూడదు. అతని మాట కాదంటే దౌర్జన్యం చేస్తాడు. శత్రువర్గంలో చేరిన పేదల పట్ల కూడ శత్రు వైఖరితోనే ఉండేవాడు. గోవిందప్ప చేతిలో జరిగిన అతి ఘోరమైన హత్యలో చనిపోయిన అయిదుగురిలో ఒకరు కమ్మ కులస్తుడు కాగా మిగిలిన వాళ్ళు బోయ, చాకలి తదితర పీడిత కులస్తులు. శివరాంరెడ్డి వర్గానికి చెందిన ఈ అయిదుగురు ఎడ్లబండి కట్టుకొని (1931 మే 5వ) గుత్తి కోర్టుకు పోతుండగా గోవిందప్ప వారిని దారిలో గుంతకల్ దగ్గర తుపాకులతో కాల్చి నరికి చంపించాడు. (తనకు ప్రత్యర్థులయిన అన్ని గ్రామాల పెత్తందార్లకూ అండగా ఉంటున్నాడని పాత గుంతకల్ కు చెందిన వకీలు నాగిరెడ్డిని కూడ గోవిందప్ప చంపాడు).

గోవిందప్పను ఏ విధంగా అర్థం చేసుకోవాలి? పెత్తందార్ల దౌర్జన్యాలను, దౌర్జన్యంతో ఎదిరించమని పేదలను ప్రోత్సహించిన 'రాబిన్ హుడ్' గా అర్థం చేసుకోవాలా? లేక ఈ సాకుతో తన వెనక ఒక గుంపును చేరదీసి, అప్పటికి స్థిరపడి ఉన్న పెత్తందార్లను దెబ్బతీసి తన పెత్తనాన్ని నెలకొల్పే ప్రయత్నం చేసిన వ్యక్తిగా అర్థం చేసుకోవాలా? ఈ రోజు సమాధానం చెప్పగల వాళ్లెవరూ లేరు. అయితే బహుశా ఈ రెండు లక్షణాలనూ విడదీయడం కష్టమేమో. న్యాయం కోసం జరిగే పోరాటం కూడ పెత్తనం కోసం పోరాటంగా రూపాంతరం చెందడం ఫాక్షన్ సంస్కృతి లక్షణం. అటువంటి పోరాటంలో పీడితులిటు, పెత్తందార్లు అటు వుండరు. పీడితులు కూడ రెండు వర్గాల మధ్య చీలుతారు. అందువల్ల ఫ్యాక్షన్ రూపంలో జరిగే న్యాయ

## డబ్బు కాదు, పంతం ముఖ్యం

హనుమంతప్ప కుటుంబానికి చెందిన చత్రుగుడప్పకు గోవిందప్ప 700 రూపాయలు బాకీ వున్నాడు. దానిని ఏ విధంగానయినా రాబట్టుకోవాలని చత్రుగుడప్ప పంతం. గోవిందప్ప ఆ బాకీ తీర్చదలచుకోలేదు. చివరికి చత్రుగుడప్ప గుత్తి కోర్టులో దావావేసాడు. గోవిందప్ప హాజరు కాలేదు. అయినా దావా డిక్రీ అయింది. గోవిందప్ప చెల్లించలేదు. చత్రుగుడప్ప అర్జీ మీద కోర్టు గోవిందప్ప అరెస్టుకు బెయిలబుల్ వారంటు జారీ చేసింది. దానిని గ్రామానికి తీసుకొచ్చిన కోర్టు అమీన్‌కు గోవిందప్ప పదో ఇరవయ్యో ఇచ్చి పంపించేసాడు. ఇది ఒకటికి రెండుసార్లు జరిగే సరికి చత్రుగుడప్ప కడుపుమండి ఆ ఉద్యోగిని పట్టుకొని నువ్వు ఒక తల్లికీ తండ్రికీ పుట్టావా అంటూ (ఈ భాషలో కాదు లెండి) తిట్టాడు. అది ఫలితం ఇచ్చింది. గోవిందప్ప ఎట్టకేలకు గుత్తి కోర్టుకు వచ్చాడు. వెంటనే అతనుడబ్బు చెల్లించగా కోర్టు దానిని చత్రుగుడప్ప కు అందిచ్చింది. పంతం నెగ్గిన చత్రుగుడప్ప ఆనందంతో ఆ నోట్లన్నీ కోర్టులోనే వెదజల్లి వట్టి చేతులతో ఇంటికి వెళ్ళిపోయాడు.

పోరాటం వల్ల మంచి ఎంత జరుగుతుందో చెడు కూడ అంత జరుగుతుంది. కొంత కాలానికి న్యాయం పక్కకు పోయి వట్టి ఫాక్షన్ - లేక కొత్త పెత్తందారీ అధిపత్యం - మిగిలే ప్రమాదం ఉంటుంది.

గోవిందప్ప తరువాతి తరానికి చెందిన పరిటాల శ్రీరాములు గురించి కూడ 'అతని లక్ష్యం ఫలానా' అని నిస్సందేహంగా ఎవరూ చెప్పలేరు. అతను కూడ (గోవిందప్ప లాగ) రెడ్ల పెత్తనానికి వ్యతిరేకంగా జనాన్ని (ధనిక వర్గానికి చెందిన కమ్మకులస్తులను కూడ) చేరదీసాడు. వాళ్ల పెత్తనానికి పంచాయతులలోను, రాజకీయాలలోను అడ్డం తగిలాడు. వాళ్ల అధీనంలోను వాళ్ల అనుయాయుల అధీనంలోను ఉన్న సివాయిజమా భూములు ఆక్రమించుకోవడంలో పేదలకు సహాయం చేసాడు. అయితే రెడ్డి పెత్తందార్లకు వ్యతిరేకంగా నిలబడడానికి ఎవరు సిద్ధపడితే వాళ్లందరినీ నిర్విచక్షణగా చేరదీసాడు. గ్రామాలలో ఆ పెత్తందార్ల అనుయాయులుగా ఉన్న వాళ్లను స్థానికంగా ఎదిరించడానికి ఎవరు సిద్ధమైతే వారందరినీ చేరదీసి గుంపు చేసాడు. అతను భూస్వామ్య పెత్తనానికి వ్యతిరేకంగా పేదలకు అండగా నిలబడిన పోరాట కారుడను కోవాలా? లేక రెడ్ల పెత్తనం స్థానంలో కమ్మ పెత్తనాన్ని పెలబెట్టడానికి ముఠాలు కట్టిన వ్యక్తి అనుకోవాలా? లేక తన వ్యక్తిగత పెత్తనాన్ని నెలకొల్పడానికి పేదల అవసరాలనూ రెడ్ల పెత్తనం కింద నలిగిన వారి నిరసననూ వాడుకున్న ఫాక్షనిస్టను కోవాలా? అని అడిగితే మొత్తం మీద మొదటి వ్యాఖ్యానమే సరయినదని (కొంత తటాపటాయింపుతోనే కానీయండి) అతనిని ఎరిగిన వారందరూ

అంటారు. అయితే దాని కతను అనుసరించిన ఫాక్షన్ పద్ధతుల వల్ల రాగల దుష్పరిణామాలను అతనిని తొలి రోజులలో తమ మిత్రుడిగా భావించిన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగాని, 1970 తరువాత అతన్ని చేరదీసి విప్లవ కారుడిగా ఆమోద ముద్ర వేసిన విప్లవ కమ్యూనిస్టులు గానీ గుర్తించలేదు. ఆ దుష్పరిణామాలు తరువాత కాలంలో అతని కుమారుడు పరిటాల రవి రూపంలోనూ ఆర్ఓసి నాయకుడు పోతుల సురేష్ రూపంలోనూ దర్శన మిచ్చాయి. వాటి నుండి అనంతపురం జిల్లా ఎప్పుడు కోలుకుంటుందో చెప్పలేము.

ఆ కథ తరువాత చూద్దాం. గోవిందప్పను ఆరోజు ఏ కమ్యూనిస్టులూ చేరదీయలేదు. అతని ప్రత్యర్థులతనిపైన అనంతపురం పట్టణంలో హత్యాప్రయత్నం చేసారు గానీ అతను తప్పించుకున్నాడు. అతని కొడుకులే అతనిని బలవంతంగా ఫాక్షన్ నుండి మాన్పించారు. అతను 1950లలో ఏ కారణంగానో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తరువాత అతని కొడుకులు ఫాక్షన్ కొనసాగించక పోవడం వల్ల అది అంతరించి పోయింది. అతని కొడుకులలో ఒకడయిన రాయల వేమన్న మాత్రం ఉరవకొండ ఎమ్మెల్యేగా ఎన్నికయి 1982లో రాష్ట్ర మంత్రి వర్గంలో ఉన్నాడు.

## రాజకీయ నాయకుల ప్రవేశం

ఫాక్షనిజం లాభసాటి విషయంగా కనిపించిన క్రమంలో దానిని రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం వాడుకోవడమే కాక పెంచి పోషించడం కూడ మొదలయింది. కడప, కర్నూలు జిల్లాల్లో 1970ల చివరి దశలో లేక 1980లలో ఇది మొదలయిందని చెప్పుకోవచ్చు. అనంతపురం జిల్లాలో ఇంకొంచెం ఆలస్యంగా మొదలయింది. కడప, కర్నూలు జిల్లాలకు భౌగోళికంగాను సాంఘికంగాను దగ్గరున్న తాడిపత్రి తాలుకాలో జె.సి.దివాకర్ రెడ్డి మొదలు పెట్టాడు. అతను 1985 నుండి తాడిపత్రి ఎమ్మెల్యే. 1992దాకా ఎవ్వరి ఎదురు లేకుండ తాలూకాలో గ్రామీణ ఫాక్షనిస్టులను ప్రోత్సహించి తనబలం పెంచుకుంటూ ఉన్నాడు. ఆ తరువాత అతనికి వ్యతిరేకంగా ఆ నియోజకవర్గంలో సూర్యప్రతాప రెడ్డిని వై. ఎస్. రాజశేర రెడ్డి ప్రోత్సహించాడు. దీనికి కారణం కాంగ్రెస్ పార్టీలో రాజశేఖర రెడ్డికి వ్యతిరేకంగా కోట్ల విజయభాస్కరరెడ్డి దివాకర రెడ్డిని చేరదీయడం. అంతే కాక దివాకర రెడ్డి మరీ అడ్డు ఆపూ లేకుండా ఎదిగి పోతున్నాడని వై ఎస్ భావించడం కూడ కారణం కావచ్చు. (రాయలసీమలో తాను తప్ప వేరే ఏ పాలెగాడూ అట్లా ఎదగడానికి వీలులేదనేది ఆయన రాజకీయాలలో ప్రథమ సూత్రం) ఆ తరువాత దివాకర్ రెడ్డి , సూర్య ప్రతాప రెడ్ల వైరంలో తాడిపత్రి తాలుకా రెండుగా చీలి హింసకు రక్త పాతానికీ నెలవయింది. ఒక్కొక్క గ్రామం కథ చూసినప్పుడు స్థానిక ఫాక్షనిస్టులయిన దివాకరరెడ్డి, సూర్య ప్రతాప రెడ్డి ఈ ఘోరానికి ప్రత్యక్షంగా బాధ్యులుగా కనిపిస్తారు. వాళ్ల బాధ్యతను గుర్తించవలసిందే. కానీ వాళ్ళ వెనక ఉన్న కోట్ల విజయభాస్కరరెడ్డి , వై ఎస్ రాజశేఖర రెడ్ల పాత్రను కూడ గుర్తించడం అవసరం. వాళ్లిద్దరి మధ్య ఫాక్షన్ వైరాన్ని

వీళ్లిద్దరూ తమ స్పర్ధలో భాగంగా వాడుకొని పెంచగా వాళ్లిద్దరూ ప్రతీ గ్రామంలోనూ ముఠాలను పెంచారు, లేని చోట సృష్టించారు."

ఒక గ్రామంలో ఒక బలమైన పెత్తందారు ఒక అధినాయకుడికి అనుకూలంగా ఉంటే అతని పట్ల ప్రజలకుండే 'భయభక్తుల' వల్ల ఆ ఊరి వోట్లన్నీ అధినాయకుడు వేయించుకోవచ్చు. పంచాయితీ ఎన్నికలలో అతను తనకో తాను నిలబెట్టిన అభ్యర్థికో వేయించుకుంటాడు. అసెంబ్లీకీ పార్లమెంటుకూ అధినాయకుడు చెప్పినవారికి వేయిస్తాడు. దీనికి మారుగా అతనికేం కావాలంటే చిన్నచిన్న కాంట్రాక్టులు కావాలి. సారాయి అంగళ్లు కావాలి, సారాయిపైన నిషేధం ఉంటే దొంగసారాయి వ్యాపారానికి మద్దతు కావాలి,సమితికో మండలానికో టిక్కెట్టు కావాలి. అంతేకాక గ్రామంలో తనపెత్తనాన్ని సవాలు చేసే ప్రత్యర్థి ఎవడైనా పుడితే వాడిని అణచివేయడానికి సహాయ సహకారాలు కావాలి, కొట్లాటలకూ గుంపు పోషణకూ బాంబులకూ తుపాకులకూ పోలీసు కేసులకూ నవరులు కావాలి. ఇవన్నీ అధినాయకుడు సమకూరుస్తాడు.

ఒకవేళ ఒక గ్రామంలోని బలమైన పెత్తందారు, లేక ప్రజాదరణ గల వ్యక్తి మన అధినాయకుడికి అనుకూలం కాకపోతే అతనికి వ్యతిరేకంగా నిలబడే (అవసరమైతే వెతికి పట్టుకొని) ప్రోత్సహిస్తాడు. నేనున్నాను, నీకేం భయం లేదు, గొడవ పెట్టుకొమ్మంటాడు. కావాలంటే మందిని పంపిస్తాడు, బాంబులు సరఫరా చేస్తాడు. ఆదాయం కోసం కాంట్రాక్టు లిప్పిస్తాడు, సారా వ్యాపారంలో వాటా ఇప్పిస్తాడు. ప్రాణ భయం మరీ ఎక్కువయితే తుపాకీ లైసెన్సులు ఇప్పిస్తాడు, లేదా పోలీసు ఎస్కార్ట్ పెట్టిస్తాడు.

ఈ పని తాలూకా స్థాయిలో ఇద్దరు చేయడం మొదలుపెడితే (తాడిపత్రి దివాకరరెడ్డి, సూర్యప్రతాప రెడ్డి చేస్తున్నట్టు) ప్రతీ గ్రామం రెండుగా చీలి బీభత్సవాతావరణం ఏర్పడుతుంది. తాడిపత్రి కనీసం అర్ధ దశాబ్దకాలంగా ఈ దుర్దశను ఎదుర్కొంటూ వుంది. దీనికి ప్రత్యక్షంగా బాధ్యులైన దివాకరరెడ్డికీ, సూర్యప్రతాపరెడ్డికీ వేరే ఏ నష్టం జరగకున్నా కనీసం చెడ్డపేరయినా వచ్చింది. కానీ వీరి వెనుక ఉండి వీరిద్దరివీ ఒకరి మీదికొకరిని ఎగదోసిన కోట్ల విజయభాస్కర రెడ్డి, వై ఎస్ రాజశేఖరరెడ్డి తమ బాధ్యతను సులభంగా తప్పించుకోగలుతున్నారు.రాయలసీమ ముఠాకక్షల అధినాయకులందరి లోకీ తన పని మొత్తం చేతికి మట్టి అంటకుండ జరిపేసుకొని ఇప్పటికీ 'పెద్దాయన' గా చలామణి అవుతున్నవాడు విజయభాస్కర రెడ్డి. ఈ మహానుభావుడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి వెలగబెట్టాడు. కేంద్రంలోనూ మంత్రి పదవి వెలగ బెట్టాడు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న అరడజను మంది జాతీయ నాయకులలో ఒకడయ్యాడు. ఢిల్లీలో నడుస్తున్న లాటరీ ప్రజాస్వామ్యంలో ఏదో ఒక రోజు ప్రధాన మంత్రి అయికూర్చున్నా ఆశ్చర్య పోనక్కర లేదు .రాజశేఖర రెడ్డి కడప జిల్లాను మొత్తం పాదాక్రాంతం చేసుకొని దాదాపు ఏకైక నాయకుడిగా చలామణి అవుతున్నాడు. కడప జిల్లా బయట కూడ ఎవ్వరినీ తనకు పమ ఉజ్జీగా ఎదగనీయకుండ అణచివేసే రాజకీయం బాగా అభ్యసించాడు. అందుకోసం ఈయన మనుషులు

ఒక్క కాంగ్రెస్ పార్టీలోనే కాదు, తెలుగుదేశం పార్టీలో కూడ తయారుగా ఉంటారు. ఇప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. రేపో మాపో రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యేటట్టున్నాడు.

కానీ తాడిపత్రి తాలూకాలో ఈ దశకంలో జరిగిన హింసాకాండకు, తెగిన తలలకు, నరికిన తోటలకు, బీడు పడ్డ భూములకు, వలసపోయి ఎక్కడెక్కడో తలదాచుకున్న కుటుంబాల వెతలకు, మగవాళ్ల పశుప్రాయమైన రాజకీయాలకు బలయి సర్వస్వం పోగొట్టుకొని వీధి పాలయిన స్త్రీలు, పిల్లల కన్నీటికి వీరిద్దరూ తమవంతు నైతిక బాధ్యత వహించవలసి వుంటుంది. అయినా వాళ్ల రాజకీయ పురోగమనానికి ఏ ఆటంకం లేకపోవడం మన ప్రజాస్వామ్యం అపరిపక్వతను సూచిస్తుంది.

అయితే ఇదంతా కేవలం ఫాక్షన్లో ఇరుక్కొని ప్రాణం, ఆస్తులు కోల్పోయే వారి కథ మాత్రమే కాదు.. ఈ వాతావరణంలో గ్రామీణ ప్రజాజీవితంలో ప్రజాస్వామ్య వాతావరణం పూర్తిగా ధ్వంసం అవుతుంది. ఏ సమస్యా - అది కూలిరేట్ల సమస్య కావచ్చు, సివాయిజమా భూముల సమస్య కావచ్చు, రెండు వాడల మధ్య సమస్య కావచ్చు, రెండు కులాల మధ్య కావచ్చు, భార్యాభర్తల సమస్య కావచ్చు, ఒక నేరానికి, దౌర్జన్యానికి సంబంధించిన సమస్య కావచ్చు - న్యాయంగా పరిష్కారం అవుతుందన్న భరోసా ఉండదు. ఒక ఫాక్షనిస్టు చావిట్లోనో ఇద్దరు ఫాక్షనిస్టుల కొట్లాటలోనో న్యాయం బలికావలసిందే. ప్రజల వోటు హక్కుతో సహా అన్ని హక్కులూ ఈ కొత్త పాలెగాళ్లకు అర్పించి వాళ్లిచ్చిన స్వేచ్ఛ తీసుకొని బతకాలి. వాళ్లెంత కూలి నిర్ణయిస్తే అంత కూలికే పని చేయాలి. ఏ భూములు దున్నుకోవద్దంటే ఆ భూములు విడిచి పెట్టాలి. ఫాక్షనిస్టుల సామాజిక ఆధిపత్యం సంప్రదాయక బ్రాహ్మణీయ పితృస్వామ్య భావజాలం గల ఆధిపత్యం కావడం వల్ల దళితులు, స్త్రీల సామాజిక స్థితిగతులు, స్వేచ్ఛా స్వాతంత్రాలు ఈ ఫాక్షన్ వాతావరణంలో బాగుపడవు, ముందుకు పోవు.

ప్రజలు ఈ ఫాక్షన్ కొట్లాటలలో కేవలం నిస్సహాయంగానే ఇరుక్కుంటారనుకుంటే మనకు సమస్య పూర్తిగా అర్థం కానట్టే. ప్రజల నిస్సహాయత వాస్తవమే. ఫాక్షనిస్టులను ఎదిరించి, వాళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి బతకడం చాలా కష్టం. అయితే ప్రజలందరికీ ముఠాదారుల ఆధిపత్యాన్ని తిరస్కరించాలన్న కోరిక ఉంటుందని గానీ వారి దగ్గరికి తమ సమస్యలు తీసుకుపోకూడదన్న అవగాహన ఉంటుందని గానీ అనుకుంటే సమస్యను చిన్నది చేసి చూడడమే అవుతుంది.

గుంపును పోగు చేసి హింస చేసి పెత్తనం చేసే వ్యక్తి దగ్గరికి తమ సమస్యలు తీసుకుపోతే తమ ప్రయోజనాలు సాధించుకోవచ్చునన్న ఆలోచన ప్రజలలో బలంగా వుంది. తమకు తమతోటివారితో ఉన్న చిన్న చిన్న ఘర్షణలను ఒక ఫాక్షన్ గుంపులో భాగం కావడం ద్వారా బలప్రయోగంతో పరిష్కరించుకోవడానికి వెనకాడని బలహీనత కూడ ప్రజలలో ఉంది. ఒకరు ఒక ఫాక్షనిస్టు దగ్గరికి పోతే వారి ప్రత్యర్థి రెండవ ఫాక్షనిస్టు దగ్గరికి పోతాడు, దీనితో ఫాక్షనిస్టుల

బలం పెరుగుతుంది. సమాజం పైన వారి పెత్తనం పెరుగుతుంది. వారిని ఆశ్రయించిన వారి ప్రయోజనాలు తీరినా తీరకున్నా వారికి కూడ బలం పెరిగిన భావం కలుగుతుంది. అయితే ప్రజల మధ్య సమస్యలను తమ దగ్గరకు ప్రజలే తీసుకొచ్చే దాకా ముఠా నాయకులు కాచుకొని ఉంటారని భావించనక్కర లేదు. తమ దగ్గరకు రప్పించుకోవడం తమకు ప్రయోజనకరం అనుకుంటే బెదిరించి భయపెట్టి రప్పించుకుంటారు.

చెప్పదలచుకున్నదేమిటంటే ఫాక్షనిజం అనేది కేవలం పెత్తందార్ల లక్షణం కాదు. అది పెత్తందార్ల ప్రయోజనాలకు బాగా ఉపయోగపడుతున్న సామాజిక సాంస్కృతిక లక్షణం. దానిని నేర్పుగా ఉపయోగించుకొని రాయలసీమను రక్తసిక్తం చేసి తమ ఆస్తులు, అధికారం పెంచుకుంటున్న నాయకులను వ్యతిరేకించడం ఎంత అవసరమో, ప్రజలు కూడా అదే సంస్కృతిలో భాగంగా ఈ ఫాక్షనిజంలో తామూ పాలుపంచుకుంటున్నారని గుర్తించడమూ అంతే అవసరం. ఫాక్షనిస్టుల గుంపులో ఉండే ప్రజలే కాదు, బయట ఉండి వాళ్ల సాయుధ పెత్తనాన్ని తమ అవసరాలకోసం ఆదరించే ప్రజలు కూడ ఈ పని చేస్తారు. ప్రజలు ఈ రాజకీయ ఫాక్షనిస్టులను నాయకులుగా గుర్తించడం మానేయాలన్నా, తమ సమస్యలనూ కొట్లాటలనూ వారిఫాక్షన్ కొట్లాటలలో భాగం చేసి ప్రయోజనం పొందాలని చూసే బలహీనత నుండి బయట పడాలన్నా, రాత్రి పూట ఇల్లు దోచుకునే బందిపోట్లను ద్వేషించినట్టు ( అంతకంటే ఎక్కువగా ) ఈ ముఠానాయకులను (వారు ఎంఎల్ఏలుగానీ మంత్రులుగానీ వేరే ఏదయినా కానీ) ద్వేషించడం నేర్చుకోవాలన్నా, సామాజిక సాంస్కృతిక ప్రజాస్వామీకరణ కోసం చాలా కృషి చేయవలసిన అవసరం వుంది. బలప్రయోగానికీ, దౌర్జన్యానికీ తద్వారా నిలబెట్టుకునే పెద్దరికానికీ ఈ సంస్కృతిలో ఉన్న సాధికారతను తొలగించడానికి కృషి చేయవలసిన అవసరం చాలా ఉంది. ఆ కృషికి ఉపయోగపడుతుందన్న ఆశతోనే అనంతపురం జిల్లాలో ముఠా కొట్లాటల చరిత్ర, స్వభావాల గురించి వివరించే ఈ నివేదిక ప్రచురిస్తున్నాం. ప్రతీ గ్రామం లోని ప్రతీ ఫాక్షన్ గురించి ఇందులో రాయడం లేదు. ఉత్తర భాగాన తాడిపత్రిలో దివాకర రెడ్డి – సూర్యప్రతాప రెడ్ల ఘర్షణ గురించి, ఉరవకొండలో కౌకుంట్ల పెత్తందార్ల గురించి, జిల్లా మధ్యభాగంలో ధర్మవరంలో కనుముక్కల చెన్నారెడ్డి కొడుకు ఓబులరెడ్డి గురించి, పెనుకొండ తాలూకాలో పరిటాల శ్రీరాములు కనుముక్కల చెన్నారెడ్డి, మద్దులచెరువు నారాయణరెడ్ల పైన చేసిన ఫాక్షన్ పోరాటం గురించి, అది అతని కుమారుడు రవి ఆవిర్భావానికి దారితీసిన వైనం గురించి క్లుప్తంగా చెప్తాము.

# 2. ఉత్తర భాగం

పాతతాలూకాల లెక్కలో తాడిపత్రి, గుత్తి, రాయదుర్గం తాలూకాలు అనంతపురం జిల్లాలోని ఉత్తర భాగం. జిల్లాలో చెప్పుకోదగ్గ మోతాదులో నల్లరేగడి నేలలు ఇక్కడ మాత్రమే ఉన్నాయి. తాడిపత్రి తాలూకాలోనయితే సాగుభూమిలో 70శాతం దాకా నల్లరేగడి నేలలున్నాయి.వర్షపాతం జిల్లా అంతటిలాగ ఇక్కడ కూడ తక్కువే అయినా భూసారం వల్ల పంటలలో కొంత వైవిధ్యం ఉంటుంది. దక్షిణానికి పోతే వేరుశెనగ దాదాపు ఏకైక పంటగా కనిపిస్తుంది.

## తాడిపత్రి

రాయలసీమలోని అన్నిప్రాంతాలలాగ తాడిపత్రిలో కూడ ఒకనాడు గ్రామీణ ముఠా కక్షలకూ నియోజకవర్గ రాజకీయాలకూ పెద్దగా సంబంధం ఉండలేదు. గ్రామీణ ఫాక్షనిస్టులు ఈ పార్టీలోనో ఆ పార్టీలోనో ఉండేవారు. లేదా కాంగ్రెస్ పార్టీలోని ఈ వర్గంలోనో ఆ వర్గంలోనో ఉండేవారు. వారికి గ్రామాలలో ఉండే పట్టును ఉపయోగించుకొని పై స్థాయి నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లోనూ పార్లమెంటు ఎన్నికల్లోనూ వోట్లు పొందేవారు. అంతే తప్ప రాజకీయ నాయకులేస్వయంగా గ్రామీణ ముఠాలను పోషించడం, పెంచడం, లేనిచోట సృష్టించడం అప్పట్లో లేదు. తామే బాంబులు, తుపాకులు పట్టుకున్న గుంపులను పోషించి ప్రత్యర్థులతో గలాటాలకు దిగే అలవాటూ తొలినాడు లేదు. అది 1975 తరువాత కాంగ్రెస్‌లో ఎదిగిన యువతరం నాయకులతో వచ్చింది. తాడిపత్రిలో దివాకరరెడ్డితో వచ్చింది. పాతతరం నాయకులయిన వెంకట్రాంరెడ్డి, చల్లా సుబ్బరాయుడు, వి.కె. ఓబుల్‌రెడ్డి ఫాక్షనిస్టులు కారు, ఫాక్షన్లను పనిగట్టుకొని ప్రోత్సహించినవారు కారు. దివాకరరెడ్డి తండ్రి జూటూరు చిన నాగిరెడ్డి కాంగ్రెస్ రాజకీయాలలో చల్లా సుబ్బరాయుడు (హైకోర్టు జడ్జిగా చేసిన చల్లా కొండయ్య తమ్ముడు) మద్దతు దారుడు. నీలం సంజీవరెడ్డి ఆశీస్సులతో అతను జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యాడు. రాజ్యసభ సభ్యుడయ్యాడు. దివాకర రెడ్డి

1978 లో వికె ఓబుల రెడ్డి పైన సమితి ప్రెసిడెంట్ పదవికి పోటీ చేసినప్పుడు యువకుడు, యువరక్తం అని కొత్త తరం వాళ్లంతా సపోర్టు చేసి గెలిపించారు (జమ్మలమడుగులో శివా రెడ్డి, పులివెందులలో వై.ఎస్ రాజశేఖర రెడ్డికి కూడా యువకులు అనే ఆదరణ రాజకీయాలలో తొలిమెట్లు ఎక్కడానికి బాగా ఉపయోగపడింది). ఈ 'యువరక్తం' లో కొత్త విలువ లేవీ లేకపోగా పాత తరానికున్న కొద్దిపాటి నీతి కూడ లేకుండ పోయింది. సమితి ప్రెసిడెంటుగా ఎన్నికైన నాటి నుండి దివాకర రెడ్డి గ్రామాలలో ఫాక్షన్ పద్ధతిలో మద్దతు కూడగట్టడం మొదలుపెట్టాడు. ముఠా కక్షలున్న చోట తనకు అనుకూలమైన వారిని ప్రోత్సహించి ఎదుటివారిని అణిచివేయడానికి సహకరించి తన బలానికి గట్టి పునాది వేసుకోసాగాడు. మరొక పక్క డబ్బు సంపాదన మొదలుపెట్టాడు. 1983 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నం చేసాడు. అది రాకపోయేసరికి అలిగి స్వతంత్రంగా పోటీ చేసి ఓడిపోయాడు. కానీ కాంగ్రెస్ అభ్యర్థికంటే ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నాడు. 1985 మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్‌వాళ్లు అతనికే టిక్కెట్ ఇవ్వగా గెలిచాడు. సమితి ప్రెసిడెంట్ అయిన తరువాత మొదలుపెట్టిన కార్యక్రమం ఇప్పుడు కొనసాగించాడు. గ్రామాలలో ఫాక్షన్లు, సారాయి వ్యాపారం పైన గుత్తాధిపత్యం, ఎదిరించినవారిపైన దౌర్జన్యాలు అప్రతిహతంగా సాగాయి. తొలినాడు తిమ్మంపల్లి సూర్యప్రతాప రెడ్డి అతని అనుచరుడే (అక్కడక్కడ కొంత ఘర్షణ ఉన్నా). ఇప్పుడతని రాజకీయ ప్రత్యర్థి అయిన పేరం నాగిరెడ్డి ఆనాడు అతని అనుచరుడే. పైన ఇటు కోట్ల విజయభాస్కరరెడ్డితోనూ అటు వై.ఎస్.రాజశేఖరరెడ్డితోనూ అతనికి స్నేహసంబంధాలు వుండేవి. అందరి ఆశీస్సులతో చాలా వేగంగా బలపడ్డాడు. 1989 అసెంబ్లీ ఎన్నికలలో మళ్ళీ గెలిచాడు. సివిల్ కాంట్రాక్టులు , సారాయి కాంట్రాక్టులు, టోల్ గేట్ కాంట్రాక్టులపైన గుత్తాధిపత్యం నెలకొల్పాడు. గ్రామాలలో తనకు అనుకూలమైన ముఠానాయకుల దౌర్జన్యాలు ప్రోత్సహించి తన బలం పెంచుకున్నాడు. ఒక గ్రామం లోని ముఠాదార్లలో ఇరువర్గాలూ తన మద్దతుదార్లే అయినప్పుడు గ్రామ పంచాయితీ ఎన్నికలలో లేక గ్రామ వ్యవహారాలలో ఎవరి మాట సాగితే ఏమిలే అనుకోకుండా వారిలో ఒకరి పక్షం తీసుకొని రెండవ వర్గాన్ని అణిచివేసి తన బలం పెంచుకోవడం దివాకరరెడ్డి లక్షణం అని పాత మద్దతు దార్లయిన ప్రస్తుత శత్రువులు అంటారు.

చాలా సజావుగా సాగుతున్న ఈ ప్రస్థానానికి 1992 తర్వాత బ్రేక్ పడింది. తాడిపత్రి భగ్గుమనింది. అప్పటిదాకా దివాకరరెడ్డి వై ఎస్.రాజశేఖరరెడ్డికి బాగా సన్నిహితుడు. ఇది తనకు నష్టకరమని వాళ్లను విడదీసి దివాకరరెడ్డిని చేరదీయడం తన రాజకీయ ఎత్తుగడలకు అవసరమని కోట్ల విజయభాస్కరరెడ్డికి ముందు ఆలోచన వచ్చిందో లేక దివాకరరెడ్డి మరీ ఎదిగిపోయి తనకు పోటీగా తయారవుతున్నాడన్న భయం రాజశేఖరరెడ్డిని ముందు ఆవరించిందో లేక వైఎస్‌కూ కోట్లకూ ఉన్న అధికార పోటీలో కోట్లకు దగ్గర కావడం తన రాజకీయ పురోగతికి మంచిదన్న ఆలోచన దివాకరరెడ్డికే ముందు వచ్చిందో గానీ మొత్తానికి కాంగ్రెస్ రాజకీయాలలో విజయ

భాస్కరరెడ్డీ దివాకరరెడ్డీ ఒకటి కావడం, దివాకరరెడ్డీ రాజశేఖరరెడ్డీ వ్యతిరేకం కావడం, దివాకరరెడ్డికి వ్యతిరేకంగా రాజశేఖరరెడ్డి తాడిపత్రి తాలూకాలో 'తిమ్మంపల్లి సూరి' ని చేరదీయడం, ఆ తరువాత సూరి, దివాకర్‌లు దాదాపు ప్రతీ గ్రామంలోనూ చెరి ఒక ముఠాను చేరదీసి బీభత్సం సృష్టించడం 1992 తరువాత మొదలయింది. తాడిపత్రి పట్టణంలో అప్పటికే దివాకరరెడ్డి దౌర్జన్యాలు ఎదురు లేకుండ సాగుతున్నాయి. 1992లో రాజీవ్ గాంధి హత్య తరువాత దివాకర రెడ్డి అనుచరులు ఆ ఊరిలో చేసిన బీభత్సం అంతాయింతా కాదు. బహుశా ఏ పాతకాలపు పాలెగాడూ నెలకొల్పనంత సంపూర్ణమైన నియంతృత్వం తాడిపత్రి పట్టణంలో 1994 ఎన్నికల దాకా దివాకరరెడ్డి కొనసాగించాడు. అయితే 1992 తరువాత అది ఏకపక్షంగా లేదు. తాలూకా కేంద్రమే కాక కొన్ని గ్రామాలు కూడ దివాకర్-సూరిల ముఠా కక్షలో భాగమై విపరీతమైన హింసనూ విధ్వంసాన్నీ చవి చూసాయి. వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి (యెల్లనూరు మండలం), చిక్కేపల్లి, నిట్టూరు (యాడికి మండలం), రామలింగాయపల్లి (పుట్లూరు మండలం) ఇందులో ముఖ్యమైనవి. ఈ గ్రామాలలోని ఇరువర్గాలూ తమ నాయకుడికి అవసరం అయినప్పుడు తాడిపత్రికీ లేక ఇతర గ్రామాలకూ పోయి దౌర్జన్యం చేస్తారు. ఇతర గ్రామాలలో దెబ్బతిన్న తమ ముఠావారికి ఆశ్రయం ఇస్తారు. ఆ విధంగా ఈ గ్రామాల ముఠా కక్షలు తాడిపత్రి తాలూకా ఫ్యాక్షన్‌కు పునాది అయ్యాయి. తాడిపత్రి పట్టణవాసులతో పాటు ఈ గ్రామాల ప్రజలు తాడిపత్రి ఫాక్షన్ కొట్లాటలకు ఎక్కువ మూల్యం చెల్లించారు.

## వెన్నపూసపల్లి

వెన్నపూస పల్లి ఈ గ్రామాలన్నిటి లోనికీ ఎక్కువ అప్రతిష్ఠ పొందింది. 1991 తరువాత ఆ ఊరి ముఠా కక్షలలో 16హత్యలు జరిగాయి. కోర్టు కేసుల కోసమే ఇప్పటికీ ఇరుపక్షాలూ కలిపి 60 లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకున్నారని అంచనా. 9000 చీనీ చెట్లు (బత్తాయి చెట్లు) నరుక్కున్నారు. బోర్లు అనేకం పూడ్చుకున్నారు, భూములు అనేకసార్లు బీడు పెట్టారు (ప్రస్తుతం 400 ఎకరాలు బీడున్నాయి), కరెంటు మోటార్లు షార్ట్‌సర్క్యూట్ చేసి కాల్చుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కూడ కాల్చుకున్నారు. చివరికిప్పుడు ఒక వర్గం (సూర్యప్రతాపరెడ్డి అనుచరులయిన రామచంద్రారెడ్డి వర్గం) ఊరు విడిచి పెట్టి తాడిపత్రిలో ప్రవాసం ఉంటున్నారు. ఊరిలో ఉన్న వర్గం (దివాకర రెడ్డి అనుచరులయిన భోగతి నారాయణ రెడ్డి వర్గం) వీరి ఆస్తులను లూటీ చేయగలిగిన కాడికి లూటీ చేసి, ధ్వంసం చేయగలిగింది చేసారు. పశువులు తోలుకుపోయారు, ఎడ్లబండ్లు తోలుకుపోయారు. భూమి దాదాపు 400 ఎకరాలు బీడుంది. ఈ స్థితికి సమీప కారణం 1997 జనవరి 7 నాడు నారాయణరెడ్డి మనుషులు ప్రయాణిస్తున్న జీపు పైన యాడికి మండలం వేములపాడు దగ్గర రామచంద్రారెడ్డి వర్గం మందుపాతర ప్రయోగించడం. మందుపాతరలో అంతా తప్పించుకున్నారు గానీ, వాళ్లు తప్పించుకుని పారి

పోతుండగా వీళ్లు వెంటపడి ముగ్గురిని చంపారు. ఆ సంగతి వెన్నపూసపల్లిలో తెలిసి నారాయణ రెడ్డి వర్గం ఊరిలో ఉన్న రామచంద్రారెడ్డి వర్గీయుల పైన దాడి చేయగా వాళ్లు ఊరు వదిలి పెట్టి పారిపోయారు. వెంటబడిన వారికి ఒక వ్యక్తి మాత్రం దొరకగా అతనిని చంపారు. మిగిలిన వాళ్ళు పారిపోయి తాడిపత్రి లోనూ, బంధువులున్న ఇతర గ్రామాలలోనూ ఉంటున్నారు.

దూరం నుండి కూడ ఇరువర్గాలూ 'పోరాటం' చేసుకుంటున్నారు. యెల్లనూరు చాకళ్ళు బట్టలుతకడానికి వెన్నపూసపల్లికి పోవడానికి వీలే లేదనీ, బ్యాండు వాయించే మంగళ్ళు కూడ బ్యాండు వాయించడానికి ఆ ఊరికి పోవడానికి వీలులేదనీ తాడిపత్రిలో తలదాచుకున్న రామచంద్రారెడ్డి వర్గం మనుషులు ఆంక్ష పెట్టారు. యెల్లనూరు మండలంలోని చాలా గ్రామాలకు చాకళ్లు యెల్లనూరు నుండి పోతారు. దీనికి ప్రతీకారంగా ఆ మండలంలో ఏయే గ్రామాలలో రామచంద్రారెడ్డి వర్గీయులు తలదాచుకున్నారో ఆ గ్రామాలకు యెల్లనూరు నుండి చాకళ్ళు పోవడానికి వీలు లేదని వెన్నపూసపల్లి లోని నారాయణరెడ్డి వర్గీయులు ఆంక్ష జారీ చేసారు. వీళ్ల పంతాల కారణంగా ఆ శ్రామిక కులాల బతుకు తెరువు దెబ్బతినడమే కాక ఆ మండలంలోని చాలా గ్రామాలలో చాకలి పనులు చేసేవాళ్లు లేకుండ పోయారు. వెన్నపూసపల్లికి పీర్ల పండగకు బ్యాండు రప్పించడానికి యెల్లనూరుకు ఎస్కార్ట్‌తో సహా జీపు పంపించి తెప్పించుకోవలసి వచ్చింది.

అంతే కాక, తాడిపత్రిలో తలదాచుకున్న రామచంద్రారెడ్డి వర్గీయులు వెన్నపూసపల్లి వాళ్లెవరు తాడిపత్రికి వచ్చినా వాళ్లను నిలువు దోపిడీ చేస్తున్నారు (వాళ్లు ఏ వర్గానికి చెందిన వారు కాకపోయినా). 'మేము ఊరు విడిచిపెట్టి నష్టపోయినాము. మీరు ఊరిలో ఉంటున్నారంటే వాళ్లతో బాగున్నటే లెక్క కాబట్టి మాకు ఇవ్వండి' అని ఎదిరించి దోచుకుంటున్నారు. ఈ మధ్య ఆ ఊరి రైతొకరు తన తోటలో కాసిన చీనీ పండ్లను బండ్లలో వేసుకొని మార్కెట్‌కు తాడిపత్రికి బయలు దేరాడు. 'కమీషన్' ఇమ్మని ఊరిలో ఉన్న నారాయణ రెడ్డి వర్గీయులు అతని దగ్గర 10 వేలు దోచుకుంటే, అతను తాడిపత్రి చేరేటప్పటికీ ఆ సంగతి తెలిసిన రామచంద్రారెడ్డి వర్గీయులు అతన్నిపట్టుకొని 'నువ్వు వాళ్లకిచ్చి మాకు శత్రువు అయినావు' అని 15 వేలు గుంజుకున్నారు.

దివాకరరెడ్డికి వెన్నపూసపల్లిలో ఒక వర్గం ఏర్పడక ముందునుండి సూర్యప్రతాపరెడ్డికి ఆ ఊరితో సంబంధం వుంది. అతని స్వగ్రామమైన తిమ్మం పల్లి వెన్నపూసపల్లి లాగ యెల్లనూరు మండంలోని గ్రామమే. వెన్నపూసపల్లి తో 'సూరి'కి రాజకీయంగా సంబంధాలు ఉన్నాయి. వెన్నపూస పల్లిలో భోగతి నారాయణరెడ్డికీ రామచంద్రారెడ్డికీ ఉన్న ముఠా కక్షలో సూర్యప్రతాప రెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా ఉన్నాడు. అయితే ఈ కక్ష ఈ దశాబ్దంలోనే తీవ్ర రూపం తీసుకుంది. 1987లో సూర్యప్రతాపరెడ్డి యెల్లనూరు మండల ప్రెసిడెంటుగాపోటీ చేసినప్పుడు వెన్నపూసపల్లిలో రామచంద్రారెడ్డి వర్గం అతనికీ, నారాయణ రెడ్డి నర్గం అతని ప్రత్యర్థి అయిన (దివాకర రెడ్డి సపోర్టు చేసిన) పెద్ది రెడ్డికీ సపోర్టు చేసారు. అయినప్పటికీ రాళ్లు విసురుకోవడం మినహా

పెద్ద ఘర్షణ జరగలేదు. అప్పట్లో భోగతి నారాయణ రెడ్డికి దివాకరరెడ్డితో ప్రత్యక్షసంబంధం లేదు. దివాకర రెడ్డికి సూర్యప్రతాప రెడ్డికి మధ్య శత్రుత్వమూ లేదు. ఆ తరువాత 1989 అసెంబ్లీ ఎన్నికలలో ధర్మవరం అసెంబ్లీకి (యెల్లనూరు ఉండేది తాడిపత్రి తాలూకాలో గానీ నియోజకవర్గం ధర్మవరం) కాంగ్రెస్ తరపున పెద్దారెడ్డి, తెలుగుదేశం తరపున నాగిరెడ్డి పోటీచేసినప్పుడు సూర్యప్రతాప రెడ్డి తెలుగుదేశానికి సపోర్టు చేయగా వెన్నపూసపల్లిలో రెండు వర్గాలూ ఒకటై సూర్యప్రతాపరెడ్డి చెప్పినట్టే వోట్లు వేయించారు. (బలమైన ముఠా నాయకులున్న చోట వారి బలం పట్ల వుండే విధేయత వల్ల, భయం వల్ల చాలా వోట్లు వారి ఆదేశాలననుసరించి పడతాయి. రెండు ముఠాలూ ఒకే అభ్యర్థికి మద్దతిస్తే ఇంక ఆ ఊరిలో వేరే వాళ్లకు వోట్లు పడడం కష్టం. ఇక్కడ భయాన్ని మాత్రం అర్థం చేసుకుంటే సరిపోదు. ఫాక్షన్ సంస్కృతిలో బలవంతుల పట్ల వుండే విధేయతను, తమ గుంపు నిర్ణయాన్ని గుడ్డిగా అనుసరించే 'విశ్వాసాన్నీ' కూడ అర్థం చేసుకోవాలి). 1992 తరువాత వెన్నపూసపల్లి ఘర్షణలు తీవ్ర రూపం తీసుకున్నాకనే నారాయణరెడ్డి వర్గం దివాకరరెడ్డిని ఆశ్రయించింది. అంతకు ముందు వాళ్ళు సలహా సంప్రదింపుల కోసం ధర్మవరం ఎంఎల్ఏ నాగిరెడ్డి దగ్గరకు పోయేవారు. నాగిరెడ్డి ఫాక్షనిస్టు కాదు. అందువల్ల ఆ దశలో వెన్నపూసపల్లి ముఠా కొట్లాటలు తీవ్రరూపం తీసుకోలేదు.

1992 తరువాత అవి తీవ్రరూపం తీసుకోవడం, నారాయణరెడ్డి వర్గం దివాకరరెడ్డిని ఆశ్రయించడం, క్రమంగా పెరుగుతున్న దివాకర్-సూరిల వైరం వెన్నపూసపల్లిలోకి దిగుమతి కావడం, తాలూకా రాజకీయాలలో వై.ఎస్.రాజశేఖరరెడ్డి దివాకరరెడ్డికి వ్యతిరేకంగా సూర్యప్రతాపరెడ్డిని ప్రోత్సహించడం, రాయలసీమ కాంగ్రెస్ రాజకీయాలలో కోట్ల విజయభాస్కరరెడ్డి వై.ఎస్‌కు వ్యతిరేకంగా దివాకర రెడ్డిని ప్రోత్సహించడం, దాదాపు ఒకేసారి జరిగాయి. వీటిలో ఏది కారణం, ఏది ఫలితం అని విశ్లేషించడం ఈ నివేదిక పరిధిలో అవసరం కాదు. కానీ ఈ పరిణామంలో కొన్ని ఘట్టాలను చెప్పుకోవాలి.

ఒకటి, మట్కా వ్యాపారం వెన్నపూసపల్లిలోకి ప్రవేశించడం. రాయలసీమలో మట్కా వ్యాపారానికి తాడిపత్రి ఒక ముఖ్య కేంద్రం కాగా, ఆ వ్యాపారం నడపడంలో వెన్నపూసపల్లి వాసుల పాత్ర ప్రముఖమైంది. తాడిపత్రి లో ఆ వ్యాపారం వాళ్ళే ప్రారంభించారు. చాలా లాభాలు గడించారు. నారాయణ రెడ్డికి సన్నిహితుడయిన పుల్లారెడ్డి (1985 నుండి 91 దాకా ఇతను వెన్నపూసపల్లి గ్రామ సర్పంచ్) తాడిపత్రిని కేంద్రంగా చేసుకొని మట్కా వ్యాపారం సాగించాడు. అదే గ్రామానికి చెందిన పద్మనాభ రెడ్డి కూడ తాడిపత్రిలో మట్కా వ్యాపారం ప్రారంభించాడు. వీరిద్దరూ మట్కా వ్యాపారంలో ఒకరితో ఒకరు పోటీపడి (కొంతకాలం కలిసి వ్యాపారం చేసారనీ లాభాలు పెరిగిన క్రమంలోనే ఒకరి నొకరు నాశనం చేసుకునే వైరం పెరిగిందనీ అంటారు) పోలీసు కేసులు పెట్టుకున్న క్రమంలో పద్మనాభరెడ్డి తన అవసరాలరీత్యా రామచంద్రారెడ్డికి దగ్గరయ్యాడు. గ్రామంలో నారాయణ రెడ్డి - రామచంద్రా రెడ్ల వైరం తీవ్ర రూపం తీసుకోవడానికి,

చాలా లాభసాటి అయిన మట్కా వ్యాపారంలో పోటీయే ముఖ్య కారణం అని భావించే వారున్నారు గానీ అది ఒక కారణం మాత్రమేననీ అదే ముఖ్యం కాదనీ ఇతరులంటారు.

పుల్లారెడ్డి మట్కాయే కాక సారా వ్యాపారం కూడ చేయడం మొదలుపెట్టాడు. రాయలసీమలో అనేక గ్రామాలలాగ వెన్నపూసపల్లిలో కూడ సారాయి విషయంలో అంతకు ముందు ఒక సంప్రదాయం అమలులో వుండేది. ఊరుమ్మడి అవసరాల కోసం ఎవరు ఎక్కువ డబ్బిస్తే వాళ్లే ఏకగ్రీవంగా (చవకగా) ప్రభుత్వ సారా కాంట్రాక్టు తీసుకునే వారు. దీనిని పుల్లారెడ్డి భగ్నం చేసాడు. తాడిపత్రి తాలూకాలో వ్యాపారానికి అప్పటికే ఏకచ్ఛత్రాధిపతి అయిన దివాకర రెడ్డిని ఆశ్రయిస్తే ఊరుమ్మడి అవసరాల కోసం ఏమీ ఇవ్వకుండ కూడ పోటీ లేకుండ సారా కాంట్రాక్టు పొందవచ్చని గుర్తించాడు. ఆ పనే చేసాడు. (నారాయణరెడ్డి పుల్లారెడ్డిద్వారా తీసుకున్నాడని రామచంద్రా రెడ్డి అభియోగం).

చెప్పవచ్చిందేమిటంటే, మట్కా సారా వ్యాపారాల పాత్ర పెరిగే కొద్దీ గ్రామంలో ముఠా ఘర్షణలకు అనుకూలమైన వాతావరణం కూడ పెరిగింది. అంతకు ముందు ఘర్షణలున్నా గ్రామ ప్రయోజనాలను కొంతవరకు అందరూ గౌరవించేది. వెన్నపూసపల్లిలో వ్యవసాయం బాగానే అభివృద్ధి చెందింది. చిత్రావతి నది నుండి 5 కి. మీల పైప్ లైన్ వేసుకొని (గ్రామం ఖర్చుతో) చీనీ తోటలకు నీటి వసతి ఏర్పాటు చేసుకున్నారు (ఫాక్షన్ పెరిగిన తరవాత ఆ చీనీ తోటలనే పెద్ద ఎత్తున నరుక్కున్నారు). ప్రభుత్వ అధికార్లయినా గ్రామసర్పంచయినా అన్యాయంగా ప్రవర్తిస్తే ప్రజలు ఉమ్మడిగా వ్యతిరేకించే వారు. ఆ దశలో కూడ ముఠాలు, కొట్లాటలు ఉండేవి కానీ అవి మొత్తం గ్రామాన్ని ప్రభావితం చేసే స్థాయిలో లేవు.

కానీ కాయకష్టం చేయవలసిన అవసరం లేకుండ లాభాలు విపరీతంగా సంపాదించుకునే ఈ వ్యాపారాలు ప్రవేశించేసరికి వాటితో పాటు రౌడీ ప్రవర్తన, కొట్లాటలు పెరిగాయి. అంతకు ముందు గ్రామంలో ఎన్నికల ఘర్షణలు నివారించడానికి సర్పంచ్ పదవిని, సింగిల్ విండో అధ్యక్ష పదవిని, రెండు ప్రధాన గ్రూపులు మార్చి మార్చి తీసుకోవాలన్న నిర్ణయం కొంతకాలం అమలులో ఉండింది. ఇది ప్రజలకు తమ అభీష్టం ప్రకారం తమ ప్రతినిధిని ఎన్నుకునే ప్రజాస్వామిక హక్కు లేకుండ చేస్తుంది. అయినప్పటికీ రాయలసీమలో ఇదే కొంత 'ప్రజాస్వామిక' ప్రవర్తన అనిపించుకుంటుంది. ముఠా కక్షలు బలంగా వున్న గ్రామాలలో ఇరువర్గాలూ ఎన్నికలప్పుడే బాంబులు వేసుకోకుండ, చంపుకోకుండ, రాజీపడి వోట్లో పదవులో సామరస్యంగా పంచుకుంటే అదే ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది. ఇది రాయలసీమ దురదృష్టం. అయితే ఆ 'ప్ర జాస్వామ్యం' సహితం వెన్నపూసపల్లిలో 1991 తరువాత నిలువలేదు. 1991లో పార్లమెంటు ఎన్నికలలో మొట్టమొదటిసారిగా ఆ ఊరిలో సూర్యప్రతాప రెడ్డి ఆదేశం మేరకు భారీగా రిగ్గింగ్ జరిగింది.

1992 అక్టోబరు 3న వెన్నపూసపల్లి పొరుగు గ్రామమయిన గురిజాల శివారులో రామచంద్రా రెడ్డి

పైన నారాయణరెడ్డి వర్గీయులు హత్యా ప్రయత్నం చేసారు. ఆ ఘర్షణలో దాడి చేసిన వారిలోనే ఒక ఎరుకల కులస్తుడు (పులివెందుల నుండి వచ్చిన రామయ్య అనే కిరాయి హంతకుడు) చనిపోయాడు కానీ రామచంద్రారెడ్డి బతికాడు. దీనికి ప్రతీకారంగా అదే నెల చివర్లో నారాయణరెడ్డి వర్గీయుడైన పుల్లారెడ్డిని (మట్కా, సారా వ్యాపారి - మాజీ పర్పంచ్) తాడిపత్రిలో చంపారు.

ఇంక ఆ తరువాత వరసగా హత్యలు జరిగాయి. ఇప్పటికీ మొత్తం సంఖ్య 16కు వచ్చింది (వెన్నపూసపల్లి వాస్తవ్యులవే). అప్పటివరకు పుల్లారెడ్డితో మాత్రమే దివాకరరెడ్డికి సంబంధాలున్నాయి. కానీ అతని హత్య తర్వాత అతని వర్గం (అంటే నారాయణ రెడ్డి వర్గం) దివాకర్‌రెడ్డి దగ్గరకు చేరి అతని అండ కోరారు. అప్పటికే సూర్యప్రతాపరెడ్డిని వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఎగదోస్తున్నాడు. కాబట్టి వెన్నపూసలపల్లిలో అతని మనుషులకు వ్యతిరేకమైన వారిని చేరదీయడానికి దివాకర్ రెడ్డి వెనకాడలేదు.

పుల్లారెడ్డి హత్యను దివాకర్ రెడ్డి సీరియస్‌గా తీసుకోవడానికి మరొక కారణం ఉండవచ్చు. తాడిపత్రి తాలూకాలో సారాయి వ్యాపారం పైన దివాకర్ రెడ్డికి ఉన్న గుత్తాధిపత్యానికి ఆ హత్య ఒక సవాలు. ఈ గుత్తాధిపత్యం వల్ల దివాకర్ రెడ్డి చాలా సంపాదించాడు. 1984-85 సీజన్ నుండి సారాయి వ్యాపారంలోకి దిగిన దివాకర్‌రెడ్డి మొదట్లోనే జీపులను, వాటినిండా గుండాలను పెట్టుకొని ఎవరినీ పోటీకి రానీయకుండాఏకచ్ఛత్రంగా సారాయి సామ్రాజ్యాన్ని ఏలసాగాడు. పోటీకి రాదలచుకున్నవారు బలవంతంగా అతనితో 'సిండికేట్' కావాలి, లేదా పోటీ నుండి వైదొలగి వెళ్లిపోవాలి. ఈ విధంగా అతను చాలా చవకగా కాంట్రాక్టు పొంది విపరీతంగా లాభాలు సంపాదించుకున్నాడు. 1992-93లో వై.ఎస్ పనిగట్టుకుని పోటీ పెట్టేదాకా యిది సాగింది. తాడిపత్రి తాలూకాలో కనీసం రూ.15 లక్షలకు పోవలసిన వేలంపాట రూ 5 లక్షలకే దివాకర రెడ్డికి దక్కడం చూసి 1988-89లో పేరంనాగిరెడ్డి (తెలుగుదేశం నాయకుడు ప్రస్తుతం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్) పట్టుదలగా పోటీకి పోయి రెండు గ్రామాలలో వేలం పాట గెలిచాడు. కానీ దివాకర్ రెడ్డి మనుషుల దౌర్జన్యానికి తట్టుకుని వ్యాపారం చేయలేకపోయాడు. ఆ సంవత్సరం నష్టపోయినా 1989-90లో నాగిరెడ్డి మళ్ళీ పోటీపెట్టి రెండుగ్రామాలలోనూ, తాడిపత్రి పట్టణంలో రెండు వాడలలోనూ కాంట్రాక్టు పొందాడు. కాని దివాకర్ రెడ్డి అది కూడ సాగనివ్వలేదు. నాగిరెడ్డి ప్రభుత్వానికి శిస్తు చెల్లించక తప్పలేదు గానీ సారాయి అమ్ముకోలేక పోయాడు. దివాకర్ రెడ్డి మనుషులు అతనిని దౌర్జన్యంగా అటకాయించి, దొంగసారాయి తీసుకొచ్చి అమ్మారు.

దివాకర్ రెడ్డి దౌర్జన్యంగా నెలకొల్పిన ఈ సారాయి మోనోపలీని దెబ్బ తీయడానికే తాను అతనికి వ్యతిరేకంగా సూర్యప్రతాపరెడ్డిని ప్రోత్సహించాననీ, అంతే తప్ప వేరే రాజకీయ దురుద్దేశ్యం ఏదీ లేదనీవై.ఎస్ అంటాడు (ఒకవేళ కాంగ్రెస్ రాజకీయాలలో దివాకర రెడ్డి అతనికి అనుకూలంగానే ఉండి ఉంటే ఈ మోనాపలీ వై ఎస్‌కు అభ్యంతరకరం అనిపించి వుండేది కాదని కడప జిల్లాలో అతని

వ్యవహారశైలిని బట్టి కచ్చితంగా చెప్పవచ్చు). మొత్తానికి ప్రభుత్వ రెవెన్యూ కాపాడే ఈ దేశభక్తియుతమైన కార్యక్రమం వై.ఎస్ 1992-93 నుండి మొదలుపెట్టాడు. అంతకుముందు దివాకర రెడ్డి తాలూకా మొత్తం మీద ఆరు లక్షలకే సారా కాంట్రాక్టు తీసుకోగా వై.ఎస్ ప్రవేశించిన తర్వాత ఎన్నడూ లేని పోటీ పెరిగి 1995 -96 లో 24 లక్షలకు తీసుకోవలసి వచ్చింది. అయితే ఈ పోటీ కేవలం సారా కాంట్రాక్టు దగ్గరే కాదు, సివిల్ కాంట్రాక్టులు, టోల్ గేట్ కాంట్రాక్టు, ఎన్నికలు అన్నిటి దగ్గరా సాగింది.

పుల్లారెడ్డి హత్య తర్వాత వెన్నపూసపల్లిలో రెండు ముఠాల మధ్య ఘర్షణ తీవ్రస్థాయిలో నడిచింది. వ్యవసాయ బావుల మోటార్లు ఎత్తుకుపోవడం, ధ్వంసం చేయడం, పొలాలకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు నాశనం చేయడం, బోర్లు పూడ్చడం, చీనీ చెట్లు నరుక్కోవడం, ఇళ్ళు కాల్చడం, కూల్చడం జరిగింది. గ్రామంలో ఉన్న పోలీస్ పికెట్ ఇవన్నీ ఉదాసీనంగా చూస్తుండింది. పోలీసుల కళ్లముందే లైసెన్సు లేని తుపాకుల పట్టుకుని పోతుంటే కూడా పట్టించుకోక పోగా వాళ్ళు 'టాటా' చెపితే జవాబుగా 'టాటా' చెప్పి సాగనంపేవారు. ఇరువర్గాల మధ్య గ్రామ ప్రజలు చాలా నలిగి పోయారు. ముఖ్యంగా కూలివాళ్లు. ఒకరికి సన్నిహితంగా ఉంటే మరొకరు ఏమంటారో అని (ఎవరో ఒకరి మీద ఆధారపడక తప్పదు కాబట్టి) భయపడ్డారు. చాలా కుటుంబాలు ఊరు విడిచి వెళ్లిపోయాయి. ముఠా హత్యలలో గ్రామ పోస్ట్ మాష్టర్ రామకృష్ణారెడ్డి పైన నమోదయిన మర్డర్ కేసులో సాక్ష్యం చెప్పవలసి వస్తుందేమోనన్న భయానికి పోస్టల్ రన్నర్ చాకలి రాజా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి సంబంధించిన ఉమ్మడి పనులన్నీ నాశనమయ్యాయి. ఊరిలోని రెండు ముఠాలు ఊరిలో కొట్టుకోవడమే కాక తాలూకాలోని అన్ని ప్రాంతాలకూ తమ అధినాయకుల సేవలో గలాటాలకు పోసాగారు. తాడిపత్రి తాలూకాలోనే కాదు పులివెందుల గొడవలకు కూడా 'సూరి' మనుషులు పోయేవారు. దివాకర రెడ్డితో సంబంధాలు పెట్టుకున్న తొలిదశలోనే నారాయణ రెడ్డి మనుషులు ఈ గొడవలు ఎంత దూరం పోతాయోనని భయపడి పులివెందులకు పోయి వై.ఎస్‌ను కలిసి అతనినే రాజీ చేయమని అడిగారట. అతను ఆసక్తి చూపలేదు. 'నేనూ దివాకర రెడ్డి కొట్లాడుకునేది వెన్నపూసపల్లిలోనే ' అని చెప్పి పంపించాడు. వీళ్ళు రాజీ పడిపోతే దివాకర రెడ్డిపైన పోరాటం చేయటానికి అతనికి మనుషులు ఎక్కడ దొరుకుతారు?

## మరికొన్ని గ్రామాలు

తాలూకాలో దివాకర్ - తిమ్మంపల్లి సూరిల ఫాక్షన్‌లో మరికొన్ని గ్రామాల పాత్రను చూద్దాం. తిమ్మంపల్లినే మొదట తీసుకోవచ్చు. వెన్నపూసపల్లి లాగ ఈ ఊరు కూడ యెల్లనూరు మండలంలో ఉంది. తిమ్మంపల్లిలో సూర్యప్రతాపరెడ్డి తండ్రి రాంరెడ్డి కాలం నుండి ఆ కుటుంబానికి మరొక కుటుంబంతో ఫాక్షన్ ఉండింది. వాళ్లు నలజినిగారి పెద ఫకీర్‌రెడ్డి , నడిపి ఫకీర్

రెడ్డి, చిన ఫకీర్‌రెడ్డి అని ముగ్గురు అన్నదమ్ములు. రాంరెడ్డి ఈ నాటి ముఠా నాయకులంత దౌర్జన్యపరుడు కాడని అతని ప్రత్యర్థులు కూడ అంటారు. అయినప్పటికీ అతవంటే చాలా భయం ఉండింది. ఒకసారి ఊరిలోని తన ప్రత్యర్థులు ఫాక్షన్ మొదలుపెట్టకుండ ఉండడం కోసం వాళ్లను పిలిపించి నిర్బంధంగా 10 వేల రూపాయలకు ఒక్కొక్కరి దగ్గరా బాండ్లు రాయించుకున్నాడు. లక్ష్మిరెడ్డి అనే ప్రత్యర్థి బాండ్ రాయడం కోసం పిలుచుకురమ్మని రాంరెడ్డి పంపించిన మనుషులు లక్ష్మిరెడ్డితో ఘర్షణకు దిగి అతనిని కొట్టి చంపారు. అతని శవాన్ని ఊరిలోకి తేవడానికి సహితం ఎవరూ సాహసించలేదు. అయినప్పటికీ అప్పటి జిల్లా ఎస్.పి బలవంతం మీద హత్య కేసు, బలవంతంగా బాండ్లు రాయించుకున్న కేసు నమోదయ్యాయి. ఆ తరువాత ముఠా ఘర్షణ పెరిగింది. 1970ల లోనే మొత్తం 9 హత్యలు జరిగాయి. రాంరెడ్డి చనిపోయిన తరువాత ప్రత్యర్థులు సూర్యప్రతాపరెడ్డితో రాజీ అయ్యారు. కొంత కాలం ఫాక్షన్ చల్లబడింది. కానీ సూర్యప్రతాప రెడ్డి – దివాకర్ రెడ్డి ఘర్షణతో అది మళ్ళీ రాజుకుంది. అవతలి వర్గానికి వెన్నపూసపల్లి నారాయణ రెడ్డి వర్గం మద్దతు ( అంటే దివాకర రెడ్డి మద్దతు ) దొరికింది.

చీనీ చెట్లు ఈ ప్రాంతంలో ప్రధాన ఆదాయమార్గం కాబట్టి చీనీచెట్లు నరకడం ఒక ముఖ్య ప్రతీకార సాధనం. ఇది సూర్యప్రతాప రెడ్డే మొదలు పెట్టాడని చాలామంది అంటారు. తరువాత అందరూ అలవరచుకున్నారు. చీనీతోటల పెంపకం పెట్టుబడితో కూడుకున్న వ్యవహారం కాబట్టి, ఈ భయానికే సగభాగం ప్రత్యర్థులు రాజీపడతారు. రాజీపడని వాళ్ళు వందల చెట్లు నష్టపోవలసి వుంటుంది. ఒకవేళ చెట్లు నరకకపోయినా ప్రత్యర్థిని గ్రామం నుండి తరిమేసిన తరువాత చీనీతోటలకు నీళ్లు లేకుండ చేసి ఎండబెడతారు.

ప్రస్తుతం తిమ్మంపల్లిలో సూర్యప్రతాపరెడ్డికి వ్యతిరేకులయిన వాళ్లు చాలామంది వెన్నపూస పల్లిలో తలదాచుకుంటున్నారు. అదేవిధంగా తాలూకాలోని అనేక గ్రామాలలో దివాకర రెడ్డి వర్గీయుల చేతిలో దెబ్బతిన్న వాళ్లు తమ ఊర్లు విడిచిపెట్టి తిమ్మంపల్లిలో ఉంటున్నారు. ఈ రెండు గ్రామాలలూ రెండు ఫాక్షన్‌లకూ కేంద్రాలుగా మారిపోయాయి.

ఈ విధంగా వలసవచ్చిన వాళ్లు తమ ఇళ్లు, భూములు వదిలిపెట్టి వచ్చేస్తారు. ఆ భూములు బీడుంటాయి లేదా ప్రత్యర్థులు వాటిని సాగుచేసుకుంటారు. ( తిమ్మంపల్లి లోసూర్యప్రతాప రెడ్డి వర్గంపైన ఈ అభియోగం ఉంది). మరి వీరి పోషణకు వనరులెక్కడి నుండి వస్తాయి? నాయకులు అక్రమార్జన మార్గాలు చూపిస్తారు. సారా వ్యాపారం ఉన్న రోజులలో అందులో ఒక వాటా, అది నిషేధించబడిన తరువాత దొంగసారా వ్యాపారం, ఐ.ఎం.ఎఫ్.ఎల్‌పైన నిషేధం ఉన్న రోజులలో కర్నాటక నుండి తీసుకొచ్చిన దొంగ బ్రాంది అమ్మకం సులభ ఆదాయ మార్గాలు. తాడిపత్రిలో ఉన్నంత దొంగ మద్యం వ్యాపారం రాష్ట్రంలో ఎక్కడా లేదని ఈ నాయకులే అంటారు. ఈ వ్యాపారం అందరూ చేస్తారు. అందరూ ప్రోత్సహిస్తారు. ఈ పార్టీ ఆ పార్టీ, ఈ నాయకుడు, ఆ నాయకుడు అన్న తేడా లేదు. ఇది కాక మట్కా ఉంది, రౌడీ మామూళ్ళున్నాయి,

బలవంతపు వసూళ్ళున్నాయి, తాడిపత్రిలో మట్కా వ్యాపారం ఎవరు చేసినా మామూళ్ళు దివాకర రెడ్డికి ముట్టవలసిందే. ఇది అతనికి ఆదాయమార్గం, అతని గుంపు పోషణకొక మార్గం.

ముఠాకు నాయకుడు ఒకడుంటే సరిపోదు. దౌర్జన్యాలకు ముందు నిలబడి రౌడీలను పోగుచేసి స్వయంగా దాడులకు నాయకత్వం వహించే 'సేనాపతి' ఒకరు కావాలి. ముఠా నిర్వహణ, అంటే దాని మేనేజ్‌మెంట్ చూసుకునే 'మంత్రి' ఒకరు కావాలి. మూడు తానే అయిన ముఠా నాయకులు అరుదు. వాళ్లు తరచుగా ఎం.ఎల్.ఏలు, మంత్రులు లేక పార్టీ నాయకులు అయి వుంటారు. రాజకీయాలలో తలమునకలయి ఉంటారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొంత పెద్దమనిషి లాగ కనిపించవలసిన అవసరం, కొంత ఉదారంగా వ్యవహరించవలసిన అవసరం ఉంటుంది. కాబట్టి అన్ని పనులూ వారే చూసుకోలేరు. వై.ఎస్ రాజశేఖరరెడ్డి రెండవ కర్తవ్యం – అంటే గుంపు వ్యవహారాల నిర్వహణ – తానే చూసుకుంటాడు గానీ రౌడీయిజం చేయించే పని అతని తండ్రి (ఈ మధ్యనే ఈ లోకాన్ని విడిచిపోయిన రాజారెడ్డి), అతను నియమించిన సబార్డినేట్లు చూసుకునేవారు. దివాకరరెడ్డి గుంపుకు ఈ కర్తవ్యం మోసే వ్యక్తి అతని తమ్ముడు ప్రభాకరరెడ్డి. నోటి దురుసు, దుందుడుకుతనం, దౌర్జన్యం అతని లక్షణాలు. దివాకర రెడ్డి అంటే లేని భయం ప్రభాకరరెడ్డి అంటే ఉంటుంది.

దివాకరరెడ్డి ముఠా నిర్వహణ వ్యవహారాలు – సారాయి వ్యాపారం మేనేజ్‌మెంట్‌తో సహా– చూసుకున్న పాములపాటి వెంకటపతి కథ కొంచెం వివరంగానే చెప్పుకోవాలి. ఈ దివాకరరెడ్డి 'రైట్ హ్యాండ్'ను **1995** ఆగస్ట్ **26**న సూర్యప్రతాప రెడ్డి వర్గం హత్య చేయడం దివాకరరెడ్డికి పెద్ద దెబ్బ. ఇతనిది పుట్లూరు మండలం రామలింగాయపల్లి (ఈ ఊరిని చెర్లోపల్లి అని కూడ పిలుస్తారు). కమ్మకులస్తుడు. అయితే కులపక్షపాతం లేకుండ తన అధినాయకుడికి వ్యతిరేకు లయిన కమ్మవారిని సహితం నిర్దాక్షిణ్యంగా అణిచివేయడానికి సిద్ధంగా ఉన్న విశ్వాసపాత్రుడు.

వెంకటపతికీ అతని దాయాది ఫకీరప్పకూ **1969** పంచాయితీ ఎన్నికలలో పోటీ వచ్చింది. ఆ ఘర్షణ ఫలితంగా ముఠాలు ఏర్పడి వెంకటపతి వర్గం రెండు హత్యలు చేసింది. తరచు ఇరువర్గాలూ మిద్దెలెక్కి రాళ్లు వేసుకునేది. అప్పట్లో గ్రామంలోని రెడ్డి కులస్తులు వెంకటపతికి సపోర్టుగా వున్నారు (ఆ ఊరిలో రెడ్లూ కమ్మలూ సమాన సంఖ్యలో ఉన్నారు). ఇరువర్గాలూ గుంపు పోషణ కోసం బాగానే ఖర్చు పెట్టుకున్నారు. ఫకీరప్ప బట్టలుతకడానికి వీలు లేదని వెంకటపతి ఊరి చాకళ్లను శాసించాడు.

సమితి ఎన్నికలలో దివాకరరెడ్డి సమితి అధ్యక్షుడయినప్పుడు ఉపాధ్యక్ష పదవి వెంకటపతికి ఇప్పించాడు. అది తనకు దక్కుతుందని ఆశించిన గుత్త వెంకటనాయుడు (ఓబులాపురం నివాసి, కమ్మ కులస్థుడు, ప్రస్తుతం ధర్మవరం ఎమ్మెల్యే) అలిగి వెంకటపతి దాయాదులను ఎగదోసాడు.

వెంకటపతి ఓబులాపురంలో (ఈ ఊరు రామలింగాయపల్లికి రెండు కి.మీల దూరాన ఉంటుంది). వెంకటనాయుడుకు వ్యతిరేకమైన కంది ఓబులునాయుడును ప్రోత్సహించి వాళ్ల కొట్లాట పెంచాడు. వెంకట నాయుడు ఓబులాపురంలోకి పోలేని పరిస్థితి ఏర్పడింది. వెంకటపతి ఈ లోపల దివాకరరెడ్డికి మరింత దగ్గరయ్యాడు. 1984 నుండి అతని సారావ్యాపారం మొత్తం చూసుకునే బాధ్యత చేపట్టాడు. దివాకర రెడ్డికి 'రైట్ హ్యాండ్' అనీ 'హోం మినిస్టర్' అనీ పేరు తెచ్చుకున్నాడు.

ఈ విధంగా రామలింగాయపల్లి ఫకీరప్ప, ఓబులాపురం వెంకటనాయుడు ఒకటయి రామలింగాయపల్లి రెడ్లను కొందరిని కలుపుకొని , వెంకటపతిని దెబ్బతీయాలంటే దివాకరరెడ్డికి వ్యతిరేకి అయిన సూర్యప్రతాపరెడ్డిని ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు. (ఈ రెడ్లు ధర్మవరం ఎం ఎల్ ఏ నాగిరెడ్డికి దగ్గరవుతున్నారని దివాకరరెడ్డికి కోపం వచ్చి వెంకటపతిని వీళ్లకు వ్యతిరేకంగా ప్రోత్సహించగా వీళ్లు భయపడి తమ చేతిలో ఉన్న సర్పంచ్ పదవికి రాజీనామా చేసి తెల్లజెండా ఎత్తినా దివాకరరెడ్డి శాంతించక పోయేసరికి సూర్యప్రతాపరెడ్డి దగ్గరకు పోవడానికి సిద్ధంగా ఉన్నారు.) సూర్యప్రతాపరెడ్డి ద్వారా వీళ్లు వై.ఎస్. రాజశేఖరరెడ్డి దరి చేరి అతనిని పిలిచి రామలింగాయపల్లిలో డిన్నర్ ఏర్పాటు చేసారు. (కొట్లాటకు దిగదలచుకున్న వారు దానికి సూచికగా తమ పక్షాన నిలబడే ప్రముఖ ఫాక్షనిస్టును పిలిచి డిన్నర్ ఏర్పాటు చేయడం ఒక అలవాటు). ఈ సూచిక అర్థమేమిటో గ్రహించిన జె.సి. ప్రభాకర రెడ్డి డిన్నర్ జరిగే రోజున 20 జీపులతో రామలింగాయపల్లిపైన దాడి చేయడానికి బయలుదేరాడు. తాము ఎదుర్కొని వెనక్కి పంపించామని వీళ్ళు అంటుండగా, వెంకటపతే పోవద్దని ప్రభాకరరెడ్డిని ఆపాడని అతని కుమారుడు అంటాడు.

సూర్యప్రతాపరెడ్డితో చేతులు కలిపి వై.ఎస్ ఆశీస్సులు పొందిన వెంకటపతి ప్రత్యర్థులు 1995 అక్టోబర్ 26న అతనిని గ్రామంలోనే హత్య చేసారు. ఆ ఊరి కరణం అశ్వత్థ రామయ్య ఇంటికి ఆ రోజు వెంకటపతి మామూలుగా తన వెంట ఉండే ఎస్కార్ట్ లేకుండా పోయాడు. ప్రత్యర్థులు వెంకటపతికి సన్నిహితంగా ఉండి ఆ తరువాత దూరమైన వ్యక్తులను ప్రయోగించి ఆ యింట్లోనే వెంకటపతిని నరికి చంపారు. ఆ తరువాత వెంకటపతి మనుషులు కరణం ఇల్లు పీకేసారు. హత్య చేసిన వర్గం కొన్నాళ్ళు ఊరువిడిచి వెళ్లి పోయారు. ఇరువర్గాలూ తోటలు నరుక్కున్నారు (చీనీ తోటలే కాక అరటి తోటలు కూడ). బోర్లు పూడ్చుకున్నారు, మోటార్లు ధ్వంసం చేసుకున్నారు. మొత్తం ఈ ఊరిలో 12000 చెట్లు నరుక్కున్నారని అంచనా. ఇరువర్గాలపైన చెరి 70 క్రిమినల్ కేసులున్నాయంటే ఎంతటి బీభత్సవాతావరణం గ్రామంలో నెలకొని వుందో అర్థం అవుతుంది. ఈ ఊరి వైరుధ్యాలు అంత తీవ్రరూపం తీసుకోవడంలో దివాకరరెడ్డి, సూర్యప్రతాపరెడ్డి, వై.ఎస్‌రాజశేఖర రెడ్లు నిర్వహించిన పాత్ర చూసాము.

ఇదంతా రెండు ముఠాల మధ్య ఘర్షణగానే కనిపించినా సామాన్య ప్రజలకు ,సామాజిక విలువలకు దీని వల్ల చాలా నష్టం ఉంటుందని ఇప్పటికే వివరించి ఉన్నాము. సందర్భం వచ్చినప్పుడు మరికొన్ని ఉదాహరణలు చెప్తాము. ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి ప్రజలకు రావలసిన ప్రయోజనాలను ముఠా నాయకులు తమ అనుయాయులకే ఇప్పించుకోవడం ఒక సాధారణ విషయం. ముఠాలు, ముఠా కొట్లాటలు లేని చోట కూడ ఇది జరుగుతుంది. కానీ ఇక్కడ ముఠా నాయకులే దౌర్జన్యంగా ఆ సదుపాయాలను స్వంతం చేసుకోవడం కూడ జరుగుతుంది. జె.సి దివాకర రెడ్డి **10** లారీలు బేనామీగా (డ్రైవర్,క్లీనర్ల పేరిట) ఎస్.సి కార్పొరేషన్ నుండి తీసుకున్నాడన్న అభియోగం ఉంది. వెంకటపతి కూడ బలహీనవర్గాలకు చెందవలసిన **12** బోర్లు బేనామీగా సాంక్షన్ చేయించుకున్నాడు. రామలింగాయపల్లి దళితుల పేరు మీద ఎస్.సి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయించుకొని స్వంతం చేసుకున్నాడు. తన స్వంత చేపల చెరువు నింపడానికి ప్రభుత్వం ఖర్చుతో శాంక్షనయిన చెక్ డ్యాములు నాలుగు ఆ చెరువులోకి పారేటట్టు కట్టించుకున్నాడు. ఆంధ్రాబ్యాంకు మేనేజర్ను లొంగదీసుకుని గొర్రెల ఫారం రుణాలు, వ్యవసాయ రుణాలు బేనామీగా తీసుకున్నాడని కూడా అభియోగం.

## చిక్కేపల్లి - నిట్టూరు

తాడిపత్రి కథ మొత్తం తెలుసుకోవాలంటే యాడికి మండలం చిక్కేపల్లి-నిట్టూరు ఫాక్షన్ కథ కూడా తెలుసుకోవాలి. నిట్టూరు పేరం నాగిరెడ్డి స్వంత ఊరు. పేరం నాగిరెడ్డి తెలుగుదేశం నాయకుడు, ప్రస్తుతం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్. **1994** దాకా దివాకర్‌రెడ్డి చేతిలో చాలా నష్టం చవిచూసిన ప్రత్యర్థి. అతను స్వయంగా ఫాక్షనిస్టు కాడు గాని వాళ్ల కుటుంబానికి పొరుగూర్తైన చిక్కేపల్లికి చెందిన వారితో ఫాక్షన్ ఉండింది. దానిని దివాకర్ రెడ్డి ప్రోత్సహించి నాగిరెడ్డిని రాజకీయంగా అణచడానికి వాడుకున్నాడు. నాగిరెడ్డికి శ్లాబ్‌స్టోన్ పాలిషింగ్ యూనిట్లు, లారీలు ఉన్నాయి.**1983** లో తాడిపత్రి లారీ యజమానుల అసోసియేషన్ అధ్యక్షుడయ్యాడు. తాడిపత్రి సమీపంలో నాపరాయి చాలా దొరుకుతుంది. తాడిపత్రిని ఆనుకుని ఉన్న సద్దలదిన్నెలో దాదాపు **1500** పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటి యజమానులలో నాగిరెడ్డి బంధువులు చాలామంది ఉన్నారు. బహుశా నాగిరెడ్డి వాళ్ళు తాడిపత్రిలో ఆర్థికంగా బలపడుతున్నారని కాబోలు దివాకర్‌రెడ్డి వాళ్ల స్వగ్రామంలో వాళ్ల ప్రత్యర్థులను వెనకేసుకు రాసాగాడు. **1987** దాకా నాగిరెడ్డి కుటుంబం ,వాళ్ల చిక్కేపల్లి ప్రత్యర్థులు ఇద్దరూ దివాకరరెడ్డి మనుషులే. అయితే దివాకర్ రెడ్డి పనిగట్టుకొని ఆ ప్రత్యర్థులను ప్రోత్సహించడం మొదలుపెట్టిన నేపథ్యంలో నాగిరెడ్డి **1987**లో తెలుగు దేశం పార్టీలో చేరాడు. ఎన్నికలలోనే కాక సారాయి వ్యాపారంలో కూడా దివాకర్ రెడ్డితో తలపడ్డాడు. **1992** అనంతరం సూర్యప్రతాప రెడ్డి దివాకర్ రెడ్డికి వ్యతిరేకమైన తర్వాత అతనికి దగ్గరయ్యాడు, **1994** తర్వాత పరిటాల రవి అండ తీసుకున్నాడు.

నిట్టూరుకు చెందిన పేరం నాగిరెడ్డి మేనమామ చెన్నారెడ్డికి (ధర్మవరం పెద చెన్నారెడ్డి) చిక్కేపల్లికి చెందిన సిద్ధవటం ఎరికలరెడ్డికి ఎన్నికల సంబంధమైన ఘర్షణ ఉండింది. **1987** లో చెన్నారెడ్డి సింగిల్‌విండో అధ్యక్ష పదవికి పోటీ చేసినప్పుడు చిక్కేపల్లివాళ్లు అతనిని ఓడించడానికి ప్రత్యర్థికి అనుకూలంగా నిట్టూరు కొచ్చి రిగ్గింగ్ చేసారు. ఇది దివాకర్‌రెడ్డి సలహా మేరకే జరిగిందని నాగిరెడ్డి అంటాడు. అప్పటికి ఈ రెండు వర్గాలూ దివాకర్‌రెడ్డి మనుషులే అయినప్పటికీ కావాలని ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని ప్రోత్సహించడానికి కారణం నాగిరెడ్డి కుటుంబం ఆర్థికంగా పైకి వస్తుండడమేనని నాగిరెడ్డి వ్యాఖ్యానం. ఆ కక్ష మనసులో పెట్టుకొని తరువాత జరిగిన పంచాయితీ ఎన్నికలలో చెన్నారెడ్డి చిక్కేపల్లిలో ఎరికలరెడ్డి పైన శేషారెడ్డిని పోటీకి దించాడు. ఎరికలరెడ్డే గెలిచినప్పటికీ ఇద్దరికీ ఘర్షణ పెరిగింది. చిక్కేపల్లిలో చెన్నారెడ్డి వర్గానికి ప్రతినిధి అతని బంధువయిన నారాయణరెడ్డి.

**1988** లో చిక్కేపల్లి వాళ్లు ఒకసారి నిట్టూరు పైన దాడి చేసి కాల్పులు జరిపారు. అసలు శత్రువులకేం కాలేదుగానీ నీళ్లకోసం పోతున్న ఒక స్త్రీ చనిపోయింది. (ఆమె పేరు నాగలక్ష్మమ్మ అయి వుండవచ్చునని నాగిరెడ్డి అంటాడు. ముఠా కొట్లాటలలో చనిపోయే సామాన్య ప్రజలు ఎంత అనామకంగా చనిపోతారంటే ఆ కొట్లాటలకు కారణమైన నాయకులకు వాళ్ల పేర్లు సహితం సాధారణంగా జ్ఞాపకం ఉండవు). రెండు వర్గాలకూ ఘర్షణ పెరగడానికి కారణమైన మరొక దౌర్జన్యాన్ని నాగిరెడ్డి వాళ్లు చెప్తారు. చిక్కేపల్లికి చెందిన వీళ్ల వర్గీయుడయిన లక్ష్మీనారాయణ రెడ్డి చెల్లెలు ఇందిరను ఎరికలరెడ్డి తమ్ముడు నారపరెడ్డి మనుషులు (నారపరెడ్డి కొడుకేనని ఒక కథనం) 'మీ ఎనుము (బర్రె) మా తోటలో పడింది, వచ్చి తోలుకుపో'మ్మని పిలిచి రేప్ చేసారు. ఆ అమ్మాయి తరువాత ఆత్మహత్య చేసుకుంది.

మొత్తానికి ఎన్నికలతో మొదలయిన ఈ ఘర్షణ బాగా ముదిరింది. చెన్నారెడ్డి వర్గం తరఫున కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలోని ప్రముఖ ఫాక్షన్ గ్రామమయిన గుండ్ల సింగవరం నుండి మనుషులు వచ్చేవారనీ, వాళ్లు బాంబులు వడిసెలతో విసిరేవారనీ, దానికి తాము తట్టుకోలేక పోయామనీ ఎరికలరెడ్డి అంటాడు. అయితే ఎరికలరెడ్డి వర్గం అదే కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన భూమా నాగిరెడ్డి మనుషులను తెచ్చుకున్నారని పేరం నాగిరెడ్డి మనుషులంటారు. మొత్తానికి ఇరువర్గాలూ కోవెలకుంట్ల - ఆళ్లగడ్డ ముఠాల సహాయం తెచ్చుకున్నారని స్పష్టం అవుతుంది.

పెరిగిన స్పర్థల నేపథ్యంలో నారాయణ రెడ్డిని (చిక్కేపల్లిలో చెన్నారెడ్డి మనిషి) ఎరికల రెడ్డి వర్గం (**1994** లో కాబోలు) చంపారు. కేవలం అతను చెన్నా రెడ్డి మనిషిగా వ్యవహరిస్తున్నాడని అతన్ని ఎరికలరెడ్డి చంపించాడని నిట్టూరు వాళ్ళు అంటుండగా, నారాయణ రెడ్డి మనుషులు తమ వర్గానికి చెందిన చిట్టెంరెడ్డి లక్ష్మిరెడ్డిని చంపినందుకే తాము నారాయణరెడ్డిని చంపామని ఎరికలరెడ్డి అంటాడు. అయితే లక్ష్మిరెడ్డిని నారాయణరెడ్డి వర్గం కొట్టి విడిచిపెడితే అతని స్వంత వర్గం వారే

అతనికి విషం కలిపిన పాలు తాగించి చంపించి వీరిపైన కేసు పెట్టారనీ కేసు కొట్టేసిన మరునాడే వాళ్లు నారాయణరెడ్డిని చంపారనీ వీళ్లంటారు.

**1995** లో చెన్నారెడ్డి వర్గం చిక్కేపల్లిలో మందుపాతర పెట్టి ఎరికలరెడ్డి వర్గానికి చెందిన వారు ప్రయాణిస్తున్న జీపును పేల్చేసి ఎనిమిది మందిని చంపారు. మందుపాతర పెట్టిన వ్యక్తి ఇంచిర అన్న లక్ష్మినారాయణరెడ్డి. అతను కూడ ఆ పేలుడులో చనిపోయాడు. చిక్కేపల్లిలోని ఎరికలరెడ్డి వర్గం అప్పటికే - వెన్నపూసపల్లి నారాయణ రెడ్డి వర్గం లాగ - తాడిపత్రి తాలూకాలోని ఇతర గ్రామాలకూ తాలూకా కేంద్రానికీ కూడ పోయి దివాకర రెడ్డి తరపున గలాటాలలో పాల్గొనే వారు. తాలూకాలో దివాకరరెడ్డి 'టెర్రర్' నెలకొల్పడంలో వారి పాత్ర చాలా ఉంది.

## నమ్మలేని నిజాలు

*చిక్కేపల్లిలో చిట్టెంరెడ్డి లక్ష్మిరెడ్డిని అతని ప్రత్యర్థులు కొట్టి విడిచి పెట్టగా అతని స్వంతవర్గం వారే అతనిని చంపి ప్రత్యర్థులపైన కేసు పెట్టారన్న అభియోగం చూసాము. ముఠా కక్షలలో మనుషుల క్రూరత్వం ఎక్కడికయినా దిగజారగలదు. తమ స్వంత వర్గీయులను - స్వంత బంధువులను కూడ - తామే చంపి ఎదుటివారిపైన కేసులు పెట్టిన ఉదంతాలు ఇంకా కూడ ఉన్నాయి. **1996** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో దివాకరరెడ్డి మనుషులు సూర్యప్రతాప రెడ్డి తమ్ముడు పెద్దారెడ్డిని చంపడానికి ప్రయత్నం చేస్తున్నారని ఈ వర్గానికి అనుమానం వచ్చింది. అందుకోసం తిమ్మంపల్లిలో వారికి వ్యతిరేకులయిన (నలజినిగారి పెద్ద, నడిపి, చిన్న) ఫకీర్‌రెడ్ల కుటుంబాన్ని వాడుకుంటున్నారనీ కూడ అనుమానం వచ్చింది. అది నిజమో కాదో తెలుసుకోవడం కోసం ఒక అర్ధరాత్రి తనతోట దగ్గర పండుకొని ఉన్న పెద్ద ఫకీరారెడ్డి కొడుకు గోపాలరెడ్డిని సూర్యప్రతాపరెడ్డి వర్గం వారు కిడ్నాప్ చేసి ప్రశ్నించారు. ప్రశ్నించినాక, అనుమానం నివృత్తి అయి వదిలిపెట్టారు. గోపాలరెడ్డి తిరిగి తన వాళ్ల దగ్గరకు పోయినాక వాళ్లే అతనిని చంపి సూర్యప్రతాపరెడ్డి పైన కేసు పెట్టారు.*

*ఇది కేవలం 'సూరి' మనుషుల అభియోగం కాదు. చాలామంది నమ్ముతున్న విషయం.*

మందుపాతరకు నిట్టూరు - చిక్కేపల్లిల ఘర్షణ కంటే ఇదే ముఖ్య కారణం కావచ్చు. అందుకే పరిటాల రవి ఎంత కాదన్నీ అప్పటికే కాంగ్రెస్ ఫాక్షనిస్టులను అణిచే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టిన రవి హస్తం ఈ మందుపాతర ఘటనలో ఉందన్న అనుమానం పోదు.

### శరణార్థులు

దివాకరరెడ్డి, సూర్యప్రతాప రెడ్లు పోటాపోటీగా గ్రామాలలో కక్షలు రెచ్చగొట్టిన క్రమంలో

భోగతి నారాయణరెడ్డి కంట్రోల్‌లో వున్న వెన్నపూసపల్లి దివాకర రెడ్డి వర్గానికొక 'రెఫ్యూజి క్యాంప్' అయింది. తమ గ్రామాలలో 'సూరి' వర్గం దాడికి తట్టుకోలేక ఊరు విడిచినవారు వెన్నపూసపల్లిలో ఆశ్రయం పొందుతున్నారు. తిమ్మంపల్లికి చెందిన ఫకీర్‌రెడ్డి అన్నదమ్ముల వర్గం వారిప్పుడు వెన్నపూసపల్లిలో ఉంటున్నారు. యెల్లనూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన బయ్యపు రెడ్డి వర్గానికి సంబంధించిన వారు కూడ అదేపని చేస్తున్నారు. వాళ్లకు ఆ ఊరిలో రామకృష్ణారెడ్డి అనే ప్రత్యర్థితో ముఠా కొట్లాట ఉండింది. బయ్యపు రెడ్డి దివాకరరెడ్డి అండ తీసుకునే ఉద్దేశ్యంతో జె.సి. ప్రభాకరరెడ్డిని ఒక రోజు డిన్నర్‌కు ఆహ్వానించాడు. (ఫాక్షన్ కొట్లాటలలో ఈ 'డిన్నర్ల' కు ఉండే ప్రాముఖ్యాన్ని గురించి పైన వివరించాము. అది తెలిసిన రామకృష్ణారెడ్డి వర్గం ముందురోజే బయ్యపురెడ్డి పైన దాడిచేసి అతని చేయి తెగగొట్టి ఇల్లు కాల్చారు. వీళ్ళు రామకృష్ణా రెడ్డి చీనీతోటపైన దాడి చేసి 800 చెట్లు నరికారు. కానీ ఊరిలో ఉండలేక వెన్నపూసపల్లికి వచ్చి జె.సి. వారి రెఫ్యూజీ క్యాంపులో ఉంటున్నారు.

పుట్లూరు మండలంలో బాగా ఘర్షణ జరిగిన మరొక గ్రామం బాలవేముల. ఒక వైపున్నది దివాకరరెడ్డి మద్యం వ్యాపారంలో వాటాదారయిన యెన్నం సుబ్బారెడ్డి. ఇతను దాదాపు 30 సంవత్సరాలు గ్రామానికి ఎదురులేని సర్పంచ్‌గా ఉన్నాడు. అతని తండ్రి పెద్దరాంరెడ్డికి చింతలపుగారి బాలిరెడ్డితో ఫాక్షన్ ఉండింది. వీళ్ళు బావ బామరదులే. బాలిరెడ్డి వాళ్లు 1968లో పెద్దరాంరెడ్డిని చంపగా సుబ్బారెడ్డిని ఊరి నుండి తరిమేసి అప్పటినుండి గ్రామాన్ని ఎదురులేకుండా ఏలుతున్నారు. దేవుని మాన్యం 70 ఎకరాలు ఆక్రమించుకున్నారనీ, ఇతరుల భూమి 30 ఎకరాలు బెదిరించి సగం రేటుకు కొన్నారనీ, కూలివాళ్లకు అందరూ 25 రూపాయలు ఇస్తే తాము మాత్రం బెదిరించి 15రూపాయలకే పని చేయించుకుంటారనీ, కనీసం ఇద్దరు స్త్రీలను అపహరించి తీసుకుపోయి రేప్ చేసారనీ వీళ్ళ పైన తీవ్రమైన అభియోగం వుంది. దివాకరరెడ్డి వర్గానికి కంచుకోటగా వున్న ఆ ఊరిలో 'సూర్యుడికి' పట్టు దొరకాలంటే సుబ్బారెడ్డిని ఎదిరించే వాళ్లు కావాలి. సుబ్బారెడ్డిని ఎదిరించాలంటే 'సూర్యుడి' అండ కావాలి. గత పంచాయితీ ఎన్నికలలో ఓబుల రెడ్డి సుబ్బారెడ్డి పైన పోటీ చేసి గెలిచి సూర్యప్రతాపరెడ్డి తమ్ముడు పెద్దరెడ్డికి 'డిన్నర్' ఏర్పాటు చేసి సపోర్టు కోరాడు. ఆ తరువాత ఒకరి నొకరు సవాలు చేసుకోవడం, ఘర్షణ పడడం మొదలయింది. వీళ్ల సేద్యం వాళ్లు, వాళ్ల సేద్యం వీళ్లు అడ్డుకునే ప్రయత్నం చేసారు. ఓడిపోయిన సుబ్బారెడ్డి వర్గం చేతిలో ఓబుల రెడ్డి వర్గానికి చెందిన సింగిల్ విండో అధ్యక్షుడు శివనారాయణ రెడ్డి చనిపోయాడు. సుబ్బారెడ్డి మనిషి అప్పిరెడ్డివి 800 చీనీ చెట్లు ఓబుల రెడ్డి వర్గం వాళ్లు నరికారు. మూడు ఇళ్లు కాల్చారు. వాళ్లు కూడ వీళ్లవి నాలుగు ఇళ్లు కాల్చారు. చీటికీ మాటికీ ఇరువర్గాలూ బాంబులు వేసుకుంటున్నారు. చాలామంది దెబ్బలు తిన్నారు. జైలుకు పోయారు. ఊరు విడిచిపోయారు.

యెల్లనూరు మండల కేంద్రానికి చెందిన బాలయ్య అనే బోయకులస్తుడి వర్గం వారు కూడ

వెన్నపూసపల్లికి వలసపోయారు. అతనికి గ్రామంలో ప్రత్యర్థి యెల్లనూరు జడ్‌పిటిసి ప్రతినిధి శివయ్య. అతనూ బోయకులస్తుడే. వీళ్లిద్దరి నాయనమ్మలు అక్కచెల్లెళ్ళు. బయటివాళ్లు రెచ్చగొట్టకపోతే - వీళ్ళు తమ కొట్లాటలలో బయటివాళ్లను ఆశ్రయించకపోతే - ఈ యిద్దరి ఘర్షణ పెద్దరూపం తీసుకునేది కాదు. కానీ ఆ స్పృహ లేక కొంత, ఆ పరిస్థితి లేక కొంత, పెద్దవి కావలసిన అవసరం లేని ఘర్షణలు రాయలసీమలో పెద్దవి అవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం బాలయ్య ఊరు వదిలిపెట్టి వెన్నపూసపల్లిలో జె.సి.దివాకరరెడ్డి వర్గం రక్షణలో ఉంటున్నాడు. శివయ్య (మేము కలిసే నాటికి ) తాడిపత్రి సబ్ జైలులో పోలీసుల రక్షణలో ఉన్నాడు.

దివాకర రెడ్డికి తాలూకాలో ఎవరూ ఎదురులేని రోజులలో సహితం శివయ్య అతనికి పూర్తిగా అనుయాయుడిగా ఉండలేదు. **1983** నుండి తెలుగుదేశం పార్టీలో ఉన్నాడు. దివాకర రెడ్డి ఎన్నికలప్పుడు రిగ్గింగ్‌కు యెల్లనూరుకు వస్తే శివయ్య తన మనుషులతో అడ్డం పడ్డాడు. కానీ ఆ తరువాత గ్రామ ఘర్షణలో శివయ్య వర్గం ఒక హత్య చేసాక అతను దివాకరరెడ్డి దగ్గరకే సహాయం కోసం పోయాడు. 'వోట్ల కోసం వస్తే రానీయలేదు గాని ఇప్పుడు జ్ఞాపకం వచ్చినానా ' అని దివాకరరెడ్డి నిష్ఠూరం ఆడాడు. భవిష్యత్తులో విశ్వాసంగా ఉంటాడన్న భరోసా కోసం శివయ్య దగ్గర బాండు రాయించుకున్నాడు. (గుంపు పట్ల విధేయతకు భరోసా కావాలన్నా, పంచాయితీలో ఇచ్చిన తీర్పుకు గానీ నాయకుడు చేసిన రాజీకి గానీ కట్టుబడి ఉంటారన్న భరోసా కావాలన్నా స్టాంప్ పేపర్ మీద సంతకం చేయించి తమ దగ్గర పెట్టుకోవడం ఫాక్షనిస్టులకు అలవాటు. ఇది మనుషులను అదుపులో పెట్టుకోవడానికి బ్రహ్మాండమైన సాధనం). అయినప్పటికీ శివయ్యకూ దివాకరరెడ్డికీ సత్సంబంధాలు కొనసాగలేదు.

సూర్యప్రతాపరెడ్డి దివాకరరెడ్డికి దూరం అయిన తరువాత శివయ్య 'సూరి' కి దగ్గరయ్యాడు, బాలయ్య 'దివాకర' వర్గం అయ్యాడు. **1994** తరువాత పరిటాల రవి దెబ్బకు దివాకరరెడ్డి తాడిపత్రి తాలూకాలో అన్ని పదవులూ తెలుగుదేశానికి అప్పగించి పక్కకు తప్పుకున్న నేపథ్యంలో శివయ్య తన కుటుంబానికే యెల్లనూరులో అన్నిస్థానిక సంస్థల పదవులూ తీసుకున్నాడు. అతను యెల్లనూరు జడ్‌పిటిసి ప్రతినిధి, అతని భార్య గ్రామ సర్పంచ్, అతని అన్న ఎంపిటిసి ప్రతినిధి, అతని చిన్నాయన నీటివాడ కందార్ల సంఘం అధ్యక్షుడు. (పెద్దపాలెగాడి కింద చిన్నపాలెగాడు,వాడికింద ఇంకా చిన్నపాలెగాడు, వాడికింద.... ఇదీ ఫాక్షన్‌ల నిర్మాణం. అది కేవలం పెద్ద ఫాక్షనిస్టుల దౌర్జన్యాల సమస్యకాదు. అందుకే ఫాక్షనిజాన్ని ఎదుర్కోవడం అంతకష్టం).

ఇంతటి ఏకచ్ఛత్రాధిపతి తనవాడు కాకపోతే అతనిని దింపేవాడిని దివాకరరెడ్డి ప్రోత్సహించాలి కదా! అందుకని ఇప్పుడు (రవి భయం కొంత తగ్గిన తరువాత) దివాకరరెడ్డి బాలయ్యను శివయ్యకు వ్యతిరేకంగా ప్రోత్సహించడమేకాక, వెన్నపూసపల్లిలోని నారాయణరెడ్డి వర్గం మనుషులు నేరుగా శివయ్యతో ఘర్షణకు దిగారు. యెల్లనూరులో అల్లరి చేసిన వెన్నపూసపల్లి మనిషిని శివయ్య కొట్టించాడని చెప్పి అతని చీనీ చెట్లు నరికిపోయారు. శివయ్యకు సూర్యప్రతాపరెడ్డితో సంబంధాలు

అప్పటికే ఏర్పడ్డాయి. యెల్లనూరులో ఉన్న శివయ్య వైన్ షాపు సూర్యప్రతాపరెడ్డి పార్ట్నర్‌గా ఉండి నెలకొల్పిందేనని అంటారుగానీ అది తన స్వంతమేనని శివయ్య అంటాడు. ఈవైన్‌షాపు వ్యాపారానికి నష్టం చేయటానికి దివాకరరెడ్డి స్మగ్లింగ్ చేసి తెచ్చిన మద్యాన్ని అమ్మించే ప్రయత్నం చేసాడు. (ఈ వ్యవహారంలో దివాకరరెడ్డికి చాలా దక్షత ఉందని ఇప్పటికే చూసాము. రాజకీయంగా ఆర్థికంగా పైకి రావడానికి మద్యం వ్యాపారం ఎంత ముఖ్య సాధనమో, ప్రత్యర్థిని రాజకీయంగా ఆర్థికంగా దెబ్బతీయడానికి దొంగ మద్యం అమ్మడం ద్వారా అతని మద్యం వ్యాపారాన్ని దెబ్బతీయడం అంతే ముఖ్యమైన ఎత్తుగడ. ఒక్క దివాకరరెడ్డే కాదు, రాయలసీమ ఫాక్షనిస్టులందరూ ఇందులో ఆరితేరినవారే). 'కావాలంటే డబ్బు ఇస్తాను–ఈ పని చేయొద్దు' అని శివయ్య అభ్యర్థించినా దివాకరరెడ్డి మనుషులు వినలేదు. అతను ఎక్సైజ్ వారికి ఫిర్యాదు చేసి కేసు పెట్టించాడు. దానికి ప్రతీకారంగా దివాకరరెడ్డి మనుషులు శివయ్య వైన్‌షాపుపైన దాడి చేసి అతని గుమస్తా కాళ్లు విరగ్గొట్టి శివయ్య ఇంటి దగ్గర పడేసిపోయారు.

ఈసంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన భోగతి నారాయణరెడ్డి వెన్నపూసపల్లి నుండి తాడిపత్రికి కేసు వాయిదాకు పోయి సాయంత్రం చీకటిపడిన తరువాత తిరిగి వస్తుండగా యెల్లనూరు దగ్గర శివయ్య వర్గం అతని పైన దాడి చేసే ఉద్దేశంతో రోడ్డుకు మొద్దులు అడ్డంపెట్టి కాచుకొని ఉన్నారు. వాళ్లు గమనించి వెనక్కిపోయి అర్ధరాత్రి దాటిన తరువాత ఇంకా పెద్దసంఖ్యలో తిరిగి యెల్లనూరు వచ్చారు. ఇరువర్గాలూ బాంబులతో తుపాకులతో తీవ్రంగా ఘర్షణపడ్డారు. ఇటు ఒకరు అటు ఒకరు చనిపోయారు.

బాలయ్యతో వైరుధ్యం ఈవిధంగా వెన్నపూసపల్లి నారాయణరెడ్డి వర్గంతో వైరుధ్యంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు శివయ్య పరిటాల రవి దగ్గరకే పోదామని ఆలోచిస్తున్నానంటాడు. ఎందుకని అడిగితే, 'రవి దగ్గరకు పోతే పది హత్యలు చేసినా కాపాడతాడు కాబట్టి' అని నిస్సంకోచంగా అంటాడు. పది హత్యలు చేసినా కాపాడే నాయకుడు గ్రామీణ ఫాక్షనిస్టులకు కావాలి. తమ ఊరి పెత్తనం కోసం పది హత్యలయినా చేయడానికి సిద్ధంగా ఉన్న గ్రామీణ ఫాక్షనిస్టులు నాయకులకు కావాలి. అప్పుడే ఊరిలో వీరి పెత్తనం, జిల్లాలో వారి పెత్తనం బలంగా, అప్రతిహతంగా నిలబడతాయి. వారి మాటలంటేనే భయం, టెర్రర్ తగిన మోతాదులో ఉంటాయి. ఈ తర్కం సమాజాన్ని ఏం చేస్తుంది, తెలిసో తెలియకో అందులో భాగమయ్యే ప్రజలను ఏం చేస్తుంది, అందులో భాగం కాకున్నా కేవలం ఆప్రాంతంలో బతుకుతున్న పాపానికి ఇతర ప్రజల జీవితాలనేం చేస్తుంది అనేది మా ప్రశ్న.

తాడిపత్రికి ఈతర్కాన్ని అలవాటు చేసింది దివాకరరెడ్డే. 1989 నాటికే అతనికి తాలూకాలో ఎదురులేని పరిస్థితి ఏర్పడింది. ఆ సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పేరం నాగిరెడ్డి అతనిపైన తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. దివాకరరెడ్డి మనుష్యులు బాంబులు వేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. నాగిరెడ్డి కూడ పొరుగున ఉన్న కర్నూలు జిల్లా కోవెలకుంట్ల నుండి గుంపును

తీసుకొచ్చాడుగానీ తట్టుకోలేకపోయాడు. ఆ తరువాత ఆ ఎన్నికలో తెలుగుదేశం తరఫున ఏజంట్లుగా కూర్చున్నవాళ్లను ఒక్కొక్కరినీ దివాకరరెడ్డి కొట్టించాడు. గ్రామగ్రామంలో (ముఖ్యంగా అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికలలో తెలుగుదేశం గెలిచిన గ్రామాలలో) తెలుగుదేశం అనుయాయులను వేధింపులకు గురిచేసాడు. కొందరి ఇళ్ళూ పొలాలూ ధ్వంసం చేసాడు, కొందరిని కేసులలో ఇరికించాడు. రాష్ట్రంలో 1989 కి పూర్వం తెలుగుదేశం ప్రభుత్వం ఉండింది, 89 తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. కానీ తాడిపత్రిలో మాత్రం అప్పుడూ ఇప్పుడూ (సారాయి ఆదాయం పుణ్యాన) దివాకరరెడ్డి ప్రభుత్వమే నడిచింది. ముఖ్యంగా దివాకరరెడ్డి మంత్రి అయిన తరువాత తాడిపత్రిలో అధికార యంత్రాంగం, ప్రత్యేకించి పోలీసులు, దివాకరరెడ్డి ఏజంట్లుగా వ్యవహరించడం మొదలయింది. అతని మనుషులు చెప్పిందే అధికార్లకు వేదం. వాళ్లు ఏంచేసినా కేసుకాదు. వాళ్లదాడి నుండి ఎవరినీ పోలీసులు కాపాడరు.

1989 ఎన్నికలు తరువాత తెలుగుదేశంవాళ్లు దుబ్బప్రసాదు అనే దివాకరరెడ్డి అనుచరుడిపైన బాంబుదాడి చేయగా అందుకు ప్రతీకారంగా దివాకరరెడ్డి వర్గం తాడిపత్రిలో చాలా బీభత్సం సృష్టించింది. పేరం నాగిరెడ్డి మామగారి పాలిషింగ్ ఫ్యాక్టరీపైన దాడిచేసి ధ్వంసం చేసారు. నాగిరెడ్డి ఫ్యాక్టరీనీ అతని బావమరిది ఫ్యాక్టరీనీ సద్దలదిన్నెలోని అతని అనుచరుడి ఫ్యాక్టరీనీ తగలబెట్టారు. రెండు ఇళ్లు కూడ తగలబెట్టారు. దాదాపు మూడు నెలలు తెలుగుదేశంవాళ్లు ఇళ్ల నుండి బయటికొచ్చే పరిస్థితి లేదు. ఆ తరువాత చాలాకాలం తెలుగుదేశం వాళ్లకు నియోజక వర్గంలో ఎక్కడా బహిరంగ సభలుగానీ వేరే ఏ కార్యక్రమాలు గానీ సిర్వహించే స్వేచ్ఛ లేదు. తెలుగుదేశమేకాదు, ఏ కాంగ్రెసేతర పార్టీకీ లేదు. పోలీసులు పూర్తిగా దివాకరరెడ్డి ఏజెంట్లుగా మారి ఇతర పార్టీలు ఎక్కడ ఏ కార్యక్రమం తలపెట్టినా అక్కడ సెక్షన్ 144 ప్రకటింపజేసి వారికి అడ్డంపడ సాగారు. తెలుగుదేశం వాళ్లు పామిడిలో ఒక హాలులో సభ జరపబోతే పోలీసులు హాలుకు తాళం వేసారు. పోలీసుల సహకారంతో దివాకరరెడ్డి తాడిపత్రి తాలూకాను తన స్వంత జాగీరుగా మార్చుకున్నాడు. (పోలీసు అధికార్లలో ఎవరైనా చొరవ చేసి అతని మీద చర్య తీసుకుంటే కోట్ల విజయభాస్కరరెడ్డి అడ్డుపడేవాడు. ఒకసారి దివాకరరెడ్డిని పోలీసులు అరెస్టుచేసారు. ఒక గంటలోపలే ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి నుండి నేరుగా ఆదేశాలు వచ్చాయి. అతనిని పోలీసులు వదిలిపెట్టవలసి వచ్చింది. అతని గుంపు అతనిని పోలీస్ స్టేషన్ నుంచి జయజయధ్వానాలతో ఊరేగింపుగా తీసుకుపోయారు).

దివాకరరెడ్డి తరఫున రౌడీయిజం చేయించింది అతని తమ్ముడు జె.సి ప్రభాకరరెడ్డి అని పైన చెప్పాము. ప్రభాకరరెడ్డి పేరు వింటేనే అప్పట్లో తాడిపత్రి ప్రజలు గడగడలాడేది. ఒకసారి తాడిపత్రి తాలూకాఫీసు దగ్గర తెలుగుదేశం వాళ్లు ధర్నా చేస్తుంటే ప్రభాకరరెడ్డి రౌడీలను జీపులో తీసుకొచ్చి బూతులు తిడుతూ వీళ్లను కొట్టండి, నరకండి అంటూ చిందులు వేసాడు.

1991 లో రాజీవ్ గాంధీ హత్య తరువాత రాష్ట్రంలో అన్నిచోట్ల కంటే ఎక్కువ పరిమాణంలో

కాంగ్రెస్ వాళ్లు తాడిపత్రిలో బీభత్సానికి పాల్పడ్డారు. బిజెపి నాయకుడు పుల్లారెడ్డి కట్టెల డిపోను కాల్చారు. సద్దలదిన్నెలో తెలుగుదేశం నాయకుడు రాజారెడ్డి పాలిషింగ్ ఫ్యాక్టరీ ధ్వంసం చేసారు. పల్లా సూర్యనారాయణస్వామి ఇల్లు ఖాళీచేయించి బాంబులు దాచుకునే స్టోరుగా వాడుకున్నారు.

1994 ఎన్నికలు వచ్చేసరికి దివాకరరెడ్డిని దించే ప్రయత్నం ముమ్మరం అయింది. అప్పటికే వై ఎస్ ప్రోత్సాహంతో సూర్యప్రతాపరెడ్డి దివాకరరెడ్డితో గట్టిగా తలపడుతున్నాడుగానీ అతను తెలుగుదేశంలో చేరేదీ లేనిదీ నిర్ణయించుకోకపోవడం వల్ల తెలుగుదేశం టిక్కెటు పేరం నాగిరెడ్డికే దక్కింది. పులివెందుల నుండి వై ఎస్ రాజారెడ్డి స్వయంగా నాగిరెడ్డికోసం ప్రచారం చేయటానికి తాడిపత్రికి వచ్చాడు. అయినప్పటికీ దివాకరరెడ్డే గెలిచాడుగానీ జిల్లా ముఠారాజకీయాల భవితవ్యాన్ని అదే ఎన్నికలో పెనుకొండ నుండి పోటీ చేసి గెలిచిన పరిటాల రవి విజయం నిర్ణయించింది. రవి భయానికి దివాకరరెడ్డి ఆ తరువాత జరిగిన మునిసిపాలిటీ, పంచాయితీ ఎన్నికలలో తాడిపత్రిని రవి అభీష్టానికి వదిలేసి పక్కకు తప్పుకున్నాడు.

## ఉరవకొండ

జిల్లా ఉత్తర భాగంలో ఫాక్షన్‌ల దుష్ప్రభావం ఎక్కువ ఉన్నది తాడిపత్రిలో కాగా, ఉరవకొండ నియోజకవర్గంలోనూ కొంత ఉంది. ప్రస్తుత ఉరవకొండ ఎంఎల్ఏ పయ్యావుల కేశవ్ కుటుంబానికి ఉరవకొండ ముఠా ఘర్షణలలో కేంద్రస్థానం ఉంది. వివిధ కమ్యూనిస్టు పార్టీల ప్రమేయమూ ఉంది.

కేశవ్ తాత కేశన్న కౌకుంట్ల గ్రామ భూస్వామి. కమ్మకులస్తుడు. 6000 ఎకరాల భూమి ఉండేదంటారు. అతని కొడుకు (కేశవ్ నాయన) వెంకట నారాయణప్ప అంటే చాలా భయం ఉండేది. అతని మాటకు ఎదురుపోతే క్రూరంగా అణచివేసేవాడు. కేశన్న స్వాతంత్ర్యానికి పూర్వం జిల్లాబోర్డు మెంబరుకాగా, వెంకటనారాయణప్ప స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒకసారి రాయదుర్గం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. వెంకటనారాయణప్ప రాకెట్లకు చెందిన 300 ఎకరాల భూస్వామి ఏకైక సంతానమైన ఓబులమ్మను ఎత్తుకుపోయి పెండ్లి చేసుకున్నాడు. ఆమె తండ్రికి ఆ పెళ్లి ఇష్టం లేదుగానీ ఆమె తల్లి సహకరించిందంటారు. ఈవిధంగా వెంకటనారాయణప్ప తన 'పౌరుషాన్ని' (ముఠారాజకీయ సంస్కృతిలో ఇది చాలా ముఖ్యమైన గుణం) రుజువు చేసుకోవడమే కాక తన ఆస్తి కొంత పెంచుకున్నాడు.

కౌకుంట్లలో ఈ కుటుంబం పెత్తనానికి పోటీగా ఎదగగల వారినందరినీ వీళ్లు అణచివేసారు. కాకర్ల నారాయణప్ప వారిలో ఒకడు. అతనిది 800 చీనీ చెట్లు నరికేసారు. అతను కమ్మకులస్తుడే. అయితే అతని తండ్రి అక్కులప్ప కాలంనుండి ఆ కుటుంబమంటే పయ్యావుల వాళ్లకు వ్యతిరేకత. వేరే ఎవ్వరూ పైకి రాకూడదన్న పెత్తందారీతనం తప్ప దీనికి వేరే ఏ కారణం లేదని ఆ కుటుంబానికి చెందిన వారంటారు.

కేశన్న భూములు కౌకుంట్లలోనూ మైలారంపల్లిలోనూ ఉండేవి. కమ్యూనిస్టుపార్టీ ఆగ్రామాలలో భూమిపోరాటం చేపట్టింది. కౌకుంట్ల సమీపంలోని రాకెట్ల గ్రామం సిపిఐకి గట్టిపునాది ఉన్న గ్రామం. కౌకుంట్లలోనూ మైలారంపల్లిలోనూ కూడ సిపిఐకి పట్టు ఉండింది. సిపిఐ నాయకుడు నారాయణరెడ్డి రాకెట్లకు చెందినవాడు. అతను రెడ్డి కులస్తుడు కావడం వల్ల కమ్యూనిస్టుల భూమిపోరాటాన్ని వ్యతిరేకించడానికి వెంకట నారాయణప్ప ఆ ఊరిలో కమ్మ-రెడ్డి ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేసాడు. అంతేకాక పేదప్రజలను చీల్చి తనకొక వర్గం తయారు చేసుకొని గుంపుగా దాడులు చేయించేవాడు. అతను ప్రధానంగా రామాపురం బోయలను ఈవిధంగా ప్రయోగించాడు. వాళ్లు కౌకుంట్లలోని సిపిఐ అనుయాయుల పైన దాడులు చేసినప్పుడు రాకెట్ల, మైలారంపల్లి గ్రామాల నుండి పెద్దసంఖ్యలో సిపిఐ అనుచరులు తరలిపోయి తమ కౌకుంట్ల సహచరులకు అండగా నిలబడేవారు. ఇరువర్గాలూ కట్టెలూ కత్తులూ కొడవళ్లూ ఈటెలూ పట్టుకొని పెద్దసంఖ్యలో మోహరించేవారు.

రామాపురం కౌకుంట్ల పంచాయితీలోని ఒక గ్రామం. (మైలారంపల్లి, రాచేపల్లిలకు కలుపుకొని కౌకుంట్ల పంచాయితీలో నాలుగు గ్రామాలుండేవి. ఈ పంచాయతీని వేరుచేస్తే తమ కంట్రోల్ పోతుందని పయ్యావుల వాళ్లు ఆప్రయత్నానికి బలంగా అడ్డం పడ్డారు). రామాపురం బోయలు మొదటినుండి వెంకట నారాయణప్ప అనుచరులు. అతనికి గుంపుకావలసి వచ్చినప్పుడు వారు ఉపయోగపడేవారు. అయితే వెంకటనారాయణప్ప పెత్తనానికి ప్రమాదం ఏర్పడినప్పుడు, అతను వారిలో అంతర్గత వైరుధ్యాలను పెంచి ఒక వర్గాన్ని చేరదీసి మరింత గట్టిగుంపుగా మలచుకున్నాడు. రామాపురంలో ఎగువగేరి దిగువగేరి (పై వీథి-కింది వీథి) అన్న తేడా ఉండింది. ఇరువర్గాలూ వెంకటనారాయణప్ప అనుచరులే. వారు కొట్లాడుకున్నా హత్యలు చేసుకున్నా ఇరువర్గాలూ వెంకటనారాయణప్ప దగ్గరికే సహాయంకోసం పోయేవారు. పోలీస్ స్టేషన్ లోనూ కోర్టులోనూ అతనే సహాయం చేసేవాడు.

అయితే రామాపురంలో ఒక గుంపును మరింత విధేయులుగా మార్చుకోవడానికి వెంకటనారాయణప్పకు ఒక అవకాశం దొరికింది. ఆ ఊరిలో 'ఎర్రస్వామి తాత' గుడి ఉంది. దాని నిర్మాణానికి అయిన ఖర్చులో ఎక్కువ భాగం పయ్యావుల వాళ్లే ఇచ్చినట్టున్నారు. కారణమేమైతేనేం, ఆ గుడిలో సంవత్సరానికొకసారి జరిగే జాతరను ప్రారంభించడానికి పయ్యావుల వాళ్లను పిలిచే సంప్రదాయం ఉంది. కానీ ఒక సంవత్సరం ఎగువగేరికి చెందిన బోయ సంజప్ప అభ్యంతరం చెప్పాడు. మన జాతర మనమే ప్రారంభించుకుందామన్నాడు. 'ఇంటికి గడప ఉంది. ఊరికి పొలిమేర ఉంది. బయటివాళ్లతో మనకేంపని' అన్నాడంటారు. వెంకటనారాయణప్ప రాకముందే తేరు (రథం) గుంజారు.

కొంతసేపటికి కారులో రామాపురం వచ్చిన వెంకటనారాయణప్పకు ఈ దృశ్యం చూసి కోపం వచ్చింది. ఆ తరువాత అతను దిగువగేరికి చెందిన బోయ లింగప్పను చేరదీసాడు. అతనికి కొంత

భూమి ఇచ్చాడంటారు. బోయలింగప్ప చేతిలో బోయ సంజప్ప హత్య జరిగింది. అలవాటు ప్రకారం సంజప్ప మనుషులు వెంకటనారాయణప్ప దగ్గరికే పోయి తమకు జరిగిన అన్యాయాన్ని గురించి చెప్పుకున్నారు.' మీరూ చంపండి పొండి' అని అతను సలహా ఇచ్చాడంటారు. ఆ తరువాత హత్యలు కొనసాగి ఇప్పటికి ఆ ఊరి కొట్లాటలలో అయిదుగురు బోయలూ ఇద్దరు లింగాయతులూ హతమయ్యారు. వెంకటనారాయణప్ప ప్రయోజనాలు మాత్రం నెరవేరాయి. అతని పట్ల విధేయత, అతనితో అవసరం రామాపురంలో పెరిగాయి. ఆ పరిసర గ్రామాలలో వెంకటనారాయణప్పను వ్యతిరేకించిన వారి పైన దాడులు చేయడానికి రామాపురం గుంపు మరింత నిబద్ధతతో పోసాగారు.

ఈ దాడులు జరిగింది కేవలం కాకర్ల నారాయణప్పవలె వారికి వ్యక్తిగతంగా కంటగింపయిన వారిపైన కాదు. సిపిఐ ఆధ్వర్యంలో భూమిపోరాటాలు చేపట్టిన పేదప్రజలపైన కూడ జరిగాయి. దానికి జవాబుగా సిపిఐ వారు కూడ రెండు మూడుగ్రామాలనుండి జనాన్ని కూడగట్టి వీరికి వ్యతిరేకంగా మోహరించేవారు. ఇది ఫాక్షన్ కొట్లాట రూపం తీసుకుంది. అటువైపు ఉన్న నారాయణరెడ్డి కూడ ఒక మోస్తరు భూస్వామే కాబట్టి (అతను సీలింగులో 55 ఎకరాలు కోల్పోయాడు). ఇది నారాయణరెడ్డి మనుషులకు, వెంకటనారాయణప్ప మనుషులకు మధ్య ముఠాకొట్లాట రూపం సంతరించుకుంది.

పయ్యావుల వాళ్లకు జనాన్ని కూడగట్టడానికి అనేక మార్గాలుండేవి. ఆగ్రామాలలో అప్పు కోసమైనా వారి దగ్గరికే పోవాలి, భూమి కొనుక్కోవాలన్నా వారి దగ్గరికే పోవాలి. 'ఆ అయిదు గ్రామాలలో మాదగ్గర భూములు కొననివారు లేరు, సహాయం పొందని వారు లేరు' అని పయ్యావుల వాళ్లు అంటారు. చాలామందికి వాళ్లు భూములు అమ్మారు. కేశన్న బతికి ఉండగానే భూదాన్‌లో 450 ఎకరాలు ఇచ్చారు. వెంకటనారాయణప్ప సీలింగ్‌లో కోల్పోయిన 90 ఎకరాలు తన వర్గానికి చెందిన పేదలకే పంచేటట్టు చూసుకున్నాడు. ఇది బినామీ పంపకం అనీ వాస్తవానికి ఆ భూమిఫలాన్ని వెంకటనారాయణప్పే అనుభవిస్తున్నాడనీ సిపిఐ ఆరోపించింది. ఆందోళన చేసింది.

కల్లు ఇజారాకు సంబంధించిన ఘర్షణ కూడ కౌకుంట్ల భూస్వాములకూ సిపిఐకీ మధ్య ఒక ముఖ్యమైన ఘర్షణే. కౌకుంట్ల చుట్టుపక్కల గ్రామాల కల్లుకాంట్రాక్టు పయ్యావుల వాళ్ల చేతిలోనే ఉండేది. కల్లు గీసేవారి దగ్గర వాళ్లు కల్లు కొనుక్కొని హైదరాబాద్ నుండి వచ్చే వ్యాపారులకు అమ్మేవారు. ఒక్క రాకెట్లలో మాత్రం సిపిఐ ఆధ్వర్యంలో సొసైటీ ఏర్పడింది. ఆగ్రామంలో ఈదులు( ఈతచెట్లు) వేల సంఖ్యలో ఉన్నాయి. ఆగ్రామంలో కల్లు అమ్మకం సొసైటీ ద్వారానే జరగాలనీ ఎవరికీ కాంట్రాక్టు ఇవ్వడానికి వీలులేదనీ సిపిఐ పట్టుబట్టింది. రాకెట్లకు చెందిన దేవినేని నారాయణస్వామి (తెలుగుదేశం పార్టీ) అనంతపురం ఎంపిగా ఎన్నికయ్యాడు. సిపిఐవాళ్లు అతనిద్వారా ప్రభుత్వంపైన ఒత్తిడిపెట్టి రాకెట్ల ఈదులలోకి పయ్యావుల వాళ్లను ప్రవేశించకుండ నిరోధించగలిగారు. నారాయణస్వామి కూడ కమ్మకులస్తుడేగానీ అతని కుటుంబానికీ పయ్యావుల

వారికీ పడదు. వెంకటనారాయణప్ప పెళ్లి విషయంలో తేడాలున్నాయి. అంతేకాక ఎం.పిగా ఎన్నికకావడానికి నారాయణస్వామి సిపిఐ నాయకుడు నారాయణరెడ్డి సహాయం తీసుకున్నాడని కూడ పయ్యావుల వాళ్లకు కోపం. ఈ కల్లు వ్యాపారం చాలా లాభసాటి వ్యవహారం కాబట్టి రాకెట్ల సొసైటీ విషయం నారాయణరెడ్డికీ పయ్యావుల వాళ్లకూ ఘర్షణను బాగా పెంచింది.

సిపిఐ మొదలుపెట్టిన కౌకుంట్ల సీలింగ్ భూముల పోరాటం **1980**ల చివరి భాగం నుండి పీపుల్స్‌వార్ కొనసాగించింది. చివరికి ఎన్‌టిరామారావు తెలుగుమాగాణి సమారాధన పేరిట (కృష్ణాజిల్లా చల్లపల్లిలోనూ, శ్రీకాకుళం జిల్లా కంబరిగాంలోనూ చేసినట్టు) కౌకుంట్ల సీలింగ్ భూములు అప్పటికి అనుభవిస్తున్న భూస్వాముల మనుషుల నుండి స్వాధీనం చేసుకొని అర్హులయిన పేదలకు పంచాడు.

సీలింగ్ భూముల పోరాటం ఒక కొలిక్కివచ్చిందిగానీ ఫాక్షన్ మిగిలిపోయింది. ఫాక్షన్ రూపం తీసుకునే పోరాటాలలో ఇటు పీడితులూ అటు పీడకులూ అన్న స్పష్టమైన విభజన ఉండదు. పీడితులు చీలి రెండువైపులా ఉంటారు. పెత్తందారీ వర్గంలోని అవకాశవాదురు, లేక వ్యక్తిగత ప్రత్యర్థులు ఇటువైపు చేరగలరు. అందువల్ల పోరాటం సఫలం కావడం మరింత కష్టతరం కావడమేకాక పోరాట లక్ష్యాలకు విరుద్ధమైన ఫాక్షన్‌లు ఏర్పడతాయి.

భూమిపోరాటాన్ని కొనసాగించిన పీపుల్స్‌వార్ **1992** లో 'గణపతి వర్గం' 'కె ఎస్ వర్గం' గా చీలిన తరువాత* కౌకుంట్ల, రాకెట్లలో గణపతి వర్గానికి అంతకుముందు పయ్యావుల వర్గంతో ఉన్న ప్రజలతో కొంత సన్నిహిత సంబంధాలు, కె ఎస్ వర్గానికి అంతకుముందు నారాయణరెడ్డి వర్గం (లేక సిపిఐ) తో ఉన్న ప్రజలతో కొంత సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి.

**1994** మే **24**న సిపిఐ నాయకుడు నారాయణరెడ్డినీ అతని కొడుకు రవీంద్రరెడ్డినీ గణపతి వర్గం నక్సలైట్లకు సంబంధించిన మిలిటెంట్లు హత్య చేసారు. ఈ హత్య పయ్యావుల కేశవులు (వెంకటనారాయణప్ప కొడుకు) చేయించాడని సిపిఐ ఆరోపణ. గణపతి వర్గం మిలిటెంట్లతో తమ వర్గానికున్న సంబంధాలు వాడుకొని కేశవులు తమ కుటుంబం పాతప్రత్యర్థిని చంపించాడని వాళ్ల అభియోగం. అదేమీ లేదనీ నారాయణరెడ్డి, రవీంద్రరెడ్లను చంపినప్పుడు తాము శవాలను చూడడానికి పోయామనీ సంతాపసభలో పాల్గొన్నామనీ అప్పుడు సిపిఐ ఏ ఆరోపణావేయలేదనీ, కేవలం నక్సలైట్లు చేసిన హత్యకు ఫాక్షన్‌రంగు పులమడం కోసం ఆ తరువాత ఈ కథ పుట్టించారనీ కేశవులు తమ్ముడు శ్రీనివాసులు (ఆ కుటుంబం కల్లు, సారాయి వ్యాపారాల మేనేజర్) అంటాడు. అతని కథనం ప్రకారం నారాయణరెడ్డి హత్యకు కారణం ఆమిదాల అనే గ్రామంలో అతని చిన్నాయనపైన గణపతి వర్గం చేపట్టిన భూమిపోరాటం . ఆ పోరాటంలో భాగంగా జరిగిన ఘర్షణలో ఆ భూస్వామి మనుషులు చలపతి అనే కండక్టర్‌ను చంపారనీ అందుకు ప్రతీకారంగా

---

*ఆ పార్టీలను ఈవిధంగా ప్రస్తావించడం వారికి అభ్యంతరంగా తోచవచ్చుగానీ చీలిన తరువాత రెండు పార్టీలూ ఒకే పేరుతో కొనసాగుతుండటం వల్ల ప్రస్తావన సౌలభ్యం కోసం ఈవిధంగా పిలవక తప్పదు.

పీపుల్స్‌వార్ వాళ్లు ఆ భూస్వామికి అండగా నిలబడ్డారని భావించిన నారాయణరెడ్డిని చంపారనీ ఆ హత్యతో తమకేమీ సంబంధం లేదనీ అతనంటాడు. అయితే 'కౌకుంట్ల, పరిసర గ్రామాలలో గణపతి వర్గంతో ఉన్న ప్రజలంతా మావాళ్లే'నంటాడు.

ఆ హత్య తమ పార్టీ చేసింది కాదనీ, హత్య చేసిన మిలిటెంట్లను అంతకు ముందే బహిష్కరించామనీ గణపతి వర్గం ప్రకటించింది. తమ పార్టీకి పయ్యావుల వర్గంతో ఏమీ సంబంధం లేదని అంటూనే, ప్రజలలో అంతకు ముందునుండి ఉన్న ముఠాల కారణంగా 'పయ్యావుల కేశవ్-నారాయణరెడ్ల ఫాక్షన్ గణపతివర్గం- కెవిస్ వర్గం ఫాక్షన్‌గా మారిందనేది కొంతవరకు వాస్తవమే' నంటారు. అటువైపు పీపుల్స్‌వార్ కెవిస్ వర్గం నారాయణరెడ్డి వర్గానికి (అతను బతికి ఉండగానే) దగ్గర యిందనీ, నారాయణరెడ్డిని గణపతి వర్గం నక్సలైట్లు (లేక వాళ్ల మిలిటెంట్లో మాజీ మిలిటెంట్లో) చంపడానికి అది కూడ ఒక కారణం కావచ్చుననీ ఒక అభిప్రాయం ఉంది. కెవిస్ వర్గం నాయకులు దీనిని అంగీకరించరుగానీ, 'ఫాక్షన్ గ్రామాలలో పార్టీసంఘం పెడితే మొదట వచ్చి చేరేది ఫాక్షన్లలో ఆరితేరిన వాళ్లే' (భూస్వాములు కాదు, మామూలు జనం) అనీ, ఫాక్షన్ ప్రయోజనాలకోసమే చేరేవారూ ఉంటారనీ అంటారు.

కమ్యూనిస్టు పార్టీల లక్ష్యాలకు ఈ ఫాక్షన్ వాతావరణంలో రాగల సమస్యలు అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఈ విషయాలు చెప్తున్నాం. నిజంగా నారాయణరెడ్డిని ఎందుకు చంపారు, ఎవరు చంపించారు, ఎవరు చంపించారు అనేది తేల్చిచెప్పడం కష్టం.

## పెంచలపాడు

పయ్యావుల వాళ్ల ప్రత్యక్ష ప్రభావం ఉన్న కౌకుంట్ల పంచాయతీలోని నాలుగు గ్రామాలలోనూ రాకెట్లలోనే కాక, నియోజకవర్గంలోని అనేక ఇతర గ్రామాలలో వాళ్ల అండ చూసుకొని పెత్తనం చేసేవాళ్లు, లేక వాళ్లే తమ బలం పెరగడం కోసం ప్రోత్సహిస్తున్న ముఠాదారులూ ఉన్నారు. విడపనకల్ మండలం పెంచలపాడు దీనికొక ఉదాహరణ. ఆ ఊరిలో గోవిందప్ప అనే బోయ కులస్తుడుండేవాడు. చాలా భూమి ఉంది. అతని గుంపు గొర్రెల దొంగతనాలు చేసేవారనీ స్త్రీలను ఎత్తుకుపోయి అత్యాచారం చేసేవారనీ ప్రతీతి. వాళ్లు ఆరుగురు అన్నదమ్ములు కావడంతో వారి ఉమ్మడి కుటుంబం సంఖ్యే 20 దాటి ఉండేది. వారి చుట్టూ పెద్దగుంపు ఉండేది. గ్రామంలో సారాయి వ్యాపారం వాళ్లదే, నిషేధం వచ్చిన తరువాత దొంగసారాయి వ్యాపారమూ వాళ్లదే. ఊరి మధ్యలో ఉన్న చిన్నచెరువులో ఎవరి గొర్రెలయినా నీళ్లుతాగితే, వాళ్లు గోవిందప్పకు తప్పనిసరిగా ఒక గొర్రె ఇయ్యవలసిందే.

1980లలో ఆ ఊరిలోని రెడ్డి, కురుబ, కమ్మ కులస్తులు అతనిని ఎదుర్కొనే ప్రయత్నం చేసి విఫలం అయ్యారు. 1990 తరువాత ఆంజనేయులు అనే ఒక బోయ రైతుతో గోవిందప్పకు ఘర్షణ మొదలు కావడంతో పరిస్థితి మారింది. కురుబ కులస్తులు ఆంజనేయులుతో చేరగా, గోవిందప్పను

ఎదుర్కోదలచుకున్న రెడ్లు కూడ అతనికి సపోర్టుగా నిలబడ్డారు. అయితే గోవిందప్పకు పయ్యావుల కేశవ్ అండ దొరికింది. అవతలి వర్గానికి 1994 దాకా ఉరవకొండ ఎంఎల్ఏగా ఉండిన గోపి మద్దతు ఉండింది కానీ 1994 ఎన్నికల తరువాత అతను బలహీనపడ్డాడు. అయితే ఆ వర్గానికి 'రాడికల్స్' మద్దతు మొదటినుండి ఉందని గోవిందప్ప మనుషులంటారు. ఇక్కడ రాడికల్స్ అంటే పీపుల్స్‌వార్ కె ఎస్ వర్గం అని అర్థం. గోవిందప్ప దౌర్జన్యాల వల్ల వాళ్లతనికి వ్యతిరేకం అయి ఉంటారు. అయితే ఒక బోయ కులస్తుడు పైకి రావడం సహించలేని రెడ్లు ఆంజనేయులును అతనిపైకి ఎగదోసారనీ రాడికల్స్ వారికి సహకరించారనీ గోవిందప్ప అన్న అసంతృప్తి వ్యక్తం చేస్తాడు. 'అన్నలు' వ్యక్తిగత కక్షను అనవసరంగా పెంచి పెంచలపాడును పాడు చేసారని ఉరవకొండకు చెందిన ఒక పీపుల్స్‌వార్ సానుభూతిపరుడే అంటాడు.

మొత్తానికి 1990లో ఆంజనేయులుతో ఒక చిన్నతగాదాతో మొదలయిన ఈ కొట్లాటలో గోవిందప్పవర్గం అతని ఇంటిమీదికి దాడి చేసి అతని తమ్ముడు వెంకటేశ్‌ను పొడిచారు. వాళ్లపంట ఎత్తుకుపోయారు. వాళ్ల తండ్రిని కొట్టుకుంటూ ఊరేగించారు. 1991 లో ఇరువర్గాలూ కట్టెలతో కొట్టుకున్న ఘటనలో గోవిందప్ప తమ్ముడు వేమకోటప్ప చనిపోయాడు. ఆ తరువాత 1992లో రైతుకూలీ సంఘం బాధ్యుడు రామాంజనేయులును గోవిందప్ప వర్గం గుంతకల్‌లోని రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గర చంపారు. (అతనిని 'ఆంజనేయులు మనిషి' అని గోవిందప్ప అన్న వర్ణిస్తాడు). కొన్నిగంటల వ్యవధిలోపల కెఎస్ వర్గంవాళ్లు గోవిందప్ప 18 ఏళ్ల కొడుకు రమేశ్ నాయుడును చంపారు.

తరువాత రాజీ అయిందిగానీ 1995లో ఎంపిటిసి ఎన్నికలలో గోవిందప్ప అన్న కొడుకు ఒక రెడ్డిపైన పోటీచేసినప్పుడు మళ్లీపాత ఘర్షణలు రాజుకున్నాయి. గోవిందప్ప వర్గం కొడవళ్లు, బాంబులు పట్టుకొని రిగ్గింగ్ చేసి గెలిచారని వీళ్లంటారు. కొనసాగిన ఘర్షణలో 1996 అక్టోబర్‌లో ఇవతలి వర్గంవారు గోవిందప్పను హత్య చేసారు. ఈ హత్యతో కెఎస్ వర్గానికేమీ సంబంధం లేదనీ, నిజానికి రమేశ్ హత్య తరువాత తాము రాజీకోసమే ప్రయత్నం చేస్తున్నామనీ ఆ పార్టీ నాయకులంటారు. అయితే చనిపోయిన తమ పార్టీ కార్యకర్త రామాంజనేయులు కుటుంబం ఉరవకొండ ఎంఎల్ఏ (1994కు పూర్వం) గోపికి సన్నిహితులనీ, గోపి పయ్యావుల కేశవ్‌కు వ్యతిరేకం కాబట్టి రాజీ కానివ్వలేదనీ అంటారు. ఏమైతేనేం, నక్సలైట్లు మద్దతిచ్చిన వర్గం నక్సలైట్లతో ఏమీ సంబంధం లేకుండ గోవిందప్పను చంపగా, గోవిందప్ప వర్గం కోపోద్రిక్తులయి 40 ఇళ్లు కాల్చారు. పంటలు కోసుకున్నారు. అవతలి వర్గం మొత్తంగా ఊరు విడిచి పారిపోగా, కనీసం ఆడవాళ్లనూ పిల్లలనూ దింపిపోదామని సిఐ, డిఎస్‌పి ఊరిలోకి వస్తే వాళ్ల సమక్షంలోనే వాళ్లు తీసుకొచ్చిన జనాన్ని గోవిందప్ప మనుషులు కొట్టారు. ఆ తరువాత రెండు మూడు నెలలకు ఉరవకొండ పోలీస్ స్టేషన్ దగ్గరే వారు అవతలి వర్గానికి చెందిన కృష్ణారెడ్డిని చంపారు.

ఇటువంటి ఘటనలను అర్థం చేసుకునేటప్పుడు కేవలం హత్యల సంఖ్యనూ దొమ్మీల

సంఖ్యనూ చూస్తే సరిపోదు. బలవంతుల గుంపులు బాంబులు పట్టుకొని ఊళ్లేలే ఈ వాతావరణంలో ఆ గుంపులలో భాగమయి (తమ నిస్సహాయత వల్ల కావచ్చు, తమ చిన్నచిన్న స్వప్రయోజనాల కోసం కావచ్చు) దెబ్బలు తిని జైళ్లకుపోయి అన్ని విధాలా నష్టపోయే జనాన్ని గురించి ముఖ్యంగా ఈ నష్టమంతా భరించేవారి కుటుంబాల గురించి ఆలోచించాలి. అంతేకాక ఆగ్రామాలలో నెలకొనే ముఠాతత్వం, భయవాతావరణం, సామాన్యప్రజల జీవితాలపైన వేయగల దుష్ప్రభావాన్ని గురించి ఆలోచించాలి. ఆప్రజలు రెండు గుంపుల మధ్య ఇరుక్కొని బతకాలి. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులు మొదలయిన మాటలకక్కడ అర్థం ఉండదు. గుంపులకు చెందిన బలవంతులు చేసే పంచాయతులను నోరుమూసుకొని ఆమోదించాలి. - గ్రామ ఉమ్మడి వ్యవహారాలలో (రోడ్లు, స్కూళ్లు, నీరు, భూములు మొదలయిన వనరులకూ వసతులకూ సంబంధించినవి) రెండు గుంపులు కొట్లాడుకొని- లేక ఒకరు దౌర్జన్యం చేసి- ఏది నిర్ణయిస్తే దానికి కట్టుబడి ఉండాలి. వాళ్ల భూములలో ఎంత కూలి ఇస్తే అంత తీసుకుని పనిచేయాలి. ఇవన్నీ కాదంటే చావుదెబ్బలు తినవలసి ఉంటుంది.

ఇప్పటివరకు కమ్యూనిస్టులు నడిపిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు సహితం ఈ వాతావరణాన్ని తాత్కాలికంగా మాత్రమే దెబ్బతీయగలిగాయి. తిరిగి ఆ గ్రామాలలో అదే వాతావరణం (కమ్యూనిస్టులు ఉంటుండగానే) నెలకొన్న ఉదంతాలు చాలా ఉన్నాయి. పెంచలపాడు, కౌకుంట్ల, రాకెట్ల కొన్ని దృష్టాంతాలు మాత్రమే.

# 3. మధ్యభాగం

అసలే వెనుకబడిన జిల్లా అయిన అనంతపురంలో మరీ వెనుకబడినది జిల్లామధ్యప్రాంతం. పడమట కళ్యాణదుర్గం నుండి తూర్పున కదిరి దాకా విస్తరించిన ఈవిశాల భూభాగం సారవిహీనమైన ఎర్రనేలలు, గులకరాళ్లు, బండలు నిండిన ప్రాంతం. ఎండల కాలంలో ఎకరాలకెకరాలు ఒక్కఅంగుళం కూడ పచ్చదనం కనిపించని ప్రాంతం. ఎవరూ శిస్తు కట్టడానికి సిద్ధపడని సాగుభూములు యిక్కడ విస్తారంగా ఉన్నాయి. ఏ సంవత్సరం ఎంత పంట వస్తుందో తెలియదు కాబట్టి వాటికి పట్టా తీసుకోకుండా శిస్తు చెల్లించకుండా రైతులు సాగు చేసుకునేవారు. ఇవే సివాయిజమా భూములు. ఈ సివాయిజమా భూముల కోసం అవి కూడ లేని పేదలు నిర్వహించిన పోరాటాలు ఈజిల్లా రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యఘట్టం.

కళ్యాణదుర్గం, కదిరి కాక అనంతపురం, పెనుకొండ, ధర్మవరం, నల్లమాడ, శింగనమల ఈ మధ్యప్రాంతానికి చెందిన అసెంబ్లీ నియోజకవర్గాలు. ఇందులో పెనుకొండలోని కొంతభాగం, ధర్మవరం పట్టణం దాని పరిసర గ్రామాలు ఫాక్షన్ ఘర్షణలకు, ఫాక్షనిస్టు దౌర్జన్యాలకు పేరుపొందాయి. దౌర్జన్యం చేసి ఊళ్లేలుతున్న రెడ్డి కులస్తులైన పెత్తందార్లపైన ఒకపక్క కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేపట్టగా (ముఖ్యంగా సివాయిజమా భూముల పోరాటాలు), వారి పెత్తనం వల్ల దెబ్బతిన్నవారిని కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితుడైన పరిటాల శ్రీరాములు చేరదీసి ఫాక్షన్ పద్ధతిలోనే గుంపుకట్టి ఆ పెత్తందార్లపైన పోరాటం చేశాడు. సి.పి.ఐ.ఎం-ఎల్ ఆవిర్భావం తర్వాత పరిటాల శ్రీరాములు విప్లవ కమ్యూనిస్టు రాజకీయాల ప్రతినిధియై తన పోరాటం కొనసాగించాడు. అతని ప్రత్యర్థులు అతనిని 1975లో హత్యచేసిన తర్వాత వారి అధికృత అడ్డం లేకుండ కొనసాగింది. వారిలో ఒకడైన మద్దులచెరువు నారాయణరెడ్డిని పీపుల్స్‌వార్ 1983లో చంపింది. అయితే 1989లో అతని సహచరుడు కనుముక్కల చెన్నారెడ్డి పెనుకొండ ఎమ్మెల్యే అయిన తర్వాత అతని మనుషులు, నారాయణరెడ్డి మనుషులు బాగా విజృంభించారు. పీపుల్స్‌వార్ సానుభూతిపరులు, పరిటాల శ్రీరాములు వర్గానికి చెందినవారు వీరి దౌర్జన్యానికి గురయ్యారు. 1991లో పీపుల్స్‌వార్ చెన్నారెడ్డిని

చంపిన తర్వాత వారి ప్రతీకారం తీవ్రరూపం తీసుకుంది. చెన్నారెడ్డి చిన్న కొడుకు ఓబుళ్‌రెడ్డి దౌర్జన్యాలకు ధర్మవరం తల్లడిల్లింది. దీనిని ఎదుర్కొనడానికి శ్రీరాములు కొడుకు పరిటాల రవి అప్పటిదాకా ఆ కుటుంబానికి పీపుల్స్‌వార్‌తో ఉన్న సంబంధాలను తెంచుకొని తెలుగుదేశం పార్టీలో చేరి 1994లో అసెంబ్లీకి పోటీచేసి పెద్దఎత్తున ఎదురుదాడి మొదలుపెట్టాడు. వాళ్లవల్ల నష్టపోయిన వారందరిని తనవెనక చేరదీసాడు. పీపుల్స్‌వార్‌లోని ఒక వర్గం ఆ పార్టీనుండి బయటికొచ్చి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంతోనే కొనసాగుతూ అతనికి మద్దతు ఇచ్చింది. రెండు సంవత్సరాలలోపల తన ప్రత్యర్థులందరినీ రవి సంపూర్ణంగా అణచివేశాడు. ఒక 'నక్సలైటు పార్టీ' మద్దతు ఉన్న తొలి రాయలసీమ ఫాక్షనిస్టుగా చరిత్రకెక్కాడు. ఈనివేదిక రాస్తుండగా హైదరాబాద్‌లో హత్య కావించబడిన చెన్నారెడ్డి పెద్దకుమారుడు ఎస్.పి. రమణారెడ్డితో కలిపి లెక్కపెట్టుకుంటే చెన్నారెడ్డి, నారాయణరెడ్డి కుటుంబాలలోని ముఖ్యులందరూ (ప్రస్తుతం జైలులో ఉన్న నారాయణరెడ్డి కొడుకు సూర్యనారాయణరెడ్డి మినహా) నక్సలైట్ల చేతిలోనో, రవి చేతిలోనో, రవి అనుయాయుల చేతిలోనో హతమయ్యారు.

## పరిటాల శ్రీరాములు

కనుముక్కల పెనుకొండ నియోజకవర్గమైన చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన గ్రామం. ఆ గ్రామభూస్వామి సానె చెన్నారెడ్డి (కనుముక్కల చెన్నారెడ్డిగానే ప్రసిద్ధికెక్కాడు) దౌర్జన్యపరుడైన పెత్తందారు. తన గ్రామంలోనే కాక ఇతర గ్రామాలలో కూడా జోక్యంచేసుకుని తన మద్దతుదార్లయిన పెత్తందార్లకు అండగా దాడులు చేసేవాడు. నేరస్తుల గుంపును పోగుచేసేవాడు. అతనికి తన ఊరి రెడ్డి (మునసబు)తో ఫాక్షన్ ఉండేది. ప్రస్తుత చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన మరికొన్ని గ్రామాలలో కూడా అతని దుష్ప్రభావం ఉండేది. అయితే పాత చెన్నేకొత్తపల్లి సమితిలోని కనగానపల్లి, రామగిరి మండలాలలో ఎక్కువగా ఉండేది. కనగానపల్లి మండలంలోని మద్దులచెరువుకు చెందిన భూస్వామి గంగుల నారాయణరెడ్డి అతని మిత్రులలో ఒకడు. ఈ నారాయణరెడ్డి 1967లో ఒకసారి, ఆ తర్వాత ఎన్నికలలో రెండోసారి పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచాడు. తాలూకా రాజకీయాలలో చెన్నారెడ్డి నారాయణరెడ్డి అనుచరుడని చెప్పుకోవచ్చు. వీరిద్దరు కలిసి ప్రస్తుత కనగానపల్లి, రామగిరి మండలాలలోని గ్రామీణ ముఠాదార్లకు, పెత్తందార్లకు మద్దతు యిచ్చేవారు. వీరి అండ చూసుకొని ఆ పెత్తందార్లు గుంపులను పోగుచేసి తమ ప్రత్యర్థులను అణిచేసి ప్రజలను క్రూరంగా దోచుకుంటూ బతికేవారు.

వీరిద్దరితో పరిటాల శ్రీరాములు పెట్టుకున్న ఫాక్షన్ కొట్లాట ఫలితాన్ని అనంతపురం జిల్లా ఈనాటికీ అనుభవిస్తున్నది. శ్రీరాములుది రామగిరి మండలంలోని వెంకటాపురం. కమ్మకులస్తుడు. తాతకాలంలో 300 ఎకరాలున్న భూస్వామి కుటుంబం. అతను కూడా పై ఇద్దరిలా రామగిరి, కనగానపల్లి మండలాలలోని ఊళ్లలో గ్రామరాజకీయాలలో జోక్యం చేసుకొనేవాడు.

అతని పద్ధతులూ ఫాక్షనిస్టు పద్ధతులే. అంటే తాను ఎదుర్కోదలచుకున్న శత్రువును వ్యతిరేకించడానికి సిద్ధంగా ఉన్నవారందరినీ చేరదీసి అతడితో తలపడమని ప్రోత్సహించి ఎన్నికలలోనూ, రాజకీయాలలోనూ, ఆర్థిక వ్యవహారాలలోనూ అతడికి అడ్డం తగులుతూ అతడి ప్రాబల్యానికి అడ్డుకట్ట వేసే పద్ధతే. అయితే శ్రీరాములుకు పేదలపట్ల సానుభూతీ, వాళ్లని అణచివేసే దౌర్జన్యకారుల పట్ల తీవ్రమైన వ్యతిరేకతా ఉండేవి. భూస్వాముల ఆక్రమణలో ఉన్న షివాయిజమా భూములు పేదలకు పంచడానికి అతను పోరాటాలు నిర్వహించాడని అతని కుమారుడు రవే కాక ఎం- ఎల్ రాజకీయాలకు సన్నిహితులైనవారు కూడ అంటారు. కాని ఆ పోరాటాలన్నీ కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిందని, శ్రీరాములు కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితంగా ఉంటూ అవే గ్రామాల పెత్తందార్లపైన ముఠాలుకట్టి వాళ్లను రాజకీయంగా, ఆర్థికంగా అణచడానికి పోరాటం చేసేవాడని, ఆ కారణంగా కమ్యూనిస్టుల భూమి పోరాటాలలో కలిసి వచ్చేవాడని, అంతే తప్ప శివాయిజమా భూముల పోరాటంలో అతనికి ప్రత్యక్షపాత్ర ఏమీ లేదని ఎం ఎల్ పార్టీకి దూరంగా ఉండిపోయిన పాత కమ్యూనిస్టులంటారు. మొత్తానికి అందరూ కూడ అతను కమ్యూనిస్టు సానుభూతి పరుడేనని, పేదప్రజల బంధువేనని ఒప్పుకుంటారు. ఇది కొన్ని సందర్భాలలో స్థానిక పెత్తందార్ల ఆధిపత్యాన్ని తొలగించి తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడి ఉండవచ్చును గానీ అదే అతని లక్ష్యమనీ పేదలను వాడుకోవడం ఒక ఫాక్షన్ ఎత్తుగడ అనీ ఎవరూ అనరు. అతని కుమారుడు రవి గురించి (ఎవరూ వినడం లేదని నిర్ధారించుకుని) ఆ మాట అంటారు గానీ శ్రీరాములు గురించి అనరు.

శ్రీరాములు మొదటినుండి మద్దులచెరువు నారాయణరెడ్డికీ, కనుముక్కల చెన్నారెడ్డికీ వ్యతిరేకి కాడు. నారాయణరెడ్డి అతనికి క్లాస్‌మేట్ కావడంతో ఇద్దరికీ పరిచయం ఉండేది, స్నేహం ఉండేది. **1967** అసెంబ్లీ ఎన్నికలలో అతడు నారాయణరెడ్డికి సపోర్టు కూడ చేశాడు. అయితే ఆ తర్వాత చెన్నేకొత్తపల్లి సమితి రాజకీయాలలో శ్రీరాములు తన ప్రాబల్యం పెంచుకున్న క్రమంలో (ముఖ్యంగా కనగానపల్లి, రామగిరి మండల గ్రామాలలో) ఇతనికీ వాళ్లకీ మధ్య వ్యతిరేకత పెరిగింది. దాదాపు మూడు దశాబ్దాలు పెనుకొండ నియోజకవర్గాన్ని శాసించి చివరికి జిల్లా రాజకీయాలనే రూపుదిద్దుతున్న ఈవైరం కనగానపల్లి మండలం గంతిమర్రి పంచాయితీలోని పెనుబోలు గ్రామంలో **1970-71** ప్రాంతంలో మొదలయింది.

అయితే పోరాటకారుడిగా అనండి, ఫాక్షనిస్టుగా అనండి శ్రీరాములు చరిత్ర **1950** లలోనే ప్రారంభమయింది. శ్రీరాములు స్వగ్రామమయిన వెంకటాపురం నసనకోట పంచాయితీలోని **9** గ్రామాలలో ఒకటి. శ్రీరాములు మొదటి పోరాటం నసనకోట గ్రామం రెడ్డి అయిన రామకృష్ణారెడ్డి పైన. శ్రీరాములు కుటుంబానికి ఏపాటి భూమి ఉందో రామకృష్ణారెడ్డికీ ఆపాటే ఉంది. అయితే 'రెడ్డి' తనంతో వచ్చిన పెత్తనం ఆ **9** గ్రామాలపైనా చలాయించేవాడు. **1958**లో జరిగిన మొదటి గ్రామ పంచాయితీ ఎన్నికలో నసనకోటకు చెందిన చౌడరెడ్డిపైన శ్రీరాములు మేనమామ పోటీచేసి

గెలిచాడు. అప్పటికే (1955-57 సంవత్సరాలలో) ఆ పంచాయితీలోని 5000 ఎకరాల సివాయిజమా భూములపైన ప్రజలు పోరాటం చేసి ఆక్రమించుకునే ప్రయత్నం మొదలయింది. ఆ పోరాటం శ్రీరాములు నిర్వహించాడని అతని సన్నిహితులు అంటుండగా, అది కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పోరాటమనీ, నసనకోట గ్రామ రాజకీయాలలో రెడ్ల పెత్తనానికి వ్యతిరేకంగా శ్రీరాములు అదే దశలో పోరాటం నిర్వహించి కమ్యూనిస్టు పార్టీతో కలిసిమెలిసి ఉన్నాడనీ పాత కమ్యూనిస్టులు కొందరంటారు. ఆనాటి నుండి 1990ల దాకా కూడ, పెనుకొండ తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ (ఉమ్మడి పార్టీ అయినా ఆ తరువాత ఎం.ఎల్ అయినా) ఏ పోరాటం నిర్వహించింది, పరిటాల కుటుంబం ఏవి నిర్వహించింది అని వేరు చేసి చెప్పడం కష్టం. ప్రతి విషయంలోనూ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వినపడతాయి. పార్టీ కార్యకలాపాలను ఆ కుటుంబం కార్యకలాపాల నుండి వేరు చేయాలని ఆ పార్టీలే స్పష్టంగా అనుకోలేదు కాబట్టి వాటి మధ్య తేడా ఎక్కువ మొదలవుతుందో చెప్పడం కష్టం. ఎం.ఎల్ పార్టీ పుట్టిన తరువాతయితే ఆ ఇలాఖాలో ఆ కుటుంబం రాజకీయాలే పార్టీ రాజకీయాలన్నా అతిశయోక్తి కాబోదు. ఈ నేపథ్యంలో పరిటాల శ్రీరాములు ఒక ప్రజాపక్షపాతి అయిన ఫాక్షనిస్టుగా ఒక వెలుగు వెలిగి దుర్మరణాం పాలయ్యాడు. అతని కొడుకు ఆ మాత్రం సద్గుణాలు కూడ లేని అసలుసిసలు ఫాక్షనిస్టుగా పై కొచ్చి రేపు ఇంకా ఏమి అవుతాడో అని అందరూ ఆదుర్దాగా ఎదురు చూసే దశ చేరుకున్నాడు.

నసనకోటలో మొదటి పంచాయితీ ఎన్నికలకు కొంచెం అటూఇటూగా ఒక ఘటన జరిగింది. బోయకులంలో ఒక అబ్బాయి ఒక అమ్మాయిని తీసుకుపోయి పెండ్లి చేసుకున్నాడు. కులంలో గొడవ జరిగింది. ఊరి రెడ్లు అబ్బాయి పక్షాన నిలబడగా శ్రీరాములు, కమ్యూనిస్టు నాయకుడు ముత్యాలప్ప అమ్మాయి తల్లిదండ్రుల పక్షాన నిలబడ్డారు. తొమ్మిది గ్రామల నుండి వీళ్ళు జనాన్ని సమీకరించి రెడ్ల మనుషులతో ఘర్షణకు దిగారు. దొమ్మీ జరిగింది.

నసనకోట దగ్గరున్న ముత్తవ కుంటకు కూడ నసనకోట రెడ్డే మునసబు. ఆ ఊరిలో రెడ్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధర్వంలో ఘర్షణ జరిగింది. 1959 సెప్టెంబర్ 4 నాడు జరిగిన దొమ్మీలో నసనకోట రెడ్డి బంధువయిన రావల సుబ్బారెడ్డిని, తలారి నర్సింహులును వీళ్లు తీవ్రంగా కొట్టగా ఇద్దరూ చనిపోయారు. ఈ హత్యలు పార్టీ నిర్వహించిన పోరాటంలో భాగంగా జరిగాయని భావించి పార్టీ వాటిని తన మీద వేసుకుని బళ్లారి నుండి అడ్వకేట్‌ను తీసుకొచ్చి కేసు నడిపించిందని కొందరు అంటుండగా, కొట్లాడినా ఎవరినీ చంపొద్దని పార్టీ ఆనాడు జనానికి చెప్పిందనీ శ్రీరాములు రెచ్చగొట్టడం వల్లనే హత్యలు జరిగాయనీ పార్టీ దీని పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిందనీ, కేసు నడిపించిన మాట మాత్రం వాస్తవమనీ మరి కొందరంటారు.

ఈ కేసులోని 45 మంది ముద్దాయిలలో మొదటివాడు ముత్తవకుంటకు చెందిన రెడ్ల బాధితుడు లక్ష్మన్న కాగా రెండవ ముద్దాయి పరిటాల శ్రీరాములు. మూడు, నాల్గవ ముద్దాయిలు నసనకోట

కమ్యూనిస్టు నాయకులు చిన్న ముత్యాలప్ప, బొమ్మయ్య. సెషన్స్ కోర్టులో మొదటి 14 మంది ముద్దాయిలకూ జీవిత ఖైదుపడగా హైకోర్టు ఒకరినితప్ప అందరినీ విడుదల చేసింది. (ఆ ఒక్కరు నసనకోట రామకృష్ణారెడ్డి జీతగాడు – 'వెట్టి' – అయిన ముత్యాలప్ప అనే దళితుడు. అతను 1969లో జైలు నుండి విడుదల అయి, ప్రస్తుతం కెవిఎస్ వర్గం నక్సలైట్లలో రహస్య కార్యకర్తగా పనిచేస్తున్నాడు).

ఈ కేసులో బయట పడిన తరువాత శ్రీరాములు కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల నుండి కొంచెం వెనక్కి తగ్గాడనీ, నసనకోట రెడ్ల ఆర్థిక ప్రయోజనాలకు – ముఖ్యంగా కల్లు, సారాయి కాంట్రాక్టులపైన వారి అజమాయిషీని – దెబ్బతీసే కార్యక్రమంలో పడ్డాడనీ అంటారు. నసనకోటలోని 9 గ్రామాల కల్లు ఇజారా రెడ్ల చేతిలో ఉండింది. శ్రీరాములు 1963-64 సంవత్సరాలలో కల్లుగీత సొసైటీ నెలకొల్పి వాళ్ల చేతినుండి తప్పించాడు. (రాయల గోవిందప్ప, రాకెట్ల నారాయణరెడ్డి కూడ ఇదే పని చేసారని చూసాము. ఇందులో ప్రజాభిమానం లేక పోలేదు గానీ ప్రత్యర్థుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడానికిది చాలా ఉపయోగపడుతుంది. ఈ రోజు ఉన్నన్ని ఆదాయ మార్గాలు ఆ రోజు లేవు, కల్లు, సారాయి కాంట్రాక్టులే ఒక ముఖ్య ఆదాయ మార్గం). ఈ సొసైటీ సభ్యులు ఒక సహకార సంఘంగా కల్లు వ్యాపారం నడిపి నెలకొకసారి లాభాలు పంచుకునే వారని శ్రీరాములు సన్నిహితులు అంటారు. అయితే, 'శ్రీరాములు ఒకరి కోసం కల్లు వ్యాపారం నడిపాడనలేము. రెడ్లకు వ్యతిరేకంగా సిండికేట్ చేసి నడిపాడు' అనే వాళ్లు ఉన్నారు. అయితే లాభాలు పంచుకోవడంలో అన్యాయానికి పాల్పడ్డాడని మాత్రం ఎవరూ అనరు. ఈ ప్రయోగం 1964-65 సీజన్‌లో కూడ నడిచింది.

శ్రీరాములు రెడ్లమీద మాత్రమే పోరాటం చేయలేదు. కమ్యూనిస్టు పార్టీ చీలిన తరువాత నసనకోట గ్రామపంచాయితీకి సిపిఐ(ఎం) తరఫున గ్రామ కమ్యూనిస్టు పార్టీనాయకుడు ముత్యాలప్ప పోటీ చేయగా అతనిపైన శ్రీరాములు తన తమ్ముడు చిననారప్పను నిలబెట్టి ఓడిపోయాడు. ఆ తరువాత ఒకనాడు పొలం నుండి వస్తున్న శ్రీరాములుపైన ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులుజరపగా అతని పక్కనున్న ఒక అనుచరుడు చనిపోయాడు. శ్రీరాములు సిపిఐ (ఎం) నాయకుడు ముత్యాలప్పనే అనుమానించి కేసు పెట్టించాడు. 1971 లో సిపిఐ (ఎం.ఎల్) వారికి శ్రీరాములుతో పరిచయం ఏర్పడినప్పుడు అతనిని వెంటనే చేరదీయడానికి ఒక కారణం అతను మొదటినుండి రెడ్ల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కమ్యూనిస్టు సానుభూతి పరుడనేది కాగా, రెండవ కారణం అతను నసనకోట ప్రాంతంలో సిపిఐ (ఎం) పైన పోరాటం చేసేడనేది కూడా అని ఒక ఎం.ఎల్. పార్టీనాయకుడే అంటాడు.

ఒక వైపు నసనకోట పంచాయితీలో రెడ్డి భూస్వాముల పెత్తనానికి వ్యతిరేకంగా శ్రీరాములు జనాన్ని గుంపు చేస్తున్నప్పటికీ, సమితి (చెన్నే కొత్తపల్లి) రాజకీయాలలో 1967 దాకా అతనికి నారాయణ రెడ్డితోనూ చెన్నారెడ్డితోనూ వైరం లేదు. పైన చెప్పినట్లు, 1967 అసెంబ్లీ ఎన్నికల్లో

శ్రీరాములు నారాయణ రెడ్డికి అనుకూలంగా పనిచేసాడు.

అయితే తరువాత పరిస్థితి క్రమంగా మారింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే కనగానపల్లి, రాయగిరి మండలాలలో రెడ్ల పెత్తనం కింద నలిగిన ప్రజలలో బోయ, కురుబ, ఈడిగ తదితర బిసి కులాల ప్రజలు, దళిత రైతు కూలీలేకాక కమ్మకులస్తులయిన రైతులు, భూస్వాములు కూడ ఉన్నారు. పరిటాల శ్రీరాములు రెడ్ల పెత్తనానికి వ్యతిరేకంగా నడిపిన పోరాటానికి మొదట నసనకోటలోనూ తరువాత ఇతర గ్రామాలలోనూ కమ్మకులస్తులయిన వ్యవసాయ దారులు ఎక్కువగా స్పందించారు. శ్రీరాములులో కులతత్వం లేదని దాదాపు అందరూ ఒప్పుకుంటారు. అయితే అతని గుంపుకు కొంత 'కమ్మ' స్వభావం లేకపోలేదు. ప్రధానంగా రెడ్లు చలాయిస్తున్న పెత్తనాన్ని వ్యతిరేకించడానికి ఎవరెవరు సిద్ధంగా ఉంటే వారినందరినీ గుంపు చేసి గలాట పెట్టుకోవడానికి శ్రీరాములు సిద్ధపడ్డాడే తప్ప కమ్మవాళ్ళ ప్రయోజనాలు సాధించాలన్నది అతని లక్ష్యంకాదు. అయినప్పటికీ రెడ్ల పెత్తనానికి గురయిన వారిలో ఆర్థిక స్తోమత, రాజకీయబలం ఉన్నది కమ్మలకే కాబట్టి వారు అందరికంటె ఎక్కువగా శ్రీరాములు రాజకీయాలకు స్పందించారు, అతని దగ్గరకు చేరారు.

క్రమంగా రామగిరి, కనగానపల్లి మండలాలలో శ్రీరాములు వర్గం ఒకటి తయారయింది. అందులో ముఖ్యులు శ్రీరాములు, అతని బావమరిది కోనాపురం రామకృష్ణారెడ్డి (ఇతను కమ్మకులస్తుడే గానీ వారి కుటుంబం తమ గ్రామానికి 'రెడ్లు' కావడం వల్ల పేరు వెనక రెడ్డి వచ్చింది), మద్దులచెరువులో నారాయణరెడ్డి ప్రత్యర్థి అయిన రామకృష్ణప్ప, వేపకుంటకు చెందిన వకీలు రంగయ్య తదితరులు. వీరందరూ కమ్మలేకానీ వీరి పక్షంలోనూ రెడ్డి కులస్తులు కొందరుండేవారు, అవతలి వర్గమైన చెన్నారెడ్డి, నారాయణ రెడ్ల వర్గంలోనూ కొందరు కమ్మకులస్తులుండేవారు. 'చిన్నజనం' అని పిలవబడే బోయ, కురుబ, ఈడెగ, మాల, మాదిగ కులాలు కొన్ని గ్రామాలలో ఎక్కువగా శ్రీరాములు వర్గంతో ఉన్నప్పటికీ ఫాక్షన్ వాతావరణం కారణంగా చాలా చోట్ల రెండుగా చీలి ఇటూ అటూ కూడ ఉండేవారు. ఆ కులాలకు చెందిన పెత్తందార్లున్న చోట ఇది మరీ ఎక్కువగా జరిగింది. శ్రీరాములు అనుయాయులందరూ సూత్రప్రాయంగా దోపిడీ పీడనలను వ్యతిరేకించిన వారేం కారు. రెడ్లపాలనలో అసంతృప్తులయిన ఇతర పెత్తందార్లు, రెడ్ల అనుయాయులతో స్పర్థలున్న ముఠానాయకులు, ఫాక్షనిస్టు స్వభావం గల వ్యక్తులు కూడ ఉండేవారు.

కనగానపల్లి మండలం తొగరకుంట గ్రామాన్ని ఒక ఉదాహరణగా తీసుకుంటే ఈ ప్రాంతంలో రెడ్డి కులస్తులయిన పెత్తందార్ల దౌర్జన్యాలు ఏ విధంగా ఉండేవో వాటిని ఎదుర్కొన్న వారికి శ్రీరాములు అండ ఇవ్వడంలో ఎటువంటి పాత్ర నిర్వహించాడో కొంత అర్థం అవుతుంది. తొగరకుంటలో రెడ్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. బోయ, కురుబ, దళిత కులాలన్నీ కలిపి అంత సంఖ్యలో ఉన్నారు. 1950ల నుండి ఈ ఊరిలో సిపిఐ ప్రభావం ఉండింది. సంజీవప్ప, తిమ్మయ్య

అనే యిద్దరు బోయకులస్తులయిన కమ్యూనిస్టు నాయకులుండేవారు. ఒకనాడు ఊరిలో నాటక ప్రదర్శన నడుస్తుండగా తిమ్మయ్య అనే వ్యక్తి బెంచి మీద కూర్చొని నాటకం చూస్తుండడం గమనించిన పరంధామరెడ్డి అనే గ్రామ కాంగ్రెస్ నాయకుడు 'బోయోడు బెంచిమీద కూచుంటాడా' అని చెప్పుతో కొట్టాడు. అప్పటి నుండి ఘర్షణ తీవ్రతరమైంది. అప్పట్లో బోయలలో మూడిండ్లు తప్ప అందరూ సిపిఐతోనే ఉండేవారు. వాళ్లు 1958లో మొదటి పంచాయితీ ఎన్నికలో తిమ్మయ్యను నిలబెట్టి సర్పంచ్‌గా గెలిపించుకున్నారు. కానీ హనుమంత రెడ్డి అనే అతను వచ్చి గ్రామ రెడ్డి (ఆదినారాయణరెడ్డి) తననే సర్పంచ్‌గా వుండమన్నాడని చెప్పి తిమ్మయ్యను బెదిరించి సర్పంచ్

## ఆ తరువాత...

తొగరకుంటలో తరువాతి పరిణామాలు చెప్పుకుంటే ఫాక్షన్ వాతావరణంలో ఆధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు ఎదుర్కొనే సమస్యలు అర్థమవుతాయి. *1970*లలో గ్రామంలో బోయలు బలపడ్డారు. గ్రామంలో రాజకీయ ప్రాముఖ్యం కొంత మేరకు వాళ్ల చేతుల్లోకి పోయింది. *1975* నాటికి రెడ్లు బోయలతో రాజీ పడ్డారు. కానీ బోయలలోనే గ్రూపులు బయలుదేరాయి. కొందరు పరిటాల శ్రీరాములు వర్గం అయ్యారు. ఒకతను (సంజీవప్ప కొడుకు) శ్రీరాములుతో బాటు హతమయ్యాడు. కొందరు (నన్నుతిమ్మారెడ్డిని చంపడంలో ముఖ్యపాత్ర నిర్వహించిన ముత్యాలప్పతో సహా) కనుముక్కల చెన్నారెడ్డి వర్గమయ్యారు. ముత్యాలప్ప ఆ తరువాత *10* సంవత్సరాలు గ్రామ సర్పంచ్‌గా ఉన్నాడు. శ్రీరాములు వర్గంలో ఉన్నవారు అతని మరణం తరువాత వేపకుంటకు చెందిన వకీలు రంగయ్య అనుచరులుగా కొనసాగారు. వారిలో కొందరు, పెత్తందార్లపైన పోరాటం కొనసాగించడానికి (తమకు అన్యాయం చేసిన రెడ్లపైన ప్రతీకారం తీర్చుకోవడానికని ఒక వ్యాఖ్యానం) నక్సలైట్లలో చేరారు. వారిలో ఒకడయిన ప్రభాకర్ నాలుగేళ్ల తరువాత ఎం.ఎల్ పార్టీనుండి బయటికొచ్చాడు. రాంభూపాల్ రెడ్డిని *1985*లో ఇతనే చంపాడు. పరిటాల రవి *1992*లో తెలుగుదేశంలో చేరిన తరువాత ఇటువంటి వారి కోసమే వెతికాడు. ప్రభాకర్ పరిటాల రవితో చేరి తెలుగుదేశం మిలిటెంట్ అయ్యాడు.

*10* సంవత్సరాలు సర్పంచ్‌గా ఉన్న ముత్యాలప్ప చెన్నారెడ్డి అనుచరుడన్న కక్షతో పరిటాల రవి అనుచరులయిన బోయకులస్తులు మొన్నటి గ్రామ పంచాయితీ ఎన్నికలో నాగరాజును పోటీకి నిలబెట్టారు. ముత్యాలప్ప తన మనిషిని నిలబెట్టాడు. అతని చేత ఉపసంహరింపజేయడానికి రవి మనుషులు పెట్టిన ఒత్తిడి ఫలించలేదు. ముత్యాలప్ప మనిషి ఓడిపోయాడు. జనవరి *26*నాడు కొత్త సర్పంచ్ నాగరాజు జెండా ఎగిరేసి వస్తుంటే ఓడిపోయిన ముత్యాలప్ప అభ్యర్థి అతనిని నరికి చంపాడు.

పదవి తానే తీసుకున్నాడు. అప్పట్లో ఆ గ్రామంలో 'చిన్నజనం' (అంటే ఎస్‌సి, బిసిలు) చెప్పులు వేసుకొని తిరగడానికి వీలులేదు, పరువుగా బతకడానికి వీలులేదు.

1964లో తిమ్మయ్య మళ్లీ సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచాడు. ఈ సాహసానికి ప్రతీకారంగా రెడ్లు 1964 అక్టోబర్ 14నాడు తిమ్మయ్యనూ సంజీవప్పనూ కాల్చి చంపారు. రాంభూపాలరెడ్డి (మొదటి ఎన్నికలో సర్పంచ్ పోస్టు బలవతంగా లాక్కున్న హనుమంత రెడ్డి పెంపుడు కొడుకు), సన్నతిమ్మారెడ్డి, వెంకట్రాంరెడ్డి, జిక్క నారాయణ రెడ్డి అనే రెడ్లతో బాటు పోలప్ప అనే బోయ కులస్తుడు కూడా ఈ హత్యలో పాల్గొన్నాడు. సెషన్స్ కోర్టు అందరినీ వదిలి పెట్టింది గానీ ప్రభుత్వం హైకోర్టుకు అప్పీల్ చేయగా అందరికీ యావజ్జీవిత ఖైదు పడింది. అయితే రాజకీయ పరపతి ఉపయోగించుకొని వాళ్లు త్వరలోనే పెరోల్ మీద బయటి కొచ్చే ప్రయత్నం చేసారు. ఆ విధంగా బయటి కొచ్చిన సన్న తిమ్మారెడ్డిని 1967లో బోయలు చంపారు. (ఆ తరువాత నక్సలైట్లయి, మాజీ నక్సలైట్లయిన కొందరు బోయ కులస్తులు 1985లో రాంభూపాలరెడ్డిని అనంతపురంలో చంపారు). మధ్య మధ్యలో ఇరువర్గాలకు జరిగిన దొమ్మీలలో సంజీవప్ప మామ తిమ్మయ్య చనిపోయాడు. ఈ పోరాటంలో మొదటి నుండి బోయలకు పరిటాల శ్రీరాములు అండగా నిలబడ్డాడు. అతనికీ వీళ్లు సహాయంగా ఉన్నారు. 1959లో అతను ముత్తవకుంట దొమ్మీలో జంట హత్యలు జరిగిన తరువాత తొగరకుంటలోనే తలదాచుకున్నాడు.

## శ్రీరాములు వర్గం

చెన్నారెడ్డి చెన్నే కొత్తపల్లి సమితి అధ్యక్షుడుగా ఎన్నికయినప్పుడు మొట్టమొదటిసారిగా పరిటాల శ్రీరాములుకు చెన్నారెడ్డితోనూ నారాయణరెడ్డితోనూ వైరం స్పష్టమైన రూపం తీసుకుంది. కమ్మ-రెడ్డి కులవైరుధ్యం కూడ అప్పుడే బయటి కొచ్చింది. ఈ ఎన్నిక 1970లో జరిగింది. సమితి ప్రెసిడెంట్ పోటీలో పల్లెన్నగారి రమణారెడ్డి, కొనాపురం రామకృష్ణారెడ్డి (ఇతను కమ్మ కులస్తుడని జ్ఞాపకం పెట్టుకోవాలి) నిలబడ్డారు. అప్పటికి కనుముక్కల గ్రామం సర్పంచ్ అయిన చెన్నారెడ్డి మొదట పరిటాల శ్రీరాములుతో బాటు రామకృష్ణారెడ్డికే మద్దతుగా ఉన్నాడు. అయితే, 'సమితి ప్రెసిడెంట్‌గా రెడ్డి ఉండాలి, కమ్మవద్దు' అని రెడ్లు చెన్నారెడ్డిని అటువైపు రమ్మని ఒత్తిడి పెట్టారు. చెన్నారెడ్డి తెలివిగా, 'రెడ్ల' అభ్యర్థిగా తనను పెట్టేటట్టయితేనే పార్టీ ఫిరాయిస్తానని పట్టుబట్టాడు. (అది పరోక్ష ఎన్నిక కాబట్టి సర్పంచ్‌లలో ఎవరైనా సమితి ప్రెసిడెంట్‌కు పోటీ చేయవచ్చు). రెడ్లంతా కలిసి రమణారెడ్డికి 11 వేల రూపాయలిచ్చి పోటీ నుండి మాన్పించి చెన్నారెడ్డిని సమితి ప్రెసిడెంట్ చేసుకున్నారు. రమణారెడ్డిని మాన్పించడంలో మద్దుల చెరువు నారాయణ రెడ్డి ముఖ్యపాత్ర నిర్వహించాడు. కోనాపురం రామకృష్ణారెడ్డి పరిటాల శ్రీరాములు నిలబెట్టిన అభ్యర్థేకాక అతనికి బంధువు కూడా కాబట్టి ఇది శ్రీరాములుకు దెబ్బ. చెన్నారెడ్డి, నారాయణరెడ్లకూ శ్రీరాములుకూ రాజకీయ ఘర్షణ దీనితో ప్రారంభమయింది.

ఈ ఎన్నికకు కొంచెం అటూఇటూగా (బహుశా 1971 లో కావచ్చు) ఈ రెండు వర్గాలూ భౌతికంగా తలపడిన పెనుబోలు ఘర్షణ జరిగింది. పెనుబోలులో పెరుగు నారప్ప కుటుంబానికి కొప్పుల కుండ సుబ్బిరెడ్డితో ఘర్షణ ఉండింది. నారప్పవాళ్లు రెడ్లు. వాళ్లు సమితి ఎన్నికలలో చెన్నారెడ్డికి అనుకూలంగా చేయగా సుబ్బిరెడ్డి శ్రీరాములుతో ఉన్నాడు. నారప్ప కొడుకులు ౯ మందిలో ఒకడయిన పెరుగు శ్రీరాములు చెన్నే కొత్తపల్లి సమితి ఆఫీసులో అటెండర్‌గా పనిచేసేవాడు. ఆ కారణంగా కూడ అతను చెన్నారెడ్డికి దగ్గరయ్యాడు.

ఈ ఘర్షణలో భాగంగా నారప్ప వర్గంవారు సుబ్బిరెడ్డిపైన దాడి చేసి అతని కాళ్లు విరగొట్టారు. అతను ఉరవకొండ నుండి రౌడీలను తీసుకొచ్చి నారప్ప కుమారులలో ఒకడయిన కృష్ణారెడ్డి పశువుల కొట్టానికి నిప్పు పెట్టాడు. ఆ సమయంలో కృష్ణారెడ్డి పశువుల కొట్టంలో వున్నాడు. అతను తప్పించుకొని బయటకు రాగా అతనిని చంపారు. ఈ హత్యకు ప్రతీకారంగా మద్దులచెరువు నారాయణరెడ్డి, కనుముక్కల చెన్నారెడ్డి స్వయంగా గుంపును తీసుకొచ్చి పెరుగు నారప్ప కుటుంబంతో కలిసి సుబ్బిరెడ్డి కుటుంబానికి చెందిన గొర్రెలు, పంటలు దోచుకున్నారు. ఊరిలో చాలా బీభత్సం చేసారు. కృష్ణారెడ్డి హత్య తరువాత సుబ్బిరెడ్డి ఊరు విడిచి పారిపోయాడు. అయితే ప్రత్యర్థి వర్గం వారు అతనిని వెతికి పట్టుకొని హత్య చేసారు.

ఈ గ్రామంలో మొట్టమొదటిసారి పరిటాల వర్గానికి చెన్నారెడ్డి, నారాయణరెడ్లతో ప్రత్యక్ష భౌతిక ఘర్షణ ఏర్పడింది. అంతకు ముందు రెడ్ల పెత్తనం పైన ఇతరులు పోరాటం చేసిన గ్రామాలలో వీళ్లు అటువైపు, శ్రీరాములు ఇటువైపు ఉండడం తటస్థపడినా (ఉదాహరణకు తొగరకుంటలో) అది వారి మధ్య ప్రత్యక్ష ఘర్షణకు దారి తీయలేదు, వారి రాజకీయ సంబంధాలను చెడగొట్టలేదు. అప్పటినుండి, వాళ్లు 1975లో శ్రీరాములును చంపించేంత వరకు వాళ్లపైన శ్రీరాములు పోరాటం సాగింది. వారిలాగ శ్రీరాములు కూడ తన అనుచరులచేత దొంగతనాలు చేయించేవాడన్న అభియోగం కూడ ఉంది. అయితే ఇది ఒకటి రెండు సంవత్సరాలు మాత్రం జరిగిందనే ఆ తరువాత అది తప్పని గ్రహించి శ్రీరాములు మానుకున్నాడనీ అతనిని బాగా ఎరిగివ వారు వివరిస్తారు.

దాదాపు ఇదే సమయంలో శ్రీరాములు సి.పి.ఐ. ఎం.ఎల్‌లో చేరాడు. అంతకు ముందు అతను కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితుడైనా పార్టీలో ఎప్పుడూ లేడు, ప్రజాసంఘాలలోనూ లేడు. 'ఎందుకని లేడు' అని ఒక పాత కమ్యూనిస్టు పార్టీ నాయకుడిని అడిగితే 'అతను పార్టీ సానుభూతి పరుడే కాని దౌర్జన్యకారుడు. అందువల్ల చేర్చుకోలేదు' అంటాడు. అతవి రాజకీయాలలో పెత్తనాన్ని, పెత్తందార్లను వ్యతిరేకించే లక్షణం ఎంత ఉందో ఫాక్షనిస్టు లక్షణాలూ అంత ఉన్నాయని పైన చూశాం. అయితే సి.పి.ఐ. ఎం.ఎల్ తొలినాడు అనుసరించిన వైఖరి వల్ల అతను త్వరలోనే ఆ రాజకీయాలలోకి ప్రవేశించగలిగాడు. విప్లవ రచయితల సంఘంలో సభ్యుడయ్యాడు. అతను చనిపోయేంత వరకు అతని ఊరే, అతని ఇల్లే అనంతపురంలో నక్సలైట్ రాజకీయాలకు కేంద్రంగా ఉండింది. (ఆ తర్వాత కూడా చాలాకాలం ఆ ఇల్లే కేంద్రం అన్న పరిస్థితి కొనసాగింది), ఈ

జిల్లాలో పరిటాల శ్రీరాములుకు ఉన్న గుర్తింపును, పెత్తందారీ రెడ్లకు వ్యతిరేకంగా అతను చేసిన పోరాటాలను నక్సలైటు ఉద్యమం పునాది చేసుకుని ఎదిగిందని ఒక ముఖ్య నక్సలైటు నాయకుడంటాడు. పార్టీ నిర్మాణం స్వల్పంగా ఉన్న తొలిదశలో శ్రీరాములు కార్యకలాపాలే పార్టీ కార్యకలాపాలు అయ్యాయని కూడ అంటాడు. దాని దుష్ఫలితాలను ఆ ఉద్యమం బహుశా ఇప్పటికీ అనుభవిస్తూనే ఉంది.

## శ్రీరాములు తర్వాత

పరిటాల శ్రీరాములును **1975** మే **29**న హత్య చేశారు. రామగిరి మండలం కర్నాటకలోని తుంకూరు జిల్లా పావగడ తాలూకాను ఆనుకుని ఉంటుంది. పావగడలోని కాదిగానిచర్లలో జరుగుతున్న ఒక పెళ్లికి ఆనాడు శ్రీరాములు పోతుండగా దారిలో క్యాతగాని చెరువు దగ్గర బస్సును అటకాయించి అతనిని, అతని తమ్ముడు సుబ్బయ్యను తొగరకుంట సంజీవప్ప కొడుకు రామాంజనేయులును, ఎగువపల్లికి చెందిన దళితుడు లింగన్నను కాల్చి చంపారు. దాదాపు **2,3** గంటలు కాల్పులు జరిగాయంటారు. చంపిన వారిలో సిద్దప్ప అనే క్యాతగాని చెరువుకు చెందిన బోయ కులస్తుడున్నాడు. అతను ఒకప్పుడు శ్రీరాములు అనుచరుడే. ఆ ఊరి కరణానికి వ్యతిరేకంగా అతనిని శ్రీరాములు సపోర్టు చేశాడు. అతను అంతకుముందు గొర్రెల దొంగతనాలు చేసేవాడని, శ్రీరాములు అతనిచేత దొంగతనాలు మాన్పించి తన అనుచరుడ్ని చేసుకున్నాడని ఒక కథ. అయితే చెన్నారెడ్డి, నారాయణరెడ్లు సిద్దప్పనే వాడుకుని శ్రీరాముల్ని చంపించారు. చనిపోయేనాటికి శ్రీరాములు వయస్సు **40** సంవత్సరాలే.

శ్రీరాములు చనిపోయిన కొద్ది వారాలకే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించబడింది. రెడ్ల పెత్తనాన్ని వ్యతిరేకించి శ్రీరాములు అండన చేరినవారు, శ్రీరాములు ద్వారా నక్సలైటు రాజకీయాలు ఈజిల్లాలోకి ప్రవేశించిన తర్వాత ఆ రాజకీయాలలో భాగమైన జనం పోలీసు నిర్బంధానికి, రెడ్ల దాడులకు గురయ్యారు. చాలా సందర్భాలలో ఈ జనమూ ఆ జనమూ ఒకరే. శ్రీరాములు నిర్వహించిన పోరాటాలు, సి.పి.ఐ ఎం-ఎల్ పోరాటాలు విడదీయలేనంతగా పెనవేసుకుని పోయిన స్థితిలో వారిమధ్య తేడా చూడదలుచుకున్నా చూడటం కష్టమయ్యేదేమో! అయితే తేడా చూడవలసిన అవసరం ప్రభుత్వానికి, రెడ్డి పెత్తందార్లకు లేదు. మళ్లీ **1980** దాకా ఈ ప్రాంతంలో సి.పి.ఐ. ఎం-ఎల్ తిరిగి పని చేయలేకపోవడం వలన నిర్బంధ దశలో దెబ్బతిన్న ఈ ప్రజానీకం తమకు తెలిసిన రాజకీయ పద్ధతులలో తమను తాము రక్షించుకోవల్సి వచ్చింది.

శ్రీరాములు చనిపోయేనాటికి చిన్నవాళ్లుగా ఉన్న అతని కుమారులు రవి, హరి ఎదిగి సి.పి.ఐ. ఎం-ఎల్ పీపల్స్‌వార్‌కు సన్నిహితంగా మెలగసాగారు. రవి ఎన్నడూ ఆపార్టీలో చేరలేదు. కాని హరి పీపుల్స్‌వార్ కార్యకర్త అయ్యాడు. **1980** తర్వాత ఆ పార్టీ ఆధ్వర్యంలో రామగిరి, కనగానపల్లి ప్రాంతాలలో మళ్లీ కూలి పోరాటాలు, సివాయిజమా భూముల పోరాటాలు నడిచాయి. అయితే

గతంలోలాగ ఇప్పుడు కూడ ఆ పార్టీ నాయకులకు వెంకటాపురంలో పరిటాల వాళ్ల ఇల్లే కేంద్రంగా ఉంది. ఆ కుటుంబానికి శ్రీరాములు నుండి వారసత్వంగా సంక్రమించిన కక్షలు, ప్రతీకార కార్యక్రమాలు ఆ పార్టీ కార్యక్రమాలను ప్రభావితం చేయసాగాయి. ఆ కుటుంబం నిర్ణయాలే పార్టీ నిర్ణయాలయ్యాయని తర్వాతి కాలంలో ఆ పార్టీలోనే తీవ్ర విమర్శ వచ్చింది. అప్పట్లో జిల్లాలో పీపుల్స్‌వార్‌కు ముఖ్యనాయకులుగా ఉన్నవారిలో ఒకరిప్పుడు పరిటాల రవి ఆర్థిక వ్యవహారాలు చూసుకునే కుడిభుజం, మరొకరు వివాహం ద్వారా రవికి బావమరిది.

**1982** నవంబర్ **28**న పోలీసులు ఒక చిన్న ఘర్షణను ఆసరా చేసుకుని పరిటాల హరిని కాల్చిచంపారు. మద్దులచెరువు నారాయణరెడ్డి హస్తం దీని వెనక ఉందని భావించిన పీపుల్స్‌వార్ అతనిని **1983** జూన్ **1** న తేదీన అనంతపురం పట్టణంలో హతమార్చింది. అతను పరిటాల శత్రువు. ఆనర్గం ద్వారా ఎదిగిన నక్సలైటు ఉద్యమానికే శత్రువు. మద్దులచెరువు నారాయణరెడ్డి అసలు పేరు గంగుల నారాయణరెడ్డి. అతని ఊరు కనగాన పల్లి మండలంలోని మద్దులచెరువు. గ్రామంలో అతని ప్రత్యర్థి రామకృష్ణప్ప. నారాయణరెడ్డి పెద్ద భూస్వామి కాగా రామకృష్ణప్పకు కూడా **60** ఎకరాల భూమి ఉండింది. అతను కమ్మ కులస్తుడు. ఎల్.ఎం.బి (భూమి తనఖా బ్యాంకు) అధ్యక్షుడుగా కొంతకాలం ఉన్నాడు. ఆతర్వాత (**1962**లో) గ్రామంలో **46** మంది పేదలతో సొసైటీ పెట్టించి సహకార వ్యవసాయం కోసం ప్రభుత్వం నుండి **115** ఎకరాల భూమి మంజూరు చేయాంచాడు. అయితే నారాయణరెడ్డి ఆ సొసైటీలో ఇంకా చాలా మందిని చేర్చుకోవాలని లేదా ఆ భూమిని అర్ధఎకరం చొప్పున తాను సూచించిన పేదలను కూడ కలుపుకుని అందరికీ పంచాలని పట్టుపట్టాడు. 'నీ మునుషులకు నువ్వు చేసుకున్నావు, నామనుషులకు కూడ చెయ్యి' అనేది అయని తర్కం. ఈ వివాదం కోర్టులో కేసయి హైకోర్టు దాకా కూడా పోయింది. **1996**లో రామకృష్ణప్పకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. శ్రీరాములు సమితి రాజకీయాలలో నారాయణరెడ్డి, చెన్నారెడ్డిలకు వ్యతిరేకమైన క్రమంలో రామకృష్ణప్ప శ్రీరాములుతో చేరాడు. పైన వివరించినట్టు **1970** సమితి ఎన్నికల నాటికి వీరి వైరానికి కమ్మ, రెడ్డి స్వభావం కొంత వచ్చింది. నారాయణరెడ్డి తన ఊరిలోను పొరుగూరిలోను దౌర్జన్యాలు చేసేవాడు, చేయించేవాడు. అతని అనుచరులు దొంగతనాలు చేస్తే కాపాడేవాడు. సొసైటీకి సంబంధించిన గొడవ జరిగిన తర్వాత మొదటి పంచాయితీ ఎన్నికలలో రామకృష్ణప్ప ఒక బోయ కులస్తుడిని, నారాయణరెడ్డి మరో బోయ కులస్తుడిని పోటీకి నిలబెట్టారు. మద్దుల చెరువు శివారు గ్రామమైన సుగాలీ తండా వాళ్లు రామకృష్ణప్ప అభ్యర్థికి వోటు వేశారని నారాయణరెడ్డి వాళ్ల ఇళ్లు కాల్పించాడు. ఊరి కరణం లక్ష్మీనారాయణ సొసైటీ విషయంలో రామకృష్ణప్పకు అనుకూలంగా ఉండడమే కాక కూలిపోయిన తండా వాసులకు ఇళ్లు ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా కట్టించాడు. ఈ కోపం మనసులో పెట్టుకుని కరణం లక్ష్మీనారాయణను నారాయణరెడ్డి రోడ్లోకి ఈడ్చి కొట్టి ఊరినుండి తరిమేస్తే అతను **20** ఏళ్ల తర్వాత కూడ తిరిగి ఊరిలో అడుగుపెట్టలేదు.

నారాయణరెడ్డి దౌర్జన్యమంటే మద్దులచెరువులో ఎంత భయం ఉండేదంటే కమ్మ-రెడ్డి కొట్లాటకు భయపడి బోయ, కురుబ కులాల పెద్దమనుషులు గ్రామపంచాయితీ విషయంలో ఒక రాజీ ఫార్ములా అమలు చేశారు. సర్పంచ్ పదవిని వివిధ కులాలు రొటేషన్ ప్రకారం తీసుకోవాలని నియమం పెట్టారు. ఒకసారి కమ్మ, ఒకసారి రెడ్డి, ఒకసారి బోయ, రెండు సార్లు కురుబ కులస్థులు సర్పంచ్‌లయ్యారు. నారాయణరెడ్డి సర్పంచ్‌గా ఉన్నప్పుడు చెన్నే కొత్తపల్లి సమితికి ఉపాధ్యక్షుడయ్యాడు.

నారాయణరెడ్డి హత్య అనంతరం అతని కొడుకులు సూర్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి కనుముక్కల చెన్నారెడ్డి అనుయాయులుగా కొనసాగారు. నక్సలైటు సానుభూతి పరులపైన, పరిటాల శ్రీరాములు బతికి ఉండగా అతని అండతో తమను వ్యతిరేకించినవారి పైన దాడులు కొనసాగించారు. (ఈ రెండు వర్గాలనూ విడదీయడం కష్టమని ఇదివరకే చెప్పాను). **1989**లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పెనుకొండ ఎమ్మెల్యే కనుముక్కల చెన్నారెడ్డి ఎన్నికయిన తర్వాత ఈ దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. అదే సంవత్సరం దివాకర రెడ్డి తాడిపత్రిలో గెలిచినాక అతని దౌర్జన్యాలు కూడ పెరిగాయని రెండవ అధ్యాయంలో చూశాం. **1992** తర్వాత వై.ఎస్. రాజశేఖర రెడ్డి సూర్యప్రతాపరెడ్డిని దివాకరరెడ్డి పైకి ఎగదోయడంతో వారిద్దరి ముఠాకొట్లాటల వల్ల తాడిపత్రిలో హింసాకాండ చాలా పెరిగిందని కూడా చూశాం. సరిగ్గా అదే సమయంలో చెన్నారెడ్డి చిన్నకొడుకు ఓబుల్‌రెడ్డి ధర్మవరంలో కనీవినీ ఎరుగని భయోత్పాతం సృష్టించాడు. కనగానపల్లి, రామగిరి మండలాలలో కూడ వీరి అండ ఉన్న స్థానిక ఫాక్షనిస్టులు సూర్యనారాయణ రెడ్డి, రఘునాథరెడ్డి పరిటాల వర్గంపైన, నక్సలైటు సానుభూతి పరులపైన దాడులు ఎక్కువ చేశారు. ఒకేసారి అటు తాడిపత్రి తాలూకాలోను, ఇటు పెనుకొండ గ్రామాలలో, ధర్మవరం పట్టణంలోను పెరిగిన ఈ దౌర్జన్యకాండకు పరస్పర సంబంధమేమీ లేదు. తాడిపత్రి ఫాక్షన్ రాజకీయాలకు తక్కిన అనంతపురం రాజకీయాలకంటే కడప, కర్నూలులతో సంబంధం ఎక్కువ. పెనుకొండ, ధర్మవరంల ఫాక్షన్ చరిత్రకు తాడిపత్రితో ఏమీ సంబంధం లేదు. అయితే కాకతాళీయంగా **1992** తర్వాత రెండు చోట్లా దౌర్జన్యం పెరగడంతో ఒక్కసారిగా అనంతపురం జిల్లా అంతకుముందు ఎప్పుడూ లేనంతగా ముఠాకొట్లాటలకు, హింసకు కేంద్రంగా కనిపించసాగింది. **1994**లో పరిటాల రవి అసెంబ్లీకి ఎన్నికై గతంలో ఏ ఫాక్షనిస్టూ రాయలసీమలో సృష్టించని సంచలనం సృష్టించడంతో ఆ పేరు నిలిచిపోయింది.

## ధర్మవరం

ధర్మవరం పెనుకొండ ఎమ్మెల్యే కనుముక్కల చెన్నారెడ్డి నివాసస్థలం కావడం వలన ముఠా, హింస, దౌర్జన్యాల పాలయిందే తప్ప లేకపోతే అయ్యేది కాదు. ధర్మవరం తాలూకాలోనూ కొన్ని గ్రామాలలో దౌర్జన్యకారులు ఉండేవాళ్లు, ముఠాకొట్లాటలు ఉండేవి. కాని వాటిని తాలూకా

రాజకీయాలలో భాగంచేసి, పోషించి, పెంచి తమ పబ్బంగడుపుకున్న రాజకీయనాయకులు ధర్మవరంలో లేరు. 1994కు పూర్వమున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి గానీ, ప్రస్తుత ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు గానీ ఫాక్షనిస్టులు కారు. (వెంకటనాయుడు తాడిపత్రి తాలూకా ఎల్లనూరు ఫాక్షన్ కొట్లాటను కొంత పులుముకున్నప్పటికీ) ఆ నైజంలేని నాయకులే ఉంటే గ్రామఫాక్షన్లు గ్రామఫాక్షన్లుగానే ఉంటాయి. వాటివల్ల జరిగే హింస పరిమితంగానే వుంటుంది. ఒక గ్రామఫాక్షన్ మరో గ్రామానికి పాకవలసిన అవసరం ఉండదు. గ్రామఫాక్షన్‌లలో సమితి, తాలూకా స్థాయి నాయకులు తలదూర్చి తమ వెవక గుంపును సమీకరించుకోవడానికి వాటిని వాడుకున్నపుడే అవి ఆరని కుంపట్లు అవుతాయి. గ్రామ ఫాక్షనిస్టులకు బయటి అండ దొరకడం వలన ఆర్థిక అవకాశాలూ పెరిగి ఫాక్షన్ ఒదులుకోవలసిన అవసరం లేకుండా పోతుంది. రాజకీయ సరపతి పెరుగుతుంది. గుర్తింపు లభిస్తుంది. ఒక గ్రామంలో రగిలే మంట మరో గ్రామానికి పాకుతుంది. సమితి లేక తాలూకా మొత్తం మండుతుంది. నాయకులు శరవేగంగా రాజకీయ ఆర్థిక వ్యవస్థలలో పైపైకి పోతారు. అనుయాయులు ఎంతో కొంత ప్రయోజనం పొంది ఎప్పుడో ఒకప్పుడు చస్తారు. ఫాక్షన్‌తో ఏ సంబంధం లేని సామాన్య ప్రజలు మాత్రం అన్ని రకాలుగా వష్టాన్ని చని చూస్తారు.

ధర్మవరంలో ఆ పాత్ర నిర్వహించింది ఆ నియోజకవర్గం నాయకులు కాదు. చెన్నేకొత్తపల్లి సమితికీ పెనుగొండ నియోజకవర్గానికీ చెందిన సానె చెన్నారెడ్డి. ఇతని స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల కాగా ఇతను ధర్మవరాన్ని తన నివాసం చేసుకొని చుట్టు పక్కల గ్రామాల వ్యవహారాలలో జోక్యం చేసుకోసాగాడు. అతని కొడుకు ఓబులరెడ్డి 1992 తర్వాత గ్రామాలనుండి రౌడీ మూకను పోగుచేసి ధర్మవరం పట్టణాన్ని నరకప్రాయం చేసాడు.

పరిటాల శ్రీరాములు హత్యకు, పీపుల్స్‌వార్ సానుభూతి పరులపైన దాడులకు, నారాయణరెడ్డితో బాటు చెన్నారెడ్డి కూడ బాధ్యుడేనని పీపుల్స్‌వార్ భావించింది. అతని పట్ల ఆపార్టీకి ఈ కారణంగా శత్రుభావం ఉండింది. అయితే ధర్మవరం మండలంలోని ఓబులనాయుని పల్లి ఘర్షణ కూడ ఈ శత్రుత్వాన్ని పెంచింది. ఆ ఊరిలో గడ్డం పుల్లన్న అనే పెత్తందారు ఉండేవాడు. అతనికి చెన్నారెడ్డి సపోర్టు ఉండేది. అతని ఆగడాలను పీపుల్స్‌వార్ వ్యతిరేకించింది. గ్రామంలో అతనికి వ్యతిరేకంగా నిలబడిన అమరకేశవయ్యకు మద్దతు ఇచ్చింది. ఆ ఊరిలో పుల్లన్నకు వ్యతిరేకంగా ప్రజలను నిలబెట్టడంలో పీపుల్స్‌వార్ కార్యకర్త కేశవనాయక్ ముఖ్యపాత్ర నిర్వహించాడు. అతనిని 1990లో ధర్మవరం ఎస్.ఐ కేశవన్ ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపాడు. ఈ కేశవన్ పూర్తిగా చెన్నారెడ్డి చేతికింది మనిషి. పోలీస్‌స్టేషన్‌లో కంటే చెన్నారెడ్డి ఇంట్లోనే ఎక్కువ ఉండేవాడు. చెన్నారెడ్డి పురమాయింపు మీదనే కేశవన్ కేశవనాయక్‌ను కాల్చి చంపాడని పీపుల్స్‌వార్ భావించింది. నిజానికి అప్పట్లో మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వం నడుస్తున్నది. ప్రభుత్వనిర్ణయం మేరకు తెలంగాణలో సహితం ఎన్‌కౌంటర్లు నిలిచిపోయాయి. అనంతపురం వంటి చోట ఒక ఎస్.ఐ స్వతంత్రించి ఎన్‌కౌంటర్ చేసే పరిస్థితి లేదు.

కనుముక్కల చెన్నారెడ్డి పైన పీపుల్స్‌వార్‌కు అప్పటికున్న పగకు ఇది తోడయి అతని హత్యకు దారి తీసింది. అతనిని 1991 మే 7వ తేదీన పీపుల్స్‌వార్ ధర్మవరంలోని అతని ఇంట్లోనే హత్యచేసింది. ఈహత్య ఆపార్టీ నిర్ణయానికి వ్యతిరేకమనీ, శ్రీరాములు హత్యకు హరిహత్యకూ చెన్నారెడ్డి బాధ్యుడు కాబట్టి అతనిని చంపి ప్రతీకారం తీర్చుకోవాలన్నది పరిటాల కుటుంబం కోరిక అనీ, దానికి అనుగుణంగా పీపుల్స్‌వార్‌లోని ఆకుటుంబానికి సన్నిహితులయిన వారు ఈహత్య చేసారనీ ఒక అభిప్రాయం ఉంది. అయితే ఇప్పుడు మూడుగా చీలిన పీపుల్స్‌వార్ నాయకులను వివరణ అడిగితే మూడు వర్గాల నాయకులు అది పార్టీనిర్ణయం ప్రకారం జరిగిన హత్యేనంటారు. పరిటాల కుటుంబానికీ ఆ పార్టీకీ ఉన్న సంబంధాన్ని గురించి వారిలో తీవ్రమైన అభిప్రాయభేదాలున్నప్పటికీ చెన్నారెడ్డి హత్య విషయంలో ఒకే అభిప్రాయం ఉన్నట్టుంది.

చెన్నారెడ్డి హత్య అనంతరం పెనుకొండకు జరిగిన ఉప ఎన్నికలో అతని పెద్దకొడుకు ఎస్‌వి రమణారెడ్డి ఎంఎల్ఏగా ఎన్నికయ్యాడు. ఆ తరువాత అతని తమ్ముడు ఓబులరెడ్డి ఆగడాలకు ధర్మవరంలో అంతు లేకుండ పోయింది. నక్సలైట్ల వల్ల తమకు ప్రమాదం వుందన్న నెపంతో వీళ్లు ధర్మవరంలో ఒక గుంపును చేరదీసి తమకు అడ్డం వచ్చిన వారందరిపైన దాడులు చేయసాగారు. తెలుగుదేశం వారిపైన, నక్సలైట్ సానుభూతిపరులపైన మాత్రమేకాక సామాన్య ప్రజలపైన కూడ ఓబులరెడ్డి ముఠా దౌర్జన్యాలు చాలా జరిగాయి.

ముఖ్యంగా ఓబులరెడ్డి, అతని రౌడీలు స్త్రీలను అపహరించి బలాత్కరించిన ఘటనలు చాలా జరిగాయి. 1992-94 మధ్య కాలంలో సాయంత్రం చీకటి పడిన తరువాత ధర్మవరంలో స్త్రీలు ఒంటరిగా తిరగలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి ఎనిమిదయితే ఓబులరెడ్డి వర్గానికి చెందిన మూడు ఆటోలు ఊరిలోకి బయలుదేరేవనీ స్త్రీలెవరయినా కనిపిస్తే బలవంతంగా ఎత్తుకు పోయి రేప్ చేసి పొద్దున్న వదిలి పెట్టేవారనీ ఆనాటి భయవాతావరణాన్ని చూసిన వారు అంటారు. దురదృష్టవశాత్తు, ఇటువంటి ఘోరమైన హింసకు గురయిన స్త్రీలపేర్లు చెప్తే వాళ్లకే నష్టం అనే సంస్కృతి బలంగా ఉండడంవల్ల నిర్దిష్టంగా పేర్లు, తారీఖులు తెలుసుకోవడం చాలాకష్టం.

ధర్మవరంలోని లక్ష్మినారాయణ టాకీసు దగ్గర ఉండే ఒక ఇంజనీరు భార్య, రోడ్లోపోతున్న ఓబులరెడ్డిని చూసి ఏదో అని ఉమ్మివేసిందనీ అతను ఆరోజే తాగి ఆమె ఇంటికి పోయి ఆమెను బలవంతంగా ఎత్తుకొచ్చి బంధించి ఉంచి చాలా రోజులు రేప్‌చేసాడని అంటారు. ఈ ఘటన 1993లో జరిగింది. ఆమె భర్త మరుసటి రోజు తన భార్య ఏమయిందని అడగడానికి వాళ్ల ఇంటికి పోతే 'అయిపోయిన తర్వాత పంపిస్తాడులే పో'మ్మని ఓబులరెడ్డి తల్లి జవాబు చెప్పి పంపించిదని అంటారు. పెనుకొండకు ఆవలనున్న సోమందేపల్లి మండల కేంద్రంలోని ఒక నర్సును ఓబులరెడ్డి కిడ్నాప్‌చేసి తీసుకుపోయి పెనుకొండ ఐ.బిలో రేప్ చేసాడని అంటారు. ధర్మవరంలోని సిల్క్‌హౌస్ యజమాని శేషగిరిరావు కుమార్తెను పంపించమని ఓబులరెడ్డి డిమాండ్ చేస్తే పంపించకుండ ఆమెను బెంగుళూరులో దాచిపెట్టి కాపాడినందుకు శేషగిరిరావు నుండి ఓబులరెడ్డి దౌర్జన్యంగా 2 లక్షల 30

వేల రూపాయల జుర్మానా వసూలు చేసుకున్నాడు. స్థానిక పోలీసులు (ముఖ్యంగా ధర్మవరం సి.ఐ కొండారెడ్డి) ఆ కుటుంబానికి ఏజెంట్లుగా మారిపోయి ఎవ్వరికీ రక్షణ ఇవ్వని పరిస్థితిలో, ధర్మవరం ఎ.ఎస్.పిగా వచ్చిన ఐపిఎస్ అధికారి అంజనాసిన్హా ఓబులరెడ్డిపైన క్రిమినల్ కేసులు పెట్టారు. అతని ఇంటిని సోదాచేయడానికి ఆమె స్వయంగా బయలుదేరి పోగా ఓబుల్‌రెడ్డి తల్లి నారాయణమ్మ ఆమెను బండబూతులు తిట్టడమేగాక ఓబుల్‌రెడ్డి చాలా అసహ్యంగా మాట్లాడి ('నాయింటికి వచ్చిన ఏ ఆడదైన నా కింద పండుకోవలసిందే' అని) ఆమెను ఇన్‌సల్ట్ చేసి పంపించాడు.

కమ్యూనిస్టు రాజకీయాలలో ఉన్నవారు ఫాక్షనిస్టులకు వ్యతిరేకంగా పోరాటంచేసి ఆ తర్వాత కమ్యూనిస్టు రాజకీయాలకు దూరమయి ఫాక్షనిస్టు లక్షణాలు సంతరించుకొని, ఎం-ఎల్ పార్టీతో పరిటాల కుటుంబానికి ఉన్న అవినాభావ సంబంధం కారణంగా పరిటాల రవికి దగ్గరయి రవి అండతో ముఠారాజకీయాలు కొనసాగించిన ఉదంతాలు కనగానపల్లి, రామగిరి మండలాలలో ఉన్నట్టే ధర్మవరంలోను ఉన్నాయి.

ప్రస్తుతం ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న షేక్షావలీ అన్న షేక్ ముష్కిన్‌వలీ ఒకప్పుడు ఎం-ఎల్ పార్టీ రైతుకూలీ సంఘం కార్యకర్త. ఒక భూమి పోరాటంలో భాగంగా రావులచెరువు ఫాక్షనిస్టు ఆదినారాయణరెడ్డి కొడుకు భాస్కర్‌రెడ్డి హత్యలో పాల్గొన్నాడు. తరువాత కమ్యూనిస్టు రాజకీయాలకు దూరం అయి కొన్నాళ్లు కాంగ్రెస్‌లోను ఆ తరువాత తెలుగుదేశం పార్టీలోను ఉన్నాడు. విద్యార్థిగా ఉన్న రోజులనుండి అతను చెన్నారెడ్డి కొడుకుల పెత్తనాన్ని వ్యతిరేకించాడు. వాళ్ల గుంపు వాళ్లొకసారి తన వాడలో అల్లరిచేస్తే తరిమికొట్టాడు. అది గమనించిన రవికి అతను సహజంగానే దగ్గరయ్యాడు. రవికి అత్యంత సన్నిహితుడయిన పీపుల్స్‌వార్ కార్యకర్త పోతుల సురేశ్‌కు ('రవి నక్సలైట్లు' గా గుర్తింపు పొందిన రీఆర్గనైజింగ్ కమిటీ వ్యవస్థాపకుడు) కూడా దగ్గరయ్యాడు. చెన్నారెడ్డి హత్య తరువాత రమణారెడ్డి, ఓబులరెడ్డి ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. ముష్కిన్ వాళ్ల పెత్తనాన్ని అప్పటికీ వ్యతిరేకించడంతో అతనిపైన రెండు మూడుసార్లు దాడులు జరిగాయి. ఓబుల నాయనపల్లిలో కేశవనాయక్ ఎన్‌కౌంటర్ తరువాత గడ్డంపుల్లన్నకు భయపడుతున్న ప్రజలకు ముష్కిన్ ధైర్యం చెప్పడం ద్వారా కనుముక్కల పెత్తందార్లకు మరింత కంటగింపయ్యాడు. **1992**లో (ధర్మవరంలో ఓబులరెడ్డి దౌర్జన్యాలు వేగంగా పెరుగుతున్న దశల°) వినాయక చవితి ఉత్సవాలకు అన్ని వీధులవాళ్లు ఓబులరెడ్డిని ముఖ్య అతిధిగా పిలవగా ముష్కిన్ మాత్రం మాల్యవంతంకు చెందిన కమ్మకులస్తుడయిన విజయకుమార్ అనే ఎదుగుతున్న తెలుగుదేశం నాయకుడిని ఆహ్వానించాడు. ఈ ధిక్కారాన్ని ఓబులరెడ్డి సహించ లేకపోయాడు. ఒక వారం రోజుల తరువాత ఒకనాడు ఓబులరెడ్డి వాళ్లు ముష్కిన్‌ను రాజీకి పిలిచారు. ముష్కిన్ వెళ్లాడు. అక్కడ ఓబులరెడ్డితో బాటు మద్దులచెరువు సూర్యనారాయణరెడ్డి (**1997**లో హైదరాబాద్‌లో రవిపైన కారుబాంబు ప్రయోగించడం ద్వారా 'ఖ్యాతి' పొందిన నారాయణరెడ్డి కొడుకు), మేడాపురం శ్రీరాములు

తదితరులున్నారు. వాళ్లు ముష్కిన్‌ను బలవంతంగా జీపులో ఎక్కించి తీసుకుపోయి మేడాపురంలో చంపారు.

ముష్కిన్ హత్యతో అతని అన్నదమ్ములు ధర్మవరం విడిచిపెట్టి మదనపల్లికి పోయారు. ధర్మవరంలో వాళ్లయిల్లు, వాళ్ల టీహోటల్ ఓబుల్‌రెడ్డి మనుషులు కాల్చారు. వాళ్ల అనుచరులయిదుగురిని, (అజాద్, అలీ, జాఫర్, సయ్యద్‌ఖాన్, మరొకరు) పట్టుకొని కాళ్లుచేతులు విరగ్గొట్టారు. వాళ్లకు 'ఇన్‌ఫార్‌మర్'గా పనిచేస్తున్నాడన్న నెపంతో చంద్రప్ప అనే అతడివి చంపారు. వీళ్లుకూడా నారపరెడ్డి, రాజయ్య అనే ఇద్దరిని - ముష్కిన్ హత్యకు సహకరించారని చంపారు. **1992-94** మధ్యకాలంలో ముష్కిన్‌సోదరులు ధర్మవరం తిరిగి రాలేదు. ఇక్కడ ఉన్న వాళ్ల మనుషులు ఓబుల్‌రెడ్డి దౌర్జన్యాలగురించి ఎప్పుడయిన పోలీసులకు ఫిర్యాదు చేస్తే 'కేసుపెట్టి ఇంకా నాశనం అవుతారా' అని సిఐ కొండారెడ్డి వెనక్కి పంపించేవాడు.

**1994**లో పరిటాల రవి రమణారెడ్డిపైన పోటీ చేసినప్పుడు ముష్కిన్ కుటుంబం వెనక్కి వచ్చారు. తరువాత ఓబుల్‌రెడ్డి మొత్తంగా రవికి ధర్మవరాన్ని వదిలిపెట్టి వెళ్లిపోగా ముష్కిన్‌మనుషులు వార్డు కౌన్సిలర్ల పోస్టులు కొన్ని పొందారు. వైస్ చైర్మన్ పదవి షేక్‌షావలికి వచ్చింది. ధర్మవరం వీళ్ల పెత్తనంకిందికి వచ్చింది. అయితే ఆపెత్తనాన్ని వాళ్లు ఇతర బాధితులతో పంచుకోవలసి వచ్చింది. వారిలో కమ్మకులస్తులయిన నాగశేషువంటి వాళ్లనే రవి దగ్గర తీస్తున్నాడని ఇప్పుడు ముష్కిన్ సోదరులు గొణుక్కుంటున్నారు 'ఎక్కువ నష్టపోయింది మేమయితే ఎక్కువ ప్రయోజనం పొందింది కమ్మవాళ్లు' అంటున్నారు.

అయితే ధర్మవరం పౌరులు ఏమంటున్నారంటే ఓబుల్‌రెడ్డి పోయి రవి మనుషులొచ్చారే తప్ప వేరే ఏమొచ్చిందని.

చెన్నారెడ్డి, అతని కొడుకుల దౌర్జన్యాలకు గుంపు సమకూర్చిన గ్రామాలలో మేడాపురం ఒకటి. కనుముక్కలలాగ మేడాపురం కూడ చెన్నేకొత్తపల్లి మండలంలోని గ్రామం. ఆ ఊరికి చెందిన గాండ్ల కులస్తుడయిన శ్రీరాములు ఎదురులేని దౌర్జన్యకారుడూ దొంగతనాలకూ దొంగసారాయి వ్యాపారానికీ ప్రసిద్ధి చెందినవాడు. ఓబులరెడ్డి హయాంలో అతనూ అతని గుంపూ బహిరంగంగానే వేటకొడవళ్లు బాంబులూ పట్టుకొని ధర్మవరం పట్టణంలో తిరిగేవారు.

ఈరకమైన గుంపుల అండదొరికిన ఓబుల్‌రెడ్డి దౌర్జన్యాలకు అంతు లేదు. ధర్మవరంలో మద్యం వ్యాపారం, దొంగవ్యాపారమేకాక సివిల్ కాంట్రాక్టులన్నిటిమీద వాళ్లదే గుత్తాధిపత్యం. వేరే ఎవరికయిన పొరబాటున వదిలిపెడితే వాళ్లు అతనికి 'గుడ్‌విల్' పేరిట రౌడీమామూలు తగుమొత్తం చెల్లించుకోవలసిందే. పద్మశాలీలనుండి, కోమట్లనుండి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసుకొనేవాడు. ఊరిలో ఎవరింట్లో పెళ్లిజరిగినా కట్నంలో సగానికి సమానమయిన మొత్తం ఓబులరెడ్డికి ఇవ్వాలి. ఇతరుల స్థలాలు ఆస్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. ఎదురు మాట్లాడితే ప్రాణాలుపోగొట్టుకోవలసిన పరిస్థితి ఉండింది. 'ఓబులరెడ్డి పెత్తనం చలాయించిన

రోజులలో గుర్తుతెలియని శవం దొరికితే అది మావాడిది అని చెప్పుకొనే ధైర్యం సహితం తల్లిదండ్రులకు లేదు' అని ధర్మవరంకు చెందిన ఒక సీనియర్ న్యాయవాది అంటాడు.

తాడిపత్రిలో దివాకర్‌రెడ్డిలాగా ధర్మవరంలో ఓబులరెడ్డి కూడా కాంగ్రేసేతర పార్టీలను సభలు జరుపుకోనిచ్చేవాడు కాదు. విచిత్రమేమిటంటే 1994 దాకా ధర్మవరం ఎంఎల్ఏ తెలుగుదేశంకు చెందిన నాగిరెడ్డి! కాని ధర్మవరం పట్టణంలో అతనికే స్వేచ్ఛలేదు. ఆ ఊరు పెనుకొండ పాలెగాళ్ల గుప్పిట్లో ఉండింది. 1993లో ఒక సాయంత్రం ధర్మవరంలో ఎంఎల్ఏ నాగిరెడ్డి, తెలుగుదేశం నాయకులు రామచంద్రారెడ్డి (మాజి ఎంపి.), గాదె లింగప్ప (ప్రస్తుతం గుంతకల్లు ఎంఎల్ఏ) తదితరులు నిర్వహిస్తున్న బహిరంగ సభమీద ఓబులరెడ్డి వాళ్లు బాంబువేసి చెదరగొట్టారు. నాయకులు కూర్చున్న వేదిక శామియాన పైన బాంబు పడి ఒక టి.డి.పి అనుచరుడు చనిపోయాడు.

## కుంటిమద్ది, భానుకోట

1992-94 నాటి పరిస్థితి అర్థం చేసుకోడానికి ఒక ధర్మవరం పట్టణాన్నే కాక కనగానపల్లి, రామగిరి మండలాలను కూడా చూడవలసి ఉంటుంది. ఈ మండలాలనుండి చెరి ఒక గ్రామాన్ని తీసుకుని ఆనాటి పరిస్థితిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

కుంటమద్ది రామగిరి మండలంలోని గ్రామం. ఆ ఊరిలో బలిజలు, బోయలు పెద్ద సంఖ్యలో; కమ్మవాళ్లు కొద్దిసంఖ్యలోను ఉన్నారు. అయితే కమ్మవాళ్లు బోయలలో అధికభాగాన్ని రాజకీయంగా తమవైపుకు తిప్పుకొని బలిజలపై ఘర్షణపడేవారు. ఇది దాదాపు 40 ఏళ్ల చరిత్ర ఉన్న ఘర్షణ. రాజకీయంగా కమ్మలు, బోయలు తెలుగుదేశం మద్దతు దారులు కాగ బలిజలు కాంగ్రేస్ అనుకూలురు. గ్రామకక్షల్లో వాళ్లకు పరిటాల శ్రీరాములు మద్దతు, రాడికల్స్ మద్దతు ఉండగా వీళ్లు మద్దుల చెరువు నారాయణరెడ్డి వర్గం. ప్రతిసారి గ్రామపంచాయితీల ఎన్నికలప్పుడు వీళ్లొకరిని వాళ్లొకరిని నిలబెట్టడం, కొట్లాడుకోవడం ఆ ఊరిలో పరిపాటి అయింది. 1989లో కాంగ్రేసేతర పార్టీలు పిలుపు ఇచ్చిన భారత్‌బంద్ సందర్భంగా కాంగ్రేస్ అనుకూలుడైన కృష్ణారెడ్డి రైస్‌మిల్లు బంద్ చేయడానికి తెలుగుదేశంవాళ్లు పోగా ఘర్షణ అయింది. కృష్ణారెడ్డి గొడ్డలి తీసుకొని వీళ్లమీదికి వచ్చాడు. వీళ్లు రాళ్లు వేశారు. అతనిని చంపే ఉద్దేశం వీళ్లకు లేదు గానీ ఆ దెబ్బలకు కృష్ణారెడ్డి నాలుగైదు రోజుల తర్వాత చనిపోయాడు. వీళ్లు అరెస్టయి బెయిల్ తీసుకుని తిరిగొచ్చినపుడు వాళ్లూవీళ్లూ కొంత మందీమార్బలంతో పోలీసులు చూస్తుండగానే బాంబులు వేసుకున్నారు, కాల్చుకున్నారు. తర్వాత కమ్మ, బోయ కులస్తులు ఊరి నుండి బయటికొచ్చి ఉండసాగారు. అయితే కొంతకాలానికి బలిజలు గ్రామంలో ఉన్న వీళ్ల ఇళ్లపై దాడిచేసి పశువుల కొట్టాలు, ఇళ్లు, ఇళ్లలో ఉన్న శెనక్కాయలు కాల్చేసారు. చెన్నారెడ్డి వర్గానికి చెందిన మేడాపురం శ్రీరాములు, పెనుబోలు (పెరుగు) ఫకీర్‌రెడ్డి ఈదాడికి నాయకత్వం వహించారని తెలుగుదేశంవాళ్లు అంటారు. ఈవర్గం పూర్తిగా ఊరు వదిలిపెట్టి ప్రవాసం పోయారు. వర్షాకాలంలో పొలంపనులు చేసుకునే ఉద్దేశంతో

వీళ్ళు వెనక్కి రావడం, మళ్లీ బాంబులు వేసుకోవడం, ఘర్షణపడటం నాలుగైదుసార్లు జరిగింది. వీళ్లులేని సమయంలో బలిజలు ఊరిలో వీళ్లకు మిగిలి ఉన్న ఆస్తులను లూటీచేయడం, బోర్లు పూడ్చటం జరిగింది. తమకు మొత్తంమీద దాదాపు ఒక కోటి రూపాయల నష్టం జరిగిందని వీళ్లంటారు. దాదాపు ఐదు సంవత్సరాల ప్రవాసంలో (1989 నుంచి 1994 వరకు) వీళ్లకు పరిటాల రవి, మరొకవైపు పీపుల్స్‌వార్ తిండిగింజలు, బట్టలు సేకరించి ఇచ్చారు. వీళ్లను గ్రామంలో దింపి రావడానికి రాడికల్స్ రెండుసార్లు ప్రయత్నంచేశారు. కొంతమంది బోయలతో కలిసి కుంటిమద్ది బలిజలపైన బాంబులతో దాడి చేశారు. అయితే వాళ్లు కాల్పులు జరిపి, వీళ్లను వెనక్కి తరిమేసి ఆ ప్రయత్నాన్ని సాగనివ్వలేదు.

## *1994 తర్వాత కుంటిమద్ది*

*1994 ఎన్నికల తర్వాత కుంటిమద్ది శరణార్థులు వెనక్కి రాగలిగారు. ఆ ఎన్నికలలో పెనుకొండ ఎమ్మెల్యేగా గెలిచిన రవి సహాయంతో వాళ్లకు ఊరి బయట ఇళ్లకాలనీకి స్థలమూ, రుణాలూ మంజూరయ్యాయి, రాష్ట్రంలో అగ్రవర్ణాలకు చెందిన వారికి ప్రభుత్వం ఇళ్లకాలనీ మంజూరు చేసిన ఏకైక ఘటన కుంటిమద్దే కావొచ్చు. రాజకీయంగా కూడ వాళ్లకు మంచిరోజులు వచ్చాయి. రవి గెలిచిన కొద్దినెలలకే కుంటిమద్ది బలిజలు రాజీకి వచ్చారు. (వాళ్లలో కొందరిని రవి కట్టేసి కొట్టి రాజీకి రప్పించాడని, గ్రామంపైన గుండాలతో దాడి చేయించి రాజీకి రప్పించాడని అభియోగం ఉంది). ఏమైతేనేం రవి ఎమ్మెల్యే అయిన కొద్దిరోజులకే కుంటిమద్ది గ్రామమంతా రవి మనుషులే అయిపోయారు. ఇది రవికి చాలా లాభించింది. అతను తెలుగుదేశం నాయకులపైన అలిగి రాజీనామాచేసి, 1995లో రెండవసారి పోటీ చేసినపుడు కుంటిమద్దిలో అతని కొత్త అనుచరులు ఊరిలో ఉండి అతనికి అనుకూలంగా రిగ్గింగ్ చేస్తే, పాత అనుచరులు వాళ్లమీద భరోసా ఉంచి రిగ్గింగ్‌చేయడానికి వేరే గ్రామాలకు పోయారు!*

భానుకోట కనగానపల్లి మండలంలోని ఒక గ్రామం. ఆ ఊరిలో ఒకపక్క గొల్లలకు, మరోపక్క బోయలకు 25 ఏళ్లుగా ముఠాకొట్లాట ఉంది. బోయలకు పెద్దారెడ్డి అనే రెడ్డి కులస్తుడి మద్దతు ఉంది. అతను మద్దులచెరువు నారాయణరెడ్డి మనిషి. గొల్లలు శ్రీరాములుకు, కమ్యూనిస్టులకు అనుకూలంగా ఉండేవారు. 1970లలో వాళ్లొక హత్య, వీళ్లొక హత్య చేసుకున్నారు. 1988-89లో నక్సలైట్లు సివాయిజమా భూముల పోరాటం మొదలుపెట్టినపుడు మొదట బోయలే నక్సలైట్లతో చేరి గొల్లల దగ్గరున్న సివాయిజమా భూముల కోసం పోరాటం చేపట్టారు. అయితే 1990 తర్వాత గొల్లలే నక్సలైట్లకు చేరువయ్యారు. బోయలు తిరిగి కాంగ్రెస్‌వైపు పోయారు. 1991లో చెన్నారెడ్డి హత్య తర్వాత భానుకోట బోయ కులస్తులు

మద్దుల చెరువు సూర్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి ప్రోద్బలంతో గొల్లల ఇళ్లపైన దాడిచేసి ధాన్యం, బట్టలు ఎత్తుకుపోయారు. అడ్డం వచ్చిన వాళ్లను రాళ్లతో కొట్టి కాళ్లూచేతులు విరిచారు. గొల్లలలో చాలామంది అప్పుడు ఊరు విడిచిపెట్టి వెళ్లిపోయారు. 1994లో రవి అసెంబ్లీకి పోటీ చేసినపుడు అతని మద్దతుతో గ్రామంలోకి తిరిగి వచ్చి అతనిని గెలిపించుకున్నారు.

ఇదే దశలో వేపకుంటకు చెందిన వారాది, పాతపల్లికి చెందిన వెంకటరాముడు అనే ఇద్దరు పీపుల్స్‌వార్ మద్దతుదార్లను మద్దుల చెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అతని ముఠామనుషులు కిడ్నాప్ చేసి, హత్య చేశారు. ఈ ఘటన రామగిరి, కనగానపల్లి మండలాలలో వాళ్లకు వ్యతిరేకంగా ఉన్నవాళ్లందరినీ విపరీతంగా భయానికి గురిచేసింది. బహుశా దీనికి ప్రతీకారంగానే 1993 చివరి భాగంలో మద్దుల చెరువు గ్రామంలో టి.వి బాంబు ఉపయోగించి ఐదుగుర్ని హత్యచేయడం జరిగింది. రిపేరుకి యిచ్చిన టి.విలో బాంబుపెట్టి వెనక్కి పంపించడంతో టి.వి. స్విచ్చి వేయగానే నారాయణరెడ్డి భార్య శాకమ్మ, కుమార్తె పద్మావతి, కొడుకు రఘునాథరెడ్డి, కురుబ చంద్రశేఖర్, బోయ నారాయణ చనిపోయారు. సాంకేతికంగా ఆధునికమైన ఈ రకమైన హత్యాకాండ రాయలసీమకు కొత్త. అప్పటికీ పీపుల్స్‌వార్ కె.ఎస్. నర్గం నుంచి బయటికొస్తున్న పోతుల సురేశ్ సహకారంతో పరిటాల రవి ఈ హత్య చేయించాడు.

## 1994

1994 అసెంబ్లీ ఎన్నికలు అనంతపురం ఫాక్షన్ రాజకీయాలలో పెనుమార్పును తీసుకొచ్చాయి. 'నక్సలైటు'గా గుర్తింపు ఉన్న పరిటాల రవి తెలుగుదేశం అభ్యర్థిగా పెనుకొండలో ఎస్.వి. రమణారెడ్డిపైన పోటీకి దిగాడు. అతనికి నక్సలైటుగా గుర్తింపు ఉండడమే కాక అతని వెనక పోతుల సురేశ్ నాయకత్వంలో నక్సలైటు గ్రూపు ఉంది. అప్పటివరకు పెనుకొండ నియోజకవర్గంలో కనుముక్కల, మద్దుల చెరువు రెడ్ల దౌర్జన్యాలకు గురైన వారంతా రవి వెనక చేరారు. అందులో గుంపుకు పనికొచ్చే పేదవాళ్లే కాక డబ్బు, పరపతి ఉన్న కమ్మకులస్తులైన రైతులు, భూస్వాములు కూడ ఉన్నారు. దెబ్బతిన్న వాళ్లందరినీ తిరిగొచ్చి రమణారెడ్డిని ఓడించడానికి సహకరించమని రవి పిలుపిచ్చాడు.

1970లలోనూ 1980లలోనూ సిపిఐ (ఎం-ఎల్)కు పరిటాల కుటుంబంతో ఉన్న సన్నిహితసంబంధం గురించి ఇప్పటికే చెప్పి ఉన్నాము. పార్టీనాయకులు వాళ్ల ఇంట్లోనే ఉండడం, వాళ్లను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవడం, శ్రీరాములు కాలం నుండి ఆకుటుంబానికి ఉన్న ఘర్షణలను తమ ఉద్యమానికి సంబంధించిన విషయాలుగా భావించడం, శ్రీరాములు వెనుక గుంపుకట్టిన ప్రజలను పార్టీ ప్రజాశ్రేణులుగా భావించడం జరిగింది. 1990 తర్వాత పీపుల్స్‌వార్‌లో జరిగిన అంతర్గత చర్చలో ఈ విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆపార్టీలో 1992లో ఒకసారి, 1993 చివరిభాగంలో ఒకసారి వచ్చిన చీలికలో ఈ చర్చ ఒక ముఖ్యాంశంగా ఉండింది. 1992లో

గణపతివర్గం–కెవిస్ వర్గంగా చీలగా 1993లో కెవిస్ వర్గం నుండి పోతుల సురేశ్ నాయకత్వంలో రీఆర్గనైజేషన్ కమిటీ (ఆర్‌ఓసి) బయటికొచ్చింది.

1994 అసెంబ్లీ ఎన్నికలలో ఆర్‌ఓసి బహిరంగంగానే పరిటాల రవికి మద్దతు ప్రకటించింది. రవి ఏ భూస్వామ్య శక్తులతో ఈ ఎన్నికలలో తలపడుతున్నాడో వారు పార్టీకీ పార్టీనడుపుతున్న పోరాటానికీ కూడ శత్రువులనీ, వారిని ఓడించడం అవసరమనీ రవి వెనక ఉన్న ప్రజలలో ఎక్కువ భాగం పార్టీతో ఉన్న ప్రజలేననీ ఆర్‌ఓసి వ్యాఖ్యానించింది. ఒకరకంగా ఏ చరిత్ర అయితే ఆ పార్టీలో విమర్శకు గురి అయిందో ఆ చరిత్రను మొత్తంగా భుజానికెత్తునింది ఆర్‌ఓసి. 1994లో రవి గెలిచాడు. తరువాత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం మీద అలిగి రాజీనామా చేసాడు. ఎన్నికల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నానన్నాడుగానీ అనుచరుల ఒత్తిడి మీద మళ్లీ పోటీ చేయాలని నిర్ణయించుకున్నాడు. (1994 గెలుపుతో బలహీనపడిన ప్రత్యర్థులు తన రాజీనామా తరువాత మళ్లీ విజృంభించే ప్రయత్నం చేయడం గమనించి తన నిర్ణయం మార్చుకున్నానని కూడ అంటాడు. దీనికి ఉదాహరణగా, తన రాజీనామా తరువాత ధర్మవరంలో మాజీ రాడికల్స్ భూసేనాయక్ – ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన కేశవనాయక్ తమ్ముడు – హత్యను చూపిస్తాడు.)

1995లో జరిగిన పెనుకొండ అసెంబ్లీ ఉప ఎన్నికలో రవి స్వతంత్ర అభ్యర్థిగా ఎస్.వి రమణారెడ్డిపైన పోటీ చేసాడు. పెనుకొండ ప్రజలు ఆ ఎన్నికను ఇప్పటికీ మరిచిపోరు. రవి మనుషులు అంత బహిరంగంగా అక్రమాలకు పాల్పడ్డారు. అంత భయోత్పాతం సృష్టించారు. ఈరెండు ఎన్నికలలోను రవికి అనుకూలమైన గ్రామీణ గ్రూపులేకాదు, ఆర్‌ఓసి కార్యకర్తలు కూడ రిగ్గింగ్ చేయటానికి టీంలుగా ఏర్పడ్డారు.

అయితే 1994 ఎన్నికల నాటికే ఒక కొత్త ఫాక్షనిస్టు ఆవిర్భవించాడన్న సంకేతం అందింది. 'టివి బాంబు' తప్పించుకున్న మద్దుల చెరువు సూర్య నారాయణరెడ్డి ఆ ఎన్నిక రోజు మధ్యాహ్నం 3 గంటల దాకా గ్రామంలో ఉన్నాడు. అప్పటికి పరిస్థితి అర్థమయిపోయింది. నెమ్మదిగా గ్రామం నుండి బయటపడి బెంగుళూరు చేరుకున్నాడు. బెంగుళూరులో కూడ రహస్యంగానే బతికాడు. 1997లో హైదరాబాద్‌లో రవిపైన కారు బాంబు ప్రయోగించినప్పుడే అతని పేరు మళ్లీ వినపడింది. ఓబులరెడ్డి మాటకొస్తే నరరూప రాక్షసుడిగా పేరుపొందిన ఇతను తన అన్న రవిచేతిలో ఓడిపోయాడని తెలియగానే ధర్మవరాన్ని రవికీ రవి మనుషులకు విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఒక సంవత్సరం తరువాత మారువేషంలో వచ్చి ధర్మవరం కోర్టుకు సరండర్ అయ్యాడు. 1996 జులైలో హైదరాబాద్‌లో ఆర్‌ఓసి చేతిలో హతమయ్యాడు. అతని అన్న రమణారెడ్డి కూడ 1995లో రవి చేతిలో రెండవ సారి ఓడిపోయిన తరువాత జిల్లా వదిలి పెట్టి హైదరాబాద్‌లోనూ బెంగుళూరులోనూ ఉంటూ వ్యాపారాలు చూసుకోసాగాడు. 1998 ఆగస్ట్ 22 రాత్రి హైదరాబాద్‌లో హత్యకు గురయ్యాడు. అతనిని ఎవరు చంపిందీ పోలీసుల ఇప్పటిదాకా చెప్పలేక పోయారు గానీ ఆర్‌ఓసికీ పరిటాల రవికీ తప్పవేరే ఎవ్వరికీ అతనితో అంతటి శత్రుత్వం ఉన్నట్టు

ఇప్పటిదాకా తెలీదు.

వీళ్లను మాత్రమే కాదు. రవి వర్గానికీ పీపుల్స్‌వార్‌కూ శత్రువులయినవారి జాబితా ప్రకటించి వీరందరినీ చంపుతామని ఆర్‌ఓసీ హెచ్చరించింది. వారిలో ఒకడయిన మేడాపురం శ్రీరాములు 1997లో పెనుకొండ కోర్టు దగ్గర హతమయ్యాడు. అంతకు చాలా ముందు - 1992లోనే - ఓబులనాయునిపల్లి ముఠానాయకుడు, చెన్నారెడ్డి అనుచరుడు అయిన గడ్డం పుల్లన్న జీపును మందుపాతర పెట్టి పేల్చేసి అతనినీ మరిద్దరినీ చంపారు. ఈ హత్యలలో ఒక్కొక్కటీ రవి చేసాడా లేక ఆర్‌ఓసీ చేసిందా అని తర్కించి పెద్దగా ప్రయోజనం లేదు. వీళ్లందరూ పరిటాల వర్గానికీ శత్రువులు, పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో నడిచిన పోరాటానికీ శత్రువులు. అవి రెండు అంతగా పెనవేసుకుని పోయాయి. ఈ సంబంధాన్ని సబబయినదిగా భావించే పోతుల సురేశ్ వర్గం ఆలోచనకూ రవి ఆలోచనలకూ తేడా వెతకడం అనవసరం. ఆర్‌ఓసికి పరిటాల రవికీ వున్న సంబంధంలో రహస్యమేమీ లేదు. రవి సహితం పార్టీగా తనకు ఆర్‌ఓసీతో సంబంధం లేదని అంటూనే పోతుల సురేశ్‌తో తనకు భావసారుప్యత ఉందనీ పెనుకొండ రాజకీయాల గురించి ఇద్దరి అభిప్రాయాలూ తరుచుగా కలుస్తాయనీ అంటాడు. సురేశ్ కూడ తన పార్టీకి రవితో సంబంధమేమీ లేదంటూనే, రవి ప్రజలపై పెత్తనం చేయడం లేదనీ కేవలం రెడ్డి పెత్తందార్లను చెదరగొడుతున్నాడనీ అతనికి మద్దతు ఇవ్వడంలో తప్పు లేదనీ అంటారు.

ఈ వాతావరణంలో రవి ప్రత్యర్థులలో ఎంత భయం నెలకొనిందంటే ఆ తరువాత వచ్చిన మునిసిపల్ ఎన్నికలలోనూ పంచాయితీ ఎన్నికలలోనూ తాడిపత్రి, పెనుకొండ మునిసిపాలిటీలలోనూ తాడిపత్రి, పెనుకొండ గ్రామాలలోనూ అత్యధిక భాగం ఏకగ్రీవంగా రవి ఎంపిక చేసిన మనుషులు - పేరుకు తెలుగుదేశం కార్యకర్తలు - ఎంపిక అయ్యారు. కొద్దినెలల గడువులో జిల్లా రాజకీయ చిత్రం పూర్తిగా మారిపోయింది. ఒక కొత్త ఫాక్షనిస్టు ముందుకు రాగానే పాతవాళ్లు ఇంత సంపూర్ణంగా చేతులు ఎత్తేసిన ఉదంతం రాయలసీమ రాజకీయాలలో ఎప్పుడూ లేదు. దీనికి ప్రధాన కారణం రవికి 'నక్సలైట్' గా ఉన్న పేరు, అతనికి ఉన్న 'నక్సలైట్' సంబంధాలు.

పరిటాల రవి మాత్రం తాను ఫాక్షనిస్టును కానంటాడు. తన తండ్రి కాలం నుండి తాము ఎదుర్కొంటున్న పెత్తందార్లు నారాయణరెడ్డి, చెన్నారెడ్డిల హత్య తరాత వెనక్కి తగ్గకపోగా మరింత, ముఖ్యంగా చెన్నారెడ్డి హత్య తర్వాత విజృంభించారనీ, వారి దాడికి గురయిన ప్రజలు మొదటినుండి కమ్యూనిస్టు పార్టీ ప్రజలయినప్పటికీ వాళ్లను కాపాడటంలో పీపుల్స్‌వార్ విఫలమైందనీ, అందువల్ల తన ప్రజలను రక్షించుకోవడం కోసం తాను తెలుగుదేశం పార్టీలో చేరి ప్రత్యర్థుల దౌర్జన్యాలను ఎదుర్కొనవలసి వచ్చిందనీ అంటాడు. రవి ఎదుర్కొన్న పెత్తందార్లు దుర్మార్గులనడంలో సందేహమేమీ లేదు. కాని వారిని ఎదుర్కొనడానికి రవి అనుసరించిన పద్ధతులు ఫాక్షనిస్టు పద్ధతులే. ఆ పెత్తందార్ల వలన నష్టపోయిన వ్యక్తులను మంచీచెడూ చూడకుండా చేరదీసి గుంపు చేయడం, వారు ఏ పద్ధతిలో పోరాడ గలిగితే ఆ పద్ధతిలో పోరాడమని ప్రోత్సహించడం, హత్యలు చేసినా ఇళ్లు కాల్చినా

## మళ్లీ పెనుబోలు

*1994*కు పూర్వం కుంటిమద్ది, భానుకోట వంటి గ్రామాలలో పరిటాల వర్గం లేక నక్సలైట్ సానుభూతిపరులయిన ప్రజలు గ్రామం ఖాళీచేసి ప్రవాసం పోయినట్టే *1994* తరువాత పెనుబోలులో రవి వ్యతిరేక వర్గం వలసపోయారు.

పరిటాల శ్రీరాములుకు చెన్నారెడ్డి, నారాయణరెడ్లకూ భౌతికఘర్షణ పెనుబోలులోనే మొదలయిందని వివరించాము. *1988* లో పెరుగు నారప్ప కొడుకులలో ఒకడయిన ఫకీర్‌రెడ్డి సైన్యం నుండి తిరిగి వచ్చాడు. అతను తిరిగి వచ్చిన తరువాత నారప్ప కొడుకులు పెనుబోలును అదే పంచాయితీలోని కలికివాండ్లపల్లినీ *1994* దాకా తమ గుప్పిట్లో పెట్టుకొని ఏలారు. ఆప్రాంతంలో తుపాకి పట్టుకుని బాహాటంగా తిరిగిన మొదటి వ్యక్తి ఫకీర్‌రెడ్డి అంటారు. *1989-90* కాలంలో తాము గ్రామాన్ని చాలా బాగా కట్టడి చేసామనీ ఎన్నడూ లేని క్రమశిక్షణ నెలకొల్పామనీ ఫకీర్ రెడ్డే అంటాడు. దీని భావాన్ని సులభంగానే ఊహించుకోవచ్చు. ఆగ్రామంలోనే కాక చుట్టుపక్కల కూడ చెన్నారెడ్డి వర్గం జరిపిన దాడులలో ఫకీర్‌రెడ్డి తుపాకి పట్టుకొని పాల్గొనేవాడు. అతని తమ్ముడు పెరుగు వెంకటేశ్వర్లు కలికివాండ్ల పల్లిలో తాగి రౌడీయిజం చేసేవాడు.

సానె చెన్నారెడ్డి హత్య తరువాత వీళ్లకు రాడికల్స్ నుండి ప్రాణభయం ఉందని చెప్పి ప్రతి రోజూ కనీసం వందమంది గ్రామస్తులు వచ్చి తమకు కావలాగా పడుకోవాలని నియమం పెట్టారు. ఒప్పుకోని వాళ్ళను తన్నేవారు. *1994* ఎన్నికలపుడు ఈ గ్రామానికి రవి ఒక ఏజెంటును పంపించాడు. అతని పేరు శ్రీరాములు. ఫకీర్‌రెడ్డి వర్గం అతనిని కిడ్నాప్ చేసి చంపి పోలింగ్‌బూత్‌కు కొద్ది దూరంలో పూడ్చిపెట్టారు. శవం కొద్దిగా కనబడుతూనే ఉన్నా మధ్యాహ్నం రవి స్వయంగా పెనుబోలుకి వచ్చేదాకా దాని దగ్గరికి పోవడానికి కూడ ఎవరూ సాహసించలేదు.

ఎన్నికల సమయంలోనే ఫకీర్‌రెడ్డి బంధువయిన ఆదిరెడ్డిని గంతిమెరికి చెందిన వెంకటనారాయణ శెట్టిని మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ దగ్గర రవి మనుషులు చంపారు. వాళ్లిద్దరూ హైదరాబాద్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్నారని వాళ్లను కిడ్నాప్ చేసి చంపారు.

రవి గెలిచిన తర్వాత ఆర్.ఒ.సి. నక్సలైట్లు పెరుగు వెంకటేశ్వర్లు ఇంటిని, పెరుగు ఫకీర్‌రెడ్డి ఇంటిని పేల్చేశారు. ఈ అన్నదమ్ముల్లో ఒకడైన పెరుగు లక్ష్మిరెడ్డిని *1995*లో చంపారు. ఇప్పుడు ఫకీర్‌రెడ్డితో సహా *60* లేక *70* కుటుంబాలు పెనుబోలును విడిచిపెట్టి ధర్మవరంలోను, ఇతర ప్రాంతాలలోనూ ఉంటున్నారు.

వెనకేసుకు రావడం, రౌడీ మామూళ్లు వసూలు చేసుకుని దొంగసారాయి అమ్ముకొని సివిల్ కాంట్రాక్టులు దౌర్జన్యంగా చేజిక్కించుకొని గుంపును పోషించుకోమని ప్రోత్సహించడం, తాను కూడ బలవంతపు వసూళ్ల నుండి, దౌర్జన్యంగా చేజిక్కించుకున్న కాంట్రాక్టుల నుండి ఆస్తి సంపాదించుకోవడం, ఎన్నికలలో భారీగా రిగ్గింగ్ చేయడం, అందరినీ బెదిరించి తన వర్గంవారిని ఏకగ్రీవంగా ఎన్నిక చేయించడం – యివన్నీ ఒక పెత్తనం స్థానంలో మరొక పెత్తనాన్ని నెలకొల్పడం ద్వారా పెత్తనంపై 'పోరాటం' చేసే పద్ధతులు. పాత పెత్తందార్ల కంటే కొత్త పెత్తందార్లు కొంచెం

తక్కువ దుర్మార్గులా అనేది చర్చ కాదు. వాళ్ళ దేవు ఏదయినా కావచ్చు.

ఇదంతా 'తప్పనిసరి' అనీ, రెడ్ల దౌర్జన్యాన్ని ఎదుర్కొనడానికి వేరే మార్గమేదీ లేదనీ రవి అంటాడు. పరిటాల రవికి వచ్చిన కమ్యూనిస్టు పరిభాష అందరికీ రాదుగానీ ఫాక్షనిస్టులు అందరూ అనేది ఇదే. రాయలసీమ ఫాక్షనిస్టులెవరూ తాము ఇష్టపూర్వకంగా ఫాక్షన్‌లోకి దిగామని అనరు. ఎదుటివారి దౌర్జన్యాలకు గురైన వారిని ఆదుకోవడానికి వేరే మార్గంలేక దిగామంటారు. పరిటాల శ్రీరాములి ఫాక్షనిజంలో కనీసం భూమి సమస్య, రెడ్ల సాంఘిక పెత్తనం వంటి కొన్ని న్యాయమైన ప్రజాసమస్యలు ఇమిడి ఉన్నాయి. రవి సాగిస్తున్న ఫాక్షన్ పోరాటంలో ప్రత్యర్థులను అణచివేసి తన అండ కోరినవారి ఆధిపత్యం నెలకొల్పడం అన్న ఏకైక లక్ష్యం తప్ప వేరే ఏమీ లేదు. అతను చేరదీస్తున్న వ్యక్తులు అతను పోరాటం చేస్తున్న ప్రత్యర్థుల కంటే ఏమంత ప్రజాస్వామ్య స్వభావం గలవాళ్ళు కారు. దుర్మార్గంలో అందరూ ఓబుల రెడ్లు కాకపోవచ్చుగాక, వీళ్ల దౌర్జన్యాల గురించి, దొంగసారా అమ్మకం గురించి, బలవంతపు వసూళ్ల గురించి అనంతపురంలో నిత్యం ఫిర్యాదులు వినబడుతూనే ఉన్నాయి. వీటి గురించి రవిని అడిగితే తనకు తెలియకుండా తన అనుయాయులు ఏమైనా చేస్తుండ వచ్చుననీ, దానికి తాను బాధ్యుడ్ని కాననీ సమాధానం చెపుతాడు. ఆ సమాధానం వై.ఎస్. రాజశేఖర్ రెడ్డితో సహా ఫాక్షనిస్టులందరూ చెప్పేదే. అనుయాయులు నాయకులకు తెలియకుండా తప్పుడు పనులు చేస్తే చేయవచ్చును గానీ దాని వల్ల సమస్యలొస్తే నాయకుడు కాపాడతాడనే భరోసాతోనే చేస్తారు. అందువల్లే సమాజం వాటిని సాగనిస్తుంది.

## ముగింపు

తాడిపత్రి, పెనుకొండ ఫాక్షన్ల గురించి విడివిడిగా చెప్పాము. తాడిపత్రి సమీపంలో లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టి) వాళ్లు కొత్తగా నిర్మించిన భారీ సిమెంట్ ఫ్యాక్టరీని వీళ్లు వాళ్లూ కలిసి పీక్కుతిన్న వైనం వివరించడం ఈ నివేదికకు ఉచితమైన ముగింపు అవుతుంది.

సిమెంటు పరిశ్రమకు మనరాష్ట్రంలో నల్గొండ, కృష్ణ, గుంటూరు జిల్లాలు కలుసుకునే ప్రాంతం ప్రధాన కేంద్రంగా వుంది: అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల ఉమ్మడి సరిహద్దు ప్రాంతంలో కూడ అందుకు కావలసిన సున్నపురాయి నిక్షేపాలున్నాయి. అయినప్పటికీ అక్కడ సిమెంట్ పరిశ్రమ పెద్దగా అభివృద్ధి చెందలేదు. దీనికొక కారణం ఫాక్షనిస్టులంటే పెట్టుబడిదార్లకుండే భయం. ఇక్కడ ఫ్యాక్టరీ పెడితే దాని నిర్మాణంతో మొదలుపెట్టి నిర్వహణ దాకా ఈ పాలెగాళ్ల జోక్యాన్ని భరించాలి. వాళ్ల బలవంతపు వసూళ్లు చెల్లించడమే కాదు కాంట్రాక్టులు వాళ్లకే ఇవ్వాలి, కార్మిక సంఘాల నాయకులుగా వాళ్లనే భరించాలి, వాళ్ల లారీలు, ట్రాక్టర్లే రవాణా కోసం ఉపయోగించాలి. కాదంటే దెబ్బలు తినాలి. 'లార్సెన్ అండ్ టూబ్రో' వాళ్లు తాడిపత్రి దగ్గర నిర్మించిన సిమెంట్ కంపెనీని ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇది రాష్ట్రంలోనే అతి పెద్ద సిమెంట్ ఫ్యాక్టరీ. దీని నిర్మాణం పనుల దగ్గరినుండి పరిటాల రవి, దివాకరరెడ్డి, సూర్యప్రతాప రెడ్డిల జోక్యం మొదలయింది. ఫ్యాక్టరీ బిల్డింగు నిర్మాణం, రోడ్ల నిర్మాణం, ఫ్యాక్టరీని తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు కలిపే రైల్వేలైను నిర్మాణం, అన్నిటి కాంట్రాక్టూ తమకే ఇవ్వాలని బెదిరించి తీసుకున్నారు.

అందరికంటే ఎక్కువ తీసుకున్నదీ ఎక్కువ లాభం పొందినదీ పరిటాల రవి. సివిల్ కాంట్రాక్టుల మీద దాదాగిరీ చేయడం ఇతని ప్రధాన ఆదాయమార్గం. కంపెనీ తరఫున నిర్మాణం పనులు చూసుకునే అధికారి కొత్తగా కార్యాలయం పెట్టుకొని సెక్యూరిటీ సిబ్బందిని నియమించిన తొలి రోజులలోనే రవి జీపులో మనుషులను తీసుకొనిపోయి సెక్యూరిటీ సిబ్బందిని కొట్టి లోపలికి ప్రవేశించాడు. దబాయించి పనులు తీసుకున్నాడు. అతని తరఫున ఈ వ్యవహారాలు చూసుకునే వ్యక్తి యాడికి మండలాధ్యక్షుడు బాబు అని పిలవబడే చంద్రశేఖర్. అతను రవికి బంధువు.

రవి వెనుకనే దివాకరరెడ్డి, పేరం నాగిరెడ్డి, సూర్యప్రతాపరెడ్డి కూడ ప్రవేశించారు. మామూలుగా కాంట్రాక్టర్ 'మార్జిన్' 25 శాతం మించి వుండదుగానీ వీళ్లు 50 శాతం దాకా తీసుకున్నారని ఒక అంచనా. ఇదంతా భరించకతప్పదని కంపెనీ భరించిందిగానీ నాణ్యత విషయంలో అజాగ్రత్తగా వుండలేదు కాబట్టి కల్తీ లేకుండ చూసుకున్నారంటారు. (అయినప్పటికీ కంపెనీ సరఫరా చేసిన మెటీరియల్‌లో పెద్ద మొత్తమే బయటికి తరలించబడిందని స్థానికుల అభిప్రాయం).

ఈ పెద్ద పాలెగాళ్ల వెనక చిన్న పాలెగాళ్లు కూడ ప్రవేశించారు. ఏ ఊరి రెడ్డయినా రెండు జీపులేసుకొని పోయి దబాయిస్తే ఒకటో రెండో లక్షల పని తప్పక దొరికేది. కోవెలకుంట్ల తాలూకా గుండ్ల సింగవరం వాళ్లయితే పని మంజూరు చేయించుకున్నాక అది పూర్తికూడ చేయకుండ బెదిరించి బిల్లు చేయించుకొని పోయారు.

ఆ తరువాత ఉద్యోగ నియామకాలలోనూ వీళ్ల దాదాగిరీ నడిచింది. ఈ పాలెగాళ్లు చెప్పిన వాళ్లందరికీ కంపెనీ పనులిచ్చింది. ఇయ్యలేనప్పుడు బతిమాలి ఎంతో కొంత చెల్లించి పంపించింది. ఎక్కువ ఉద్యోగాలు రవి తరఫున వచ్చిన యాడికి మండలాధ్యక్షుడు బాబు మంజూరు చేయించుకున్నాడు.

ఇప్పుడు కంపెనీ ఉత్పత్తి మొదలుపెట్టింది. ఇంక నిర్మాణ పనులుండవుగానీ ముడిపదార్థం దింపే పని, సిమెంటు రైళ్లలోకీ లారీల లోకీ ఎక్కించే పని, ప్యాకింగ్ వుంటాయి. ఈ పనులకు పర్మనెంట్ ఉద్యోగులను నియమించకుండ కాంట్రాక్టుకు ఇవ్వడం సిమెంట్ కంపెనీల అలవాటు. ఎల్ అండ్ టి ఈ పనులు ప్రస్తుతానికి స్థానిక గ్రామాల రెడ్లకే ఇచ్చిందిగానీ ఈ రాబందులు ఎప్పుడో ఒకప్పుడు రంగంలోకి దిగక మానరు.

ఎల్ అండ్ టి కాంట్రాక్టులలో పరిటాల రవి ఎంత లేదన్నా 5 కోట్లు సంపాదించుకున్నాడని అంచనా (అతనొప్పుకోడని వేరే చెప్పనవసరం లేదు). తీసుకున్న కాంట్రాక్టులన్నీ చేసి సంపాదించాడని కూడ అనుకోనక్కర లేదు. చేస్తే చేయవచ్చు, లేకపోతే వేరొకరికి అమ్ముకోవచ్చు. రవి, దివాకరరెడ్డి ఈ విధంగా చాలా అమ్ముకున్నారు. ఇది వీళ్లకు కొత్త కాదు. వీళ్ల ప్రధాన ఆదాయమార్గం (ముఖ్యంగా రవికి) కాంట్రాక్టులు చేయడం కంటే వాటిమీద దాదాగిరీ చేయడం. వీళ్లకు కమిషన్ చెల్లించినవాళ్లే టెండర్లు వేయగలరు, కాంట్రాక్టులు తీసుకోగలరు. జిల్లావ్యాప్తంగా సాగుతున్న ఈ తంతుకు ఎల్ అండ్ టి ఒక పెద్ద అవకాశం ఇచ్చింది. ఎటొచ్చీ ఇక్కడ కొంతపని చేసి, కొంత పని వేరేవాళ్లకు అమ్ముకొని కోట్లు సంపాదించుకున్నారు.

## KARUVU JILLALO KOTHA PALEGALLU Rs. 10/-

### A REPORT ON FACTIONS IN ANANTHAPUR DISTRICT

ముఠాకక్షల విషయంలో కడప, కర్నూలు జిల్లాలకున్నంత చెడ్డ పేరు అనంతపురానికి లేకపోయినప్పటికీ, అనంతపురానికి సహితం కొంత దుష్ట చరిత్ర ఉంది. ప్రస్తుత తరంలో జె.సి. దివాకర్‌రెడ్డి, సూర్యప్రతాపరెడ్డి, పరిటాల రవి ఈ చరిత్రకు ప్రధాన ప్రతినిధులు కాగా, వీరికి ముందు పెనుకొండ తాలూకాలో కనుముక్కల చెన్నారెడ్డి, మద్దులచెరువు నారాయణ రెడ్ల దౌర్జన్యాలున్నాయి. వారిని ఫాక్షన్ పద్ధతిలో ఎదుర్కొన్న కమ్యూనిస్ట్ సానుభూతిపరుడు పరిటాల శ్రీరాములు చరిత్ర వుంది. అంత కంటే పూర్వకాలంలో పాందుర్తి పెదబయ్యపురెడ్డికీ దొరిగల్లు రంగారెడ్డికీ ఉన్న ఫాక్షన్ గురించి కథలిప్పటికీ చెప్పుకుంటారు. ఉరవకొండ తాలూకాలో కౌకుంట్ల భూస్వామి పయ్యావుల కేశన్న (ప్రస్తుత ఉరవకొండ ఎమ్మెల్యే కేశవులు తాత) పెత్తనాన్ని ఎదుర్కొనడానికి కమ్యూనిస్ట్ పార్టీ చేసిన పోరాటం ఫాక్షన్ రూపం తీసుకున్న చరిత్ర కూడ వుంది.



✡ ✡ ✡

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం దాదాపు ఆరు సంవత్సరాలుగా రాయలసీమ జిల్లాలలోని సాయుధ పెత్తందారీ ముఠాల ప్రాబల్యాన్ని ఒక పౌరహక్కుల సమస్యగా గుర్తించి దానికి వ్యతిరేకంగా ప్రజలలో అవగాహన, చైతన్యం కలిగించడానికి కృషి చేస్తున్నది. రాయలసీమ జిల్లాలు ఫాక్షన్ సంస్కృతి నుండి, ఫాక్షనిస్టుల పెత్తనం నుండి బయటపడడం ఆ జిల్లాల సామాజిక జీవిత ప్రజాస్వామీకరణకు అవసరం.

*A Publication by*
**Andhra Pradesh Civil Liberties Committee**